www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సీపీఎస్ రద్దు హామీని నిలబెట్టుకోవాలి

పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయుల భారీ ధర్నా

వేలాదిగా వచ్చిన టీచర్లు

నల్ల దుస్తులతో నిరసన

ఏడాదిలోగా పాత పింఛను పథకాన్ని పునరుద్ధరించాలి

ఉద్యోగుల జేఏసీ తీర్మానం


ఇందిరా పార్క్ వద్ద జరిగిన ధర్నాకు భారీగా తరలివచ్చిన ఉపాధ్యాయులు 14

మంగళవారం | 2-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 155

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: దశమి తె. 3.53 తదుపరి ఏకాదశి; నక్షత్రం: మూల రా.9.51 తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: 8.07-9.51; దుర్ముహూర్తం: ఉ.8.32-9.22, రా.10.13-10.59; అమృతఘడియలు: మ.2.56-4.39; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.24

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు తగవు

భారత వైఖరితో ఏకీభవించిన షాంఘై సహకార సంస్థ

పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ ఉమ్మడి ప్రకటన

జూన్‌లో ఎస్‌సీవో రక్షణ మంత్రుల భేటీలో రూపొందించిన ప్రకటనలో పహల్గాం అంశం లేకపోవడంపై భారత్ నిరసన

సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి నాడు నిరాకరణ

ఈ నేపథ్యంలో మారిన ఎస్‌సీవో వైఖరి.. డిక్లరేషన్

ఇది భారతదేశానికి అతిపెద్ద దౌత్య విజయం: నిపుణులు

అభివృద్ధి బ్యాంకు ఏర్పాటుకు సభ్యదేశాల ఆమోదం

తియాన్జిన్, సెప్టెంబరు 1: ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని.. షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు ఆమోదనీయం కాదన్న భారత వైఖరితో ఏకీభవించాయి. భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, పలు దేశాల నాయకులతో తియాన్జిన్‌లో రెండురోజులుగా జరుగుతున్న ఎస్‌సీవో వార్షిక సదస్సు సోమవారం

మిగతా 2వ పేజీలో...

◀ ఎస్‌సీవో సదస్సులో పుతిన్, జిన్‌పింగ్‌లతో మోదీ; పుతిన్‌తో మోదీ సంభాషణ (నిలబడి చూస్తున్న పాక్ ప్రధాని) ▶



ఉగ్రవాదంపై పోరు.. మానవత్వం పట్ల మన బాధ్యత

టెర్రరిస్టులకు కొన్ని దేశాల బహిరంగ మద్దతు

అంగీకారయోగ్యమేనా: ఎస్‌సీవోలో ప్రధాని మోదీ

పాక్ ప్రధాని షెహబాజ్ సమక్షంలోనే నిప్పులు

ప్రపంచశాంతికి భారత్-రష్యా స్నేహం కీలకం!

ఆర్థిక, వాణిజ్య, ఇంధన రంగాల్లో సహకారంపై మోదీ, పుతిన్ చర్చలు.. పుతిన్ కారులోనే వేదిక వద్దకు..

దాదాపు గంటపాటు దాంట్లోనే సంభాషణ

'బ్రాహ్మణులే లాభపడుతున్నారు.. తక్కినవారి ప్రయోజనాలు బలి: ట్రంప్ సలహాదారు నవరో



వైద్య విద్యలో ప్రవేశానికి.. 'నాలుగేళ్ల స్థానికత' తప్పనిసరి

9 నుంచి 12వ తరగతి వరకు రాష్ట్రంలో చదవాల్సిందే

తెలంగాణ ప్రభుత్వ జీవో 33ని సమర్థించిన సుప్రీంకోర్టు.. హైకోర్టు ఉత్తర్వుల కొట్టివేత

4 క్యాటగిరీలకు ప్రత్యేక మినహాయింపు

స్థానికత అంశంపై సుప్రీంకోర్టు తుది తీర్పు

వైద్య విద్యలో ప్రవేశాలకు లైన్ క్లియర్

11 తర్వాత కన్వీనర్ కోటా కౌన్సిలింగ్

న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు లైన్ క్లియరైంది. వైద్య విద్యలో ప్రవేశానికి 9 నుంచి 12వ తరగతి వరకు.. నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అంటూ రాష్ట్ర ప్రభుత్వం 2017లో జారీ చేసిన జీవో-33ని సుప్రీంకోర్టు సమర్థించింది. గత ఏడాది ఆ జీవోలో చేసిన సవరణను కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం ఆమోదించింది. ఆ జీవోను వ్యతిరేకిస్తూ.. హైదరాబాద్‌కు చెందిన కల్లూరి అభిరామ్, మరో 160 మంది గతంలో హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.! దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత హైకోర్టు ధర్మాసనం విద్యార్థులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. "ఒక విద్యార్థి తెలంగాణలో

మిగతా 3వ పేజీలో...

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

కాళేశ్వరం ఎపిసోడ్‌లో ప్రధాన పాత్ర హరీశ్‌రావుదే

- అందుకే ఆయనను రెండో టర్మ్‌లో ఇరిగేషన్ మంత్రిగా కేసీఆర్ తొలగించారు
- ఆ ఇద్దరి వల్లే కేసీఆర్‌కు అవినీతి మరక.. వారిని కాపాడుతున్నది సీఎం రేవంత్‌రెడ్డి
- కాదంటే వాళ్ల అవినీతిని బయట పెట్టాలి.. మా నాన్న పరిస్థితిని దగ్గరుండి చూశాను
- నా పెళ్లికి డబ్బుల కోసమూ ఇబ్బంది పడ్డారు.. డబ్బుపై ఆయనకు ఏనాడూ ఆశ లేదు
- అలాంటి వ్యక్తిపై సీబీఐ కేసా?.. నాపై దుష్ప్రచారం చేశారో.. తోలుతీస్తా.. కవిత ఫైర్

'కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తూ ఏ క్షణమైనా జీవో'

నేటి వరకు తదుపరి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోండి

హైకోర్టుకు కేసీఆర్, హరీశ్‌రావు విజ్ఞప్తి 11

ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వని కోర్టు.. నేడు వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం

కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, మంత్రులకు అసెంబ్లీలో హరీశ్ 'మాస్టర్ క్లాస్': కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావు, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ అవినీతి అనకొండలు అని ఆరోపించారు. కేసీఆర్ నీళ్ల కోసం ఆలోచిస్తే.. వారు మాత్రం పెద్ద పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఆస్తులు పెంచుకునే ఆలోచన చేశారని అన్నారు. వారు చేసిన చెత్తపనుల వల్ల కేసీఆర్ అప్రతిష్టపాలయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. హరీశ్, సంతోష్‌తోపాటు ఓ నిర్మాణ సంస్థ ప్రతినిధి కారణంగా కాళేశ్వరం ఎపిసోడ్‌లో కేసీఆర్‌కు అవినీతి మరక అంటిందన్నారు. కేసీఆర్‌కు తెలంగాణ ధ్యాస తప్ప.. డబ్బుపై ఆశ లేదని, ఆయనపై సీబీఐ విచారణ చేపట్టే పరిస్థితి రావడం తనను వేదనకు గురిచేస్తోందని తెలిపారు. హరీశ్, సంతోష్ తనపై ఎన్ని కుట్రలు చేసినా భరించానని, ఇకపై ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేస్తే తోలు తీస్తానని హెచ్చరించారు. కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కవిత సోమవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కవిత మాట్లాడుతూ, "హరీశ్‌రావు, సంతోష్ అవినీతి అనకొండలు. ఈ అనకొండల వల్లే కాళేశ్వరం ఎపిసోడ్‌లో కేసీఆర్‌కు మరక అంటింది. కేసీఆర్ నీళ్ల కోసం ఆలోచిస్తే.. వీళ్లు మాత్రం పెద్ద పెద్ద కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఆస్తులు పెంచుకోవాలని ఆలోచించారు. ఐదేళ్లు సాగునీటి మంత్రిగా చేసిన హరీశ్‌కు ఇందులో మేజర్ పాత్ర లేదా? అందుకే కదా.. రెండో టర్మ్‌లో పార్టీ అధినేత ఆయనను తప్పించింది! ఇదే హరీశ్, సంతోష్ నాపై ఎన్ని కుట్రలు చేసినా భరించాను. నాపై బహిరంగంగా

మిగతా 7వ పేజీలో...



కవిత సస్పెన్షన్ ఖాయం?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!

కీలక నేతలతో అధినేత కేసీఆర్ సమావేశం

ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టమనే అభిప్రాయం

ఎక్స్‌లో కవిత అన్‌ఫాలోకు ఆదేశాలు

సోషల్ మీడియా, టీవీ చర్చల్లో ఆమెపై దాడి

బీఆర్ఎస్ఎల్పీ వాట్సాప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్ 7

బీఆర్ఎస్ నుంచి సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



డీజీపీగా శివధర్ రెడ్డి?

ఈ నెలాఖరున జితేందర్ పదవీ విరమణ

కొత్త బాస్ ఎవరు?.. పోలీసు శాఖలో చర్చ

నిఘా బాధ్యతలు సజ్జనార్‌కు.. ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్.. హైదరాబాద్ సీపీగా భగవత్!

అధికారుల పేర్లను పరిశీలిస్తున్న ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీజీపీ జితేందర్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనుండడంతో కొత్త పోలీస్ బాస్ ఎవరనేదానిపై ఆ శాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది. మరోవైపు ఇతర కీలక విభాగాల్లో అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపైనా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దృష్టి సారించినట్లు సమాచారం. కీలక బాధ్యతల్లో ఎవర్ని నియమించాలో ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చినట్లు తెలిసింది. కొత్త డీజీపీగా ప్రస్తుతం ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్ రెడ్డిని నియమించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయన స్థానంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌ను నియమించే అవకాశం ఉంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ డీజీ సీవీ ఆనంద్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) మహేశ్ భగవత్ పేరును ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ఉన్న రవిగుప్తాను విజిలెన్స్‌కు, జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రాను హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు

మిగతా 10వ పేజీలో...


గవర్నర్ జిష్ణుదేవ్‌తో మహేశ్‌గౌడ్, పొన్నం, ఆది శ్రీనివాస్, నారాయణ

బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించండి

గవర్నర్ జిష్ణుదేవ్‌ను కోరిన అఖిలపక్ష నేతలు

కాంగ్రెస్ నాయకత్వంలో గవర్నర్ వద్దకు

అఖిలపక్షంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకే బిల్లు: మహేశ్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు శాసనసభ ఆమోదించిన బిల్లుకు ఆమోదముద్ర వేయాలని అఖిలపక్ష నేతలు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. బీసీలకు 42 శాతం కల్పించేందుకుగాను స్థానిక సంస్థల్లో 50 శాతంగా ఉన్న రిజర్వేషన్ల పరిమితిని తొలగించేందుకు పంచాయతీ రాజ్ చట్టం-2018లోని సెక్షన్ 285(ఏ)ను

మిగతా 12వ పేజీలో...


జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నక్సలిజం ఓ ఫిలాసఫీ

ఆ భావజాలం నచ్చకపోతే వాదించి గెలవాలి 12

కానీ.. దాడి చేసి అంతం చేస్తామంటే కుదరదు

ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలుగు బిడ్డ

ఆయన విజయం కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలు కృషి చేయాలి

సుదర్శన్‌రెడ్డి అభినందన కార్యక్రమంలో సీఎం రేవంత్

నాపై విమర్శలు చేస్తే ఎన్నికను వదిలేస్తాననుకున్నారు

సుప్రీంతీర్పులను విమర్శించే ముందు వాటిని చదవాలి

అమిత్ షాను ఉద్దేశించి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్యలు

ఓట్ల చోరీపై.. త్వరలోనే హైడ్రోజన్ బాంబు!

మేం బయటపెట్టే వివరాలతో మోదీ ముఖం చూపలేరు

బీజేపీ వాళ్లు ఇందుకు సిద్ధంగా ఉండాలి: రాహుల్

బిహార్ సీఎం నితీశ్ అవినీతి భీష్ముడు: తేజస్వీ యాదవ్

పట్నాలో ముగిసిన 'ఓటర్ అధికార యాత్ర'


పట్నాలో ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సభలో రాహుల్

పట్నా, సెప్టెంబరు 1: ఓట్ల చోరీకి సంబంధించి 'హైడ్రోజన్ బాంబు' లాంటి వివరాలను బయటపెట్టబోతున్నామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. అవి చూశాక ప్రధాని మోదీ దేశానికి ముఖం చూపించలేరని అన్నారు. బిహార్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా గత నెల 16న ఆయన ససారంలో ప్రారంభించిన 'ఓటర్ అధికార్ యాత్ర' సోమవారం పట్నాలో

మిగతా 2వ పేజీలో...


అఫ్గానిస్థాన్‌లోని కునార్‌లో క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

అఫ్గాన్‌లో భూకంపం

800 మందికి పైగా మృతి

2,800 మందికి గాయాలు

మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం

తెరిపిలేని వర్షాలతో సహాయ చర్యలకు ఆటంకం

భారత్ తక్షణ సాయం.. 15 టన్నుల ఆహారం, వెయ్యి గుడారాలు

ఆదుకోవాలని అన్ని దేశాలకు తాలిబాన్ ప్రభుత్వం వినతి

కాబూల్/ న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: భారీ భూకంపం అఫ్గానిస్థాన్‌ను కుదిపేసింది. ఇంతవరకు 802 మంది మరణించగా, 2,800 మంది గాయపడ్డారని సోమవారం అధికారవర్గాలు తెలిపాయి. మారుమూల పర్వత ప్రాంతాల్లో భూకంపం సంభవించడం, అక్కడ తెరిపి లేకుండా భారీగా వర్షాలు కురుస్తుండడం, కొండచరియలు

మిగతా 9వ పేజీలో...

లారీ-వోల్వో బస్సు ఢీకొని నలుగురి మృతి

పాలమూరు జిల్లా కాటవరంలో ఘటన 3

జోగులాంబ జిల్లాలో నిమజ్జనానికి వెళ్తున్న ట్రాక్టర్‌ని ఢీకొన్న డీసీఎం.. ఇద్దరి మృతి

తెలంగాణలో కొత్త విద్యా విధానం

కేంద్ర విధానానికి అనుగుణంగా రూపొందించేందుకు కమిటీ

కేశవరావు నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో ఏర్పాటు 12

అక్టోబరు 30లోపు నివేదిక

ఆరోగ్యానికి తీపి కబురు

- తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద ఎఫ్‌వోఎస్ ప్లాంట్
- నిజామాబాద్ సమీపంలో 2027 కల్లా నిర్మాణం పూర్తి
- బీఐఆర్ఏసీ సహకారంతో నిర్మిస్తున్న రివిలేషన్స్ బయోటెక్ 14
- చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఎఫ్‌వోఎస్ వినియోగం
- 20 వేల టన్నుల సామర్థ్యం.. 700 మందికి ఉపాధి అవకాశాలు



వరద నష్టంపై 2 రోజుల్లో సమగ్ర నివేదిక

4న నివేదికతో ఢిల్లీకి భట్టి విక్రమార్క నేతృత్వంలో బృందం

చెరువుల మరమ్మతులు, సహాయక చర్యలు వేగవంతం 12


మృతుల కుటుంబాలకు వెంటనే రూ.5 లక్షల పరిహారం

తీవ్ర ప్రభావిత జిల్లాలకు తక్షణ సాయం కింద రూ.10కోట్లు

రాష్ట్రంలో 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో నష్టం

సచివాలయంలో అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

రష్యా చమురుతో 'బ్రాహ్మణులే' లాభపడుతున్నారు



- రష్యాకు భారత్ ఓ లాండ్రీవాలా
- మళ్లీ నోరు పారేసుకున్న నవారో

వాషింగ్టన్, సెప్టెంబరు 1: భారత్‌పై నోరుపారేసుకోవడమే పనిగా పెట్టుకున్న వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో మరింతగా రెచ్చిపోయారు. రష్యా చమురు వ్యవహారంలో బ్రాహ్మణులే లాభపడుతున్నారని వ్యాఖ్యానించారు (ఆయన ఏ అర్థంలో ఆ వ్యాఖ్యలు చేశారో తెలియదు గానీ.. అమెరికాలో అత్యంత సంపన్నులైన వ్యాపారవర్గాలకు చెందిన ప్రొటెస్టెంట్లను బోస్టన్ బ్రాహ్మిన్స్‌గా వ్యవహరిస్తారు. ఈ వ్యవహారంలో సంపన్నులైన వ్యాపారులే లాభపడుతున్నారనే అర్థంలో నవారో ఈ వ్యాఖ్యలు చేసినట్టు కొంతమంది చెబుతున్నారు). చైనా, రష్యాలకు భారత్ దగ్గర అవుతుండటంపై 'ఫాక్స్ న్యూస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నవారో అక్కసు వెళ్లగక్కారు. మోదీ వంటి గొప్ప ప్రజాతంత్ర నాయకుడు.. పుతిన్, జిన్‌పింగ్‌లతో ఎందుకు అంటకాగుతున్నారో తనకు తెలియడం లేదన్నారు. 'ఇదంతా 'బ్రాహ్మణులు' చేస్తున్నారు. వారు తమ లాభాల కోసం తక్కిన జనం ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారు. ఈ విషయం భారత ప్రజలు తెలుసుకోవాలి." అని అన్నారు. "ముడిచమురుపై మోదీకి పుతిన్ రాయితీలు ఇచ్చారు. భారత్‌లో దానిని శుద్ధిచేయించి, యూరప్, ఆఫ్రికా, ఆసియాలకు సరఫరా చేసి పెద్దఎత్తున డబ్బులు చేసుకుంటున్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ఈ డబ్బులను వాడుతున్నారు. అలాంటప్పుడు సుంకాల చెల్లింపుదారులుగా అమెరికా ఏం చేయాలి." అని నవారో ప్రశ్నించారు. భారత్ సుంకాల మహారాజులా మారిందన్న ఆయన, క్రెమ్లిన్‌కు ల్యాండ్రోమ్యాట్‌గా (లాండ్రీవాలా) భారత్ పని చేస్తోందని నోరు పారేసుకున్నారు. కాగా.. నవారో వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో నెటిజెన్లు తీవ్ర విమర్శలు కురిపిస్తున్నారు. ప్రధాని మోదీ వాణిజ్య సలహామండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ నవారో వ్యాఖ్యలను ఖండించారు. బ్రాహ్మణులను ఉద్దేశించి నవారో చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటు అని, అవి ఆయన కురచబుద్ధిని బయటపెట్టాయని శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ ప్రియాంక చతుర్వేది ఆగ్రహం వ్యక్తం చేశారు. "అమెరికాలో బ్రాహ్మణ పదానికి వేరే అర్థం ఉంది. సంపన్న కులీన వర్గాన్ని ఆ పేరుతో పిలుస్తారు. దానికీ, కుల వ్యవస్థకూ సంబంధమే లేదు. కానీ, దురుద్దేశంతో ఆ పదాన్ని నవారో ఉపయోగించారు." అని ఆమె మండిపడ్డారు. ఇదిలా ఉండగా, రష్యా, చైనా, భారత్ ఒక వేదిక మీదకు వచ్చిన వేళ...భారత్‌పై అమెరికా అనూహ్యంగా స్వరం మార్చింది. నిన్నటిదాకా నోటికి వచ్చినట్టు భారత్‌పై విమర్శలు చేసిన అమెరికా ప్రభుత్వం ఒక్కసారిగా స్నేహగీతికను ఆలపించింది. "21వ శతాబ్దంలో మా సంబంధాలు కొత్త శిఖరాలను తాకుతున్నాయి. మా బంధం అర్థవంతమైంది. మమ్మల్ని ముందుకు తీసుకెళ్లే పలు అంశాలపై ఈ నెలలోనే దృష్టి సారించనున్నాం" అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అన్నారు.

అమెరికా బెదిరింపులు సాగవు: జిన్‌పింగ్

టియాంజిన్, సెప్టెంబరు 1: ఎస్‌సీవో సదస్సు వేదికగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అమెరికాకు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ సమాజంలో బెదిరింపు ధోరణిని అంగీకరించబోమని, నిష్పాక్షిత, న్యాయం, బహుళత్వానికి ప్రాధాన్యం ఉండాలని జిన్‌సింగ్ అన్నారు. చైనాతో సహా ఇతర దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా సుంకాలు విధించడాన్ని ఉద్దేశించే జిన్‌సింగ్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. సదస్సులో జిన్‌సింగ్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి కేంద్రీకృత వ్యవస్థలైన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వంటి వాటిని రక్షించుకోవాలన్నారు. ఎస్‌సీవో సభ్యదేశాలు పరస్పర ప్రయోజనాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. విభేదాలను పక్కనపెట్టి ఒక్కటవ్వాలని, వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ఏకాభిప్రాయంతో ఉండాలని అన్నారు. అప్పుడే ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధి సాధ్యమన్నారు.

షాంఘై సదస్సులో పాక్ ప్రధానికి పరాభావం!

తియాన్‌జిన్, సెప్టెంబరు 1: ఎస్సీవో సదస్సు సందర్భంగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్‌కు పరాభవం ఎదురైంది. ఆయనను సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్న చైనా అధ్యక్షుడు జీన్‌పింగ్ సహా భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లు పట్టించుకోలేదు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మోదీ, జిన్‌పింగ్, పుతిన్ కరచాలనాలు చేసుకుంటూ.. సరదాగా మాట్లాడుకుంటూ.. చిరునవ్వులు చిందిస్తూ కనిపించగా.. షెహబాజ్ ఒంటరిగా ఉండిపోయారు. సదస్సు వేదిక వద్దకు కలిసి వచ్చిన మోదీ, పుతిన్‌కు జిన్‌పింగ్ స్వాగతం పలికారు. సదస్సుకు హాజరైన వివిధ దేశాధినేతలు వేచి చూస్తుండగా మోదీ, పుతిన్, జిన్‌పింగ్ పలకరింపుల తర్వాత మాటల్లో పడిపోయారు. వారి ముచ్చట్లు, నవ్వుల్లో రెండు నిమిషాలు దొర్లిపోయాయి. తర్వాత మోదీ, పుతిన్ నడిచి వెళుతుండగా మధ్యలో షెహబాజ్ నిల్చుని ఉన్నప్పటికీ వారు పట్టించుకోకుండా మాట్లాడుకుంటూ ముందుకు సాగిపోయారు. పహల్గాం ఉగ్ర దాడి, దానికి ప్రతీకారంగా భారత్ చేపట్టి ఆపరేషన్ సిందూర్ తర్వాత మోదీ, షెహబాజ్ ఎదురుపడడం ఇదే తొలిసారి.

భారత్, చైనా సంబంధాల్లో పురోగతి భేష్

- మోదీ, జిన్‌పింగ్ చర్చలను స్వాగతించిన వామపక్షాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: ఎస్సీవో సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ జరిపిన చర్చల ఫలితంగా ఇరు దేశాల సంబంధాల మధ్య పురోగతిని వామపక్ష పార్టీలు స్వాగతించాయి. మోదీ, జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశం సానుకూల ఫలితాన్ని ఇచ్చిందని సోమవారం సీపీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రపంచంలోనే పురాతన నాగరికత గల భారత్, చైనా ప్రత్యర్థులుగా కాకుండా భాగస్వాములుగా ఉండాలని ఈ సమావేశం పునరుద్ఘాటిస్తోందని వ్యాఖ్యానించింది. భారత్, చైనా సంబంధాల్లో పురోగతిని సీపీఎం స్వాగతించింది. 'భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75వ వార్షికోత్సవం సందర్భంగా ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాల్లో సానుకూల పురోగతి కనిపిస్తోంది. ఇది శుభ సూచకం' అని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు.

భారత్, చైనాపై మీరూ సుంకాలు విధించండి

- ఐరోపా సమాఖ్యపై అమెరికా ఒత్తిడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: భారత్‌పై తాము విధించినట్లే యూరోపియన్ యూనియన్ (ఈయూ) కూడా అదనపు సుంకాలు వేయాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది. దీంతో పాటు భారత్ నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును ఆపివేయాలని కూడా కోరుతోంది. అలాగే, రష్యాపై తాను మాత్రమే ఒత్తిడి తేవడం కాకుండా.. ఈయూ కూడా కలిసి రావాలని అమెరికా పట్టుబడుతోంది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలుపై ఈయూ పూర్తి నిషేధం విధించాలని అడుగుతోంది. ఈ విషయాలను ఇండియా టుడే, అమెరికాకు చెందిన న్యూస్ వెబ్‌సైట్ యాక్సియస్.. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ కథనాలు ప్రచురించాయి. ఈయూ కూడా భారత్‌తో పాటు చైనాపై అదనపు సుంకాలు విధించాలని అమెరికా కోరినట్లు ఇండియా టుడే పేర్కొంది.

ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

ముగిసింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలనే తమ దృఢ సంకల్పాన్ని ఎస్‌సీవో సభ్య దేశాలు ఈ సందర్భంగా ఒక ఉమ్మడి ప్రకటన ద్వారా వెల్లడించాయి. ఉగ్రవాద, వేర్పాటువాద, తీవ్రవాద వ్యతిరేక పోరాటానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. అలాంటి గ్రూపులను స్వార్థ ప్రయోజనాలకు వాడుకునే ప్రయత్నాలు అంగీకారయోగ్యం కావని ఆ డిక్లరేషన్‌లో స్పష్టం చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని.. దేశాల సరిహద్దులు దాటి వెళ్లే ఉగ్రవాదుల కదలికలను నిరోధించాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చాయి. అలాగే.. గాజాలో ఇజ్రాయెల్ సైనిక దాడులను, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సైనిక దాడులను, పాక్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్ ఖుజ్దర్‌లో, జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై జరిగిన ఉగ్రదాడులను కూడా ఎస్‌సీవో సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇరాన్‌లోని పౌరులను, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల వల్ల ఎంతో మంది సామాన్యులు మరణించారని.. ఇది ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను, ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని మండిపడ్డాయి. ఉగ్ర దాడుల వెనుక సూత్రధారులను, వారికి సహకరించినవారిని, దాడులకు పాల్పడినవారిని చట్టం ముందు నిలబెట్టి, కఠినంగా శిక్షించాలని ఎస్‌సీవో సభ్యదేశాలు పేర్కొన్నాయి. ప్రపంచంలోని అన్ని ఉగ్రవాద గ్రూపులనూ ఉమ్మడిగా ఎదుర్కొనే విషయంలో కీలకపాత్ర ఐక్యరాజ్యసమితిదే అని తమ సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశాయి.

భారత్ విజయం..

ఎస్‌సీవో డిక్లరేషన్‌లో పహల్గాం ఉగ్రదాడి అంశం ఉండడం భారత్ సాధించిన అతిపెద్ద దౌత్య విజయం. ఎందుకంటే.. ఈ ఏడాది జూన్ 26న చైనాలోని చింగ్దావ్‌లో ఎస్‌సీవో సభ్యదేశాల రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఆ సమావేశానికి మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా హాజరయ్యారు. అయితే.. ఆ భేటీలో రూపొందించిన ముసాయిదా సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి ఆయన నిరాకరించారు. బలూచ్ ప్రావిన్స్‌లో జరిగిన ఉగ్రదాడులను ఖండిస్తూ పాక్‌కు అనుకూలంగా రూపొందించిన ఆ ప్రకటనలో.. పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడమే అందుకు కారణం. పహల్గాం దాడిని ఆ ప్రకటనలో చేర్చడానికి ఒక దేశం అభ్యంతరం వ్యక్తం చేసిందని.. చేర్చకపోవడంపై రాజ్‌నాథ్ ఆగ్రహం వెలిబుచ్చారని.. దీంతో ఆ ప్రకటన ఆమోదం పొందలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ అప్పట్లో తెలిపారు. ఆ పరిణామం జరిగిన రెండు నెలల్లోనే.. పాకిస్థాన్, చైనా రెండూ సభ్య దేశాలుగా ఉన్న ఎస్‌సీవో పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేయడం.. అంతటితో సరిపెట్టకుండా, సరిహద్దుల వద్ద ఉగ్రవాదుల కదలికలపై కన్నేసి ఉంచాలని పాకిస్థాన్‌కు పరోక్షంగా చురకలంటించే వ్యాఖ్యలు అందులో ఉండడం.. అలాంటి ప్రకటనపై పాక్‌తో పాటు, ఆ దేశంతో అంటకాగే చైనా కూడా సంతకం చేయడం.. భారత్ సాధించిన అతిపెద్ద దౌత్య విజయంగా విదేశాంగ వ్యవహారాల నిపుణులు పేర్కొంటున్నారు.




ఎస్‌సీవో సదస్సు సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్‌తో ప్రధాని మోదీ ముచ్చట్లు

అభివృద్ధి బ్యాంకు ఏర్పాటుకు ఆమోదం

ప్రాంతీయ సామర్థ్యాన్ని, సామాజిక అభివృద్ధిని పెంపొందించడానికిగాను ఒక అభివృద్ధి బ్యాంకును ఏర్పాటు చేయాలని 'షాంఘై సహకార సంస్థ' సభ్యదేశాలు నిర్ణయించినట్టు చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ వెల్లడించారు. చైనా చేసిన ఈ ప్రతిపాదనపై పదేళ్లపాటు చర్చించిన అనంతరం సభ్యదేశాలు దానికి ఆమోదం తెలిపాయని ఆయన వివరించారు. అయితే.. ఈ బ్యాంకు ఎప్పటిలోగా ఏర్పాటు చేయనున్నారనే విషయమై ఆయన ఎలాంటి వివరాలూ తెలపలేదు. అలాగే.. లావోస్‌ను ఎస్‌సీవోలో కొత్త భాగస్వామిగా చేరినట్టు ఆయన వెల్లడించారు. 2001లో షాంఘైలో ఏర్పాటైన ఎస్‌సీవోలో.. భారత్, రష్యా, చైనా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, పాకిస్థాన్, ఇరాన్, బెలారస్ సభ్యదేశాలుగా ఉన్నాయి.

లోకం తీరు



ఉగ్రవాదంపై పోరు.. మన బాధ్యత

- మానవత్వంపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్క దేశానికీ పహల్గాం ఉగ్రదాడి బహిరంగ సవాల్ వంటిది: ఎస్‌సీవోలో ప్రధాని మోదీ

తియాన్జిన్, సెప్టెంబరు 1: ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలను విడనాడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై పోరాటాన్ని మానవత్వం పట్ల మన బాధ్యతగా అభివర్ణించారు. చైనాలోని తియాన్జిన్‌లో జరిగిన ఎస్‌సీవో వార్షిక సదస్సులో.. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తదితర దేశాధినేతల సమక్షంలో ప్రసంగించిన ఆయన.. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్ర దాడి గురించి ప్రధానంగా ప్రస్తావించారు. అది కేవలం భారత్‌పై జరిగిన దాడి మాత్రమే కాదని.. మానవత్వంపై నమ్మకం ఉన్న ప్రతి దేశానికీ అది ఒక బహిరంగ సవాల్ వంటిదని ఆయన పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం.. ఆ విషాద సమయంలో భారతదేశానికి అండగా నిలిచిన అన్ని స్నేహపూర్వక దేశాలకూ మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉగ్రవాదం కొన్ని దేశాల భద్రతకు మాత్రమే పొంచి ఉన్న ముప్పు కాదని.. మొత్తం మానవాళికే అది ఉమ్మడి సవాల్ అని వ్యాఖ్యానించారు. "కానీ కొన్ని దేశాలు ఉగ్రవాదానికి బహిరంగంగా మద్దతు పలుకుతున్నాయి. ఇది మనకు అంగీకారయోగ్యమేనా?" అని ప్రశ్నించారు. "ఏ దేశమూ, ఏ సమాజమూ, ఏ ఒక్క పౌరుడూ ఉగ్రవాదం నుంచి తాము సురక్షితంగా ఉన్నామని భావించలేని పరిస్థితి. అందుకే ఉగ్రవాదంపై పోరాటంలో ఐక్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని భారత్ పదేపదే నొక్కిచెబుతోంది" అని స్పష్టంచేశారు. "ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ ప్రమాణాలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదనే విషయాన్ని మనం స్పష్టంగా, ముక్తకంఠంతో చెప్పాలి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే దాన్ని ఉమ్మడిగా వ్యతిరేకించాలి. ఇది మానవత్వం పట్ల మన కర్తవ్యం" అని మోదీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కాగా.. ఎస్‌సీవోకు మోదీ తనదైన భాష్యం చెప్పారు. ఎస్ అంటే సెక్యూరిటీ (భద్రత), సీ అంటే కనెక్టివిటీ (అనుసంధానం), ఓ అంటే ఆపర్చునిటీ (అవకాశం) అనే మూడు పిల్లర్లపై ఎస్‌సీవో నిలిచి ఉందని ఆయన పేర్కొన్నారు. ఏ దేశ అభివృద్ధికైనా భద్రత, శాంతి, స్థిరత్వం పునాదుల వంటివని.. ఆ వృద్ధి పథంలో ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం ప్రధాన సవాళ్లుగా నిలుస్తాయని అన్నారు.

చైనాకు చురకలు..

ప్రాంతీయ వృద్ధి, అభివృద్ధికి అనుసంధానం (కనెక్టివిటీ) ఎంత ముఖ్యమైనదో కూడా ప్రధాని మోదీ తన ప్రసంగంలో తెలిపారు. అయితే.. ఆ అనుసంధానం కోసం చేసే ప్రతి ప్రయత్నం సార్వభౌమత్వ సూత్రాలను, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని.. ఎస్‌సీవో చార్టర్‌లోని ప్రధాన సూత్రాల్లో దీన్ని కూడా పొందుపరచారని గుర్తుచేశారు. సార్వభౌమత్వాన్ని పట్టించుకోని అనుసంధానం చివరికి నమ్మకాన్ని, అర్థాన్ని కోల్పోతుందని వ్యాఖ్యానించారు. తద్వారా చైనా తలపెట్టిన 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్'ను పరోక్షంగా విమర్శించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ గుండా వెళ్లే ఈ ప్రాజెక్టును భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే.. ఎస్‌సీవో సభ్య దేశాల ప్రాచీన నాగరికతల, కళల, సాహిత్య సంపదను, సంప్రదాయాలను ప్రపంచ వేదికపై పంచుకునేలా ఒక చర్చా వేదికను ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు. గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల) అభివృద్ధి సాధనకు కృషి చేయడం ఎంత ముఖ్యమో పేర్కొన్నారు. ఆయా దేశాల ఆకాంక్షలను కాలంచెల్లిన పాత విధానాలు, పాత నియమాల చట్రంలో బంధించి ఉంచడమంటే.. భవిష్యత్ తరాలకు అన్యాయం చేయడమేనని ఆందోళన వెలిబుచ్చారు.

ప్రపంచశాంతికి భారత్-రష్యా స్నేహం కీలకం!

- పుతిన్ రాక కోసం భారతీయుల ఎదురుచూపులు
- ఉక్రెయిన్‌లో శాంతి.. యావత్ మానవాళి కోరిక: మోదీ

బీజింగ్, సెప్టెంబరు 1: అత్యంత క్లిష్ట సందర్భాల్లో కూడా భారత్-రష్యా భుజం భుజం కలిపి నడిచాయని, ఇరుదేశాల సంబంధాలు ప్రపంచశాంతికి, సుస్థిరతకు కీలకమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. డిసెంబరులో రష్యా అధ్యక్షుడు పుతిన్ రాక కోసం 140 కోట్ల మంది భారతీయులు ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. సోమవారం చైనాలోని టియాన్‌జిన్‌లో 'షాంఘై సహకార సంఘం' (ఎస్‌సీఓ) వార్షిక శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో పుతిన్‌తో మోదీ సమావేశమయ్యారు. ఆర్థిక, వాణిజ్య, ఇంధన రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే దిశగా ఇరు నేతలు చర్చలు జరిపారు. ఎరువుల అంశానికి కూడా చర్చల్లో ప్రాధాన్యం లభించింది. చర్చలపై మోదీ, పుతిన్‌ల స్పందనను వెల్లడిస్తూ ఇరుదేశాలు అధికారిక ప్రకటనలు వెలువరించాయి. మోదీ స్వయంగా ఎక్స్‌లో తన స్పందనను వెల్లడించారు. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన కోసం జరుగుతున్న ప్రయత్నాలను భారత్ స్వాగతిస్తుందని, ఘర్షణల నివారణ జరగాలని యావత్ మానవాళి కోరుకుంటున్నదని తెలిపారు. శాంతియుత పరిస్థితులు చిరకాలం పాటు నిలిచి ఉండేలా అన్ని భాగస్వామ్యపక్షాలు నిర్మాణాత్మక అడుగులు వేయాలని అభిలషించారు. కాగా, రష్యా-భారత్ దశాబ్దాలుగా పరస్పర విశ్వాసంతో కూడిన స్నేహాన్ని కొనసాగిస్తున్నాయని, భవిష్యత్ సంబంధాలకు ఇదే పునాది అని పుతిన్ పేర్కొన్నారు. ఇరుదేశాల స్నేహం పార్టీల రాజకీయాలకు అతీతమైనదని, ఇరుదేశాల ప్రజలు కూడా దీనికి మనస్ఫూర్తిగా మద్దతిస్తున్నారని తెలిపారు. పలు స్థాయిల్లో రష్యా-భారత్ సహకారం కొనసాగుతోందని, ఇరుదేశాల మధ్య పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతోందన్నారు. అంతర్జాతీయ వేదికలపై అత్యంత సమన్వయంతో వ్యవహరిస్తున్నామని పేర్కొంటూ ఐరాస, బ్రిక్స్, జీ20, ఎస్‌సీఓల గురించి పుతిన్ ప్రస్తావించారు.



మోదీ కోసం వేచి చూసిన పుతిన్

ద్వైపాక్షిక చర్చలకు వేదికైన భవనాన్ని చేరుకోవటానికి మోదీ, పుతిన్.. ఎస్‌సీఓ సదస్సు ప్రాంగణం నుంచి పుతిన్ కారులో ప్రయాణించారు. ఈ సందర్భంగా, మోదీ రాక కోసం పుతిన్ దాదాపు 10 నిమిషాలు వేచి ఉండటం విశేషం. అనంతరంకారులోనే నేతలిద్దరూ పలు అంశాలపై మాట్లాడుకున్నారని, వేదిక వద్దకు కారు చేరుకున్న తర్వాత కూడా.. దాదాపు 50 నిమిషాలు కారులో ఉండి సంభాషించుకున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. భారత్‌పై ట్రంప్ విధించిన 25 శాతం సుంకాలు.. ముఖ్యంగా, రష్యా నుంచి చమురు కొంటున్నందుకు అదనంగా మరో 25 శాతం సుంకం మోపటంపై మోదీ, పుతిన్ కారులో మాట్లాడుకున్నట్లు సమాచారం.

సుంకాలు సున్నాకు తగ్గించేందుకు భారత్ ముందుకొచ్చింది



న్యూయార్క్/వాషింగ్టన్, సెప్టెంబరు 1: భారత్‌ను లక్ష్యంగా చేసుకొని నిరాధార వ్యాఖ్యలతో పలుచనవుతున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మనదేశంపై విధించిన అధిక సుంకాలను సమర్థించుకుంటూ మరోసారి అలాంటి వ్యాఖ్యలే చేశారు. సుంకాలను సున్నాకు తగ్గించేందుకు భారత్ ముందుకొచ్చిందని, అయితే ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందని ట్రంప్ పేర్కొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లతో ప్రధాని మోదీ సమావేశమైన కొన్నిగంటల్లోనే సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఓ పోస్టు పెట్టారు. భారత్‌తో అమెరికా చాలా తక్కువగా వ్యాపార సంబంధాలు కలిగి ఉందని కొందరు అనుకుంటారని.. అయితే అమెరికాలో భారత్ భారీస్థాయిలో వ్యాపారం చేస్తోందని ట్రంప్ చెప్పారు. వాణిజ్యపరంగా భారత్‌కు అమెరికా అతిపెద్ద కొనుగోలుదారు (బిగ్గెస్ట్ క్లయింట్) అని పేర్కొన్నారు. అమెరికాలో భారత్ భారీగా వస్తువులను విక్రయిస్తోందని, అమెరికా మాత్రం భారత్ విధిస్తున్న అధిక సుంకాల కారణంగా అక్కడ వస్తువులను విక్రయించలేకపోతోందని.. ఇది కొన్ని దశాబ్దాలుగా కొనసాగిందని పేర్కొన్నారు.

ఓట్ల చోరీపై.. త్వరలోనే హైడ్రోజన్ బాంబు!

(మొదటి పేజీ తరువాయి)

ముగిసింది. 16 రోజుల పాటు 25 జిల్లాల్లోని 110 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా 1,300 కిమీ మేర ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా పట్నాలో ఇండీ కూటమికి చెందిన బిహార్ మహాగఠ్‌బంధన్ నేతలు 'గాంధీ సే అంబేడ్కర్' ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు వారిని మార్గమధ్యంలోనే డాక్ బంగళా వద్ద ఆపేశారు. అక్కడే గుమిగూడిన ప్రజలనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. బిహార్ విప్లవ రాష్ట్రమని.. ఓట్ల చోరీని అనుమతించబోమని దేశానికి సందేశం ఇచ్చిందని స్పష్టంచేశారు. మహాత్మాగాంధీని చంపిన శక్తులు రాజ్యాంగాన్ని హత్యచేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. దీనిని తాము అనుమతించబోమని.. అందుకే యాత్ర చేపట్టామని తెలిపారు. 'దీనికి అద్భుత స్పందన వచ్చింది. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి 'ఓట్ల దొంగల్లారా.. గద్దె దిగండి' అని నినదించారు. బీజేపీ వాళ్లు మాకు నల్లజెండాలు చూపారు. వారికో విషయం చెబుతున్నా.. జాగ్రత్తగా వినాలి. ఆటం బాంబు కంటే హైడ్రోజన్ బాంబు పెద్దగా ఉంటుందని మీకు తెలుసా? మహదేవ్‌పురాలో ఆటంబాంబు చూపించాం. ఇప్పుడు హైడ్రోజన్ బాంబుకు సిద్ధంగా ఉండండి. మీ ఓట్ల చోరీ వాస్తవాన్ని ప్రజలు త్వరలో తెలుసుకోబోతున్నారు' అని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌ను చెత్తకుప్పలో పారేస్తాయని అన్నారు. ఒకప్పుడు సోషలిజం గురించి మాట్లాడిన ఆయన.. ఇప్పుడు వాటి ఒడిలో కూర్చున్నారని ఎద్దేవాచేశారు. నితీశ్ అవినీతిలో భీష్మపితామహుడిలా మారారని ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్ ధ్వజమెత్తారు. నితీశ్ మానసిక స్థితి సరిగా లేదని.. ఆయనకు ఎలాంటి విజన్ లేదని.. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆయన ప్రభుత్వాన్ని తొలగిస్తారని చెప్పారు. బిహార్లో ఎస్‌ఐఆర్ చేపట్టడం ద్వారా ప్రధాని మోదీ, అమిత్‌షా ఈసీ సాయంతో ప్రజాస్వామ్యాన్ని తుడిచిపెట్టేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జార్ఖండ్ సీఎం, జేఎంఎం అధినేత హేమంత్ సోరెన్, వీఐపీ చీఫ్ ముకేశ్ సహానీ, సీపీఐ-ఎంఎల్ లిబరేషన్, సీపీఎం ప్రధాన కార్యదర్శులు దీపాంకర్ భట్టాచార్య, ఎంఏ బేబీ, సీపీఐ నాయకురాలు అనీ రాజా, ఉద్ధవ్ సేన ఎంపీ సంజయ్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లను అవమానిస్తున్నారు

రాహుల్‌గాంధీ 'హైడ్రోజన్ బాంబు' వ్యాఖ్యలపై బీజేపీ విరుచుకుపడింది. ఆయన దురహంకారంతో ఓటర్లను అవమానిస్తున్నారని.. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాను దిగజారుస్తున్నారని ధ్వజమెత్తింది. గతంలో ఆయన వేస్తానని చెప్పిన అణు బాంబు తుస్సుమందని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ సోమవారం ఢిల్లీలో ఎద్దేవాచేశారు. 'బీజేపీ ఘనవిజయాలకు మోసం, ఓట్ల చోరీ కారణమని అనడం ద్వారా కాంగ్రెస్ అగ్ర నేత ఈ దేశ ఓటర్లనే అవమానిస్తున్నారు. ఇది దురహంకారం. ఇందుకు గాను ఆయన్ను శిక్షించాలని ఓటర్లను అభ్యర్థిస్తాం' అన్నారు. రాహుల్ బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని.. ఎన్నికలకు, అణుబాంబు, హైడ్రోజన్ బాంబుకు సంబంధమేంటని ప్రశ్నించారు. బిహార్లో కాంగ్రెస్‌కు రాజకీయ మూలాలు లేకపోయినా.. ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్ రాహుల్‌కు సెకండ్ ఫిడేలుగా మారారని అన్నారు.



ఈసీ-పార్టీల మధ్య అనుమానాలు

బిహార్‌లో గందరగోళానికి కారణమిదే : సుప్రీం

సర్ పొడిగింపునకు నిరాకరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 : బిహార్ రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ(సర్)పై సందేహాలకు ప్రధాన కారణం రాజకీయ పార్టీలు - ఎన్నికల సంఘం మధ్య నెలకొన్న అనుమానాలేనని సుప్రీం కోర్టు సోమవారం పేర్కొంది. ఆ కార్యక్రమం గడువును పొడిగించేందుకు నిరాకరించింది. ఓటర్లు, రాజకీయ పార్టీలు తమ అభ్యంతరాలు, దరఖాస్తులు ఎన్నికల సంఘానికి అందించడంలో సహకరించేందుకు పారా లీగల్ వలంటీర్లను నియమించాలని బిహార్ న్యాయ సేవల అథారిటీని ఆదేశించింది. ఆధార్ సహా ఎన్నికల సంఘం గుర్తించిన 11 ధ్రువపత్రాలను ఓటర్ల జాబితాలో చేర్పులకు అంగీకరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆర్జేడీ, ఏఐఎంఐఎం సర్‌లో ఓటర్లు తమ దరఖాస్తులు, అభ్యంతరాలు సమర్పించడానికి గడువు పొడిగించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే సర్ గడువు తేదీ సెప్టెంబరు ఒకటవ తేదీతో ముగిసింది. ఎన్నికల సంఘం సుప్రీంలో తన వాదన వినిపిస్తూ.. సర్ ద్వారా సిద్ధం చేసిన ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలు, అభ్యంతరాలకు సెప్టెంబరు ఒకటవ తేదీ తర్వాతా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. బిహార్ ఓటర్ల జాబితాలో ఉన్న 7.24 కోట్ల మంది ఓటర్లలో 99.5 శాతం మంది సర్‌లో తమ ధ్రువపత్రాలు సమర్పించారని పేర్కొంది. కాగా సర్ ముగింపు రోజు(సెప్టెంబరు 1) సోమవారం 2.17 లక్షలకు పైగా దరఖాస్తులు ఓటర్ల జాబితా నుంచి అనర్హులను తొలగించాలని అందాయి. 36,000కు పైగా దరఖాస్తులు చేర్పులకు అందాయి.



మోదీ ప్రయాణించిన హాంగ్‌చీ కారు విశేషాలివే!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: ఎస్‌సీవో సదస్సు సందర్భంగా చైనా వెళ్లిన ప్రధాని మోదీ అక్కడ 'మేడ్ ఇన్ చైనా' తయారీ అత్యంత ఖరీదైన కారుగా పేరున్న హాంగ్చీ-ఎల్5 మోడల్ కారులో ప్రయాణించిన విషయం తెలిసిందే..! ఈ కారులో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. మాండరిన్ భాషలో హాంగ్చీ అంటే.. 'ఎర్రజెండా' అని అర్థం. హాంగ్చీ-ఎల్5 ధర భారతీయ కరెన్సీలో రూ.7 కోట్లు. మొదట్లో ఈ కార్లను కమ్యూనిస్టు పార్టీ నేతల కోసం రూపొందించారు. 8.5 సెకన్లలోనే గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకునే ఈ కారు గరిష్ఠ వేగం గంటకు 210 కిలోమీటర్లు. క్రూయిజ్ మోడ్‌తోపాటు.. ఆల్‌వీల్ డ్రైవ్, పార్కింగ్ సెన్సర్లు, 360 డిగ్రీ కెమెరాలు దీని ప్రత్యేకత. ఇందులో విశాలమైన, విలాసవంతమైన సీట్లు ఉంటాయి. వెనక సీట్లలో మసాజ్, హీటింగ్, వెంటిలేషన్ సదుపాయాలు ఉంటాయి. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2019లో భారత పర్యటనకు వచ్చినప్పుడు ఈ కారులోనే ప్రయాణించారు. బహిరంగ కార్యక్రమాల్లో ఈ కారును అధికంగా వాడుతారు. దీంతోపాటు.. ఆయన మరిన్ని రక్షణ సదుపాయాలు, ఆయుధాలు ఉండే హాంగ్‌చీ-ఎన్701ను కూడా వాడుతుంటారు. ఈకారును అమెరికా అధ్యక్షుడు ఉపయోగించే 'ద బీస్ట్'తో పోలుస్తారు.

పచ్చని కాపురంలో ఇన్‌స్టా చిచ్చు

- నెట్‌లో పరిచయమైన వ్యక్తి కోసం భర్త, ముగ్గురు పిల్లలను వదులుకునేందుకు సిద్ధపడిన భార్య
- విడాకులిచ్చేస్తానంటూ ఇంట్లోంచి వెళ్లిపోయేందుకు యత్నం
- తట్టుకోలేక భార్య గొంతుకోసి, మణికట్టు కోసుకున్న భర్త
- జగద్గిరిగుట్ట ఎల్లమ్మబండలో ఘటన.. భార్య పరిస్థితి విషమం

హైదరాబాద్‌సిటీ/జీడిమెట్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదమూడేళ్ల క్రితం ప్రేమ వివాహం.. భర్తతో 13 ఏళ్ల బంధం.. ముగ్గురు పిల్లలు! ఇవన్నీ దిగదుడుపు అనుకుంది ఆ వివాహిత. ఎందుకు? ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ వ్యక్తి కోసం! 'నీకు విడాకులైనా ఇస్తాను తప్ప, ఆ వ్యక్తిని నేను వదులుకోను' అని భర్తకు ఆమె స్పష్టం చేసింది. ఇది తట్టుకోలేని ఆ భర్త విచక్షణ కోల్పోయి కత్తితో ఆమె గొంతు కోశాడు. తర్వాత తన మణికట్టు కోసుకున్నాడు. జగద్గిరిగుట్టలో జరిగిన ఈ ఘటన సోమవారం వెలుగులోకొచ్చింది. సీఐ నరసింహ వెల్లడించిన వివరాల ప్రకారం.. వాసాల శ్రీధర్ (34), కల్యాణి (33) భార్యాభర్తలు. శ్రీధర్‌ది కరీంనగర్ జిల్లా. కల్యాణిది ఖమ్మంజిల్లా. వీరిది ప్రేమ వివాహం. ఓ రాంగ్ ఫోన్‌కాల్ ద్వారా ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇద్దరిది ఒకే సామాజిక వర్గం కావడంతో వీరి పెళ్లికి పెద్దలు అభ్యంతరం చెప్పలేదు. శ్రీధర్-కల్యాణి దంపతులకు 11 ఏళ్లు, తొమ్మిదేళ్లు, ఏడేళ్ల వయసున్న ముగ్గురు కుమారులున్నారు. బతుకుదెరువు కోసం పిల్లలతో హైదరాబాద్‌కొచ్చిన ఈ దంపతులు, జగద్గిరిగుట్టలోని ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్‌లో నివాసముంటున్నారు. కల్యాణి ఇంటివద్దే ఉంటూ పిల్లలను చూసుకుంటోంది. భర్త ప్రైవేటు ఉద్యోగి. ఇన్‌స్టాగ్రామ్‌లో చురుగ్గా ఉండే కల్యాణికి కొన్నాళ్లుగా ఏపీలోని కర్నూలుకు చెందిన వ్యక్తితో ఆ వేదికగా పరిచయం ఏర్పడి.. ప్రేమగా మారింది. నిత్యం అతడితో ఆమె ఫోన్లో మాట్లాడుతోంది. ఇది గమనించిన శ్రీధర్, ఆమెను నిలదీశాడు. ఇది మంచి పద్ధతి కాదని, మారాలని పలుమార్లు సూచించాడు. భర్త మాటలను ఆమె లెక్క చేయలేదు. ఆ వ్యక్తితో మాటలు కొనసాగించింది. ఫలితంగా శ్రీధర్, కల్యాణి మధ్య గొడవలు మొదలయ్యాయి. విడాకులిచ్చేస్తానని భర్తను కల్యాణి హెచ్చరించింది. పంచాయతీ పెద్దల దాకా వెళ్లడంతో వారు సర్దిచెప్పినా.. ప్రవర్తన మార్చుకోని కల్యాణి.. భర్త, పిల్లలను వదులుకునేందుకే సిద్ధపడింది. దీంతో సోమవారం ఉదయం భార్యాభర్తల మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. ఇళ్ల వదిలి వెళ్లడానికి సిద్ధపడిన కల్యాణిపై శ్రీధర్ కత్తితో దాడి చేశాడు. ఆమెకు గొంతు, మణికట్టు, మొహంపై గాయాలయ్యాయి. ఆ తర్వాత శ్రీధర్ రెండు చేతుల మణికట్టుల వద్ద కోసుకొని కింద పడిపోయాడు. భర్తను కాపాడాలని అరుస్తూ కల్యాణి ఇంట్లోంచి బయటకు పరుగెత్తింది. ఇంటి పక్కన ఉంటున్న ఓ వ్యక్తి స్పందించి.. ఇద్దరినీ చికిత్స కోసం ఆస్పత్రికి తరలించాడు. కల్యాణి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనపై కేసు నమోదైంది.


వకుళాభరణంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాంచందర్‌రావు

బీసీలకు కాంగ్రెస్ మోసం: లక్ష్మణ్

- బీసీ రిజర్వేషన్లపై ఏదీ స్పష్టత?: రాంచందర్‌రావు
- బీజేపీలో చేరిన వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీసీలను మోసం చేయడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ దుయ్యబట్టారు. కమిషన్‌లపేరుతో కాంగ్రెస్ కాలయాపన చేసిందే తప్ప బీసీలకు న్యాయం చేయలేదని విమర్శించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు, లక్ష్మణ్ సమక్షంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్, సామాజికవేత్త వకుళాభరణం కృష్ణమోహన్‌రావు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. 'కులగణన సర్వే ఎవరి కోసం చేశారు? బీసీల కోసమా? ముస్లింల కోసమా?' అని నిలదీశారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్న ఆయన.. ఇందులో ఇతర మతస్థులకు అవకాశం ఇవ్వవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ మాత్రమే బీసీలకు న్యాయం చేయగలదనే నమ్మకంతోనే తాను పార్టీలో చేరినట్టు కృష్ణమోహన్ రావు స్పష్టం చేశారు. కాగా, అంతకుముందు కృష్ణమోహన్ రావుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శాలువా కప్పి అభినందించారు.

ఐఆర్‌డీఏఐలో రూ.5.30 కోట్ల మోసం

- మోసానికి పాల్పడిన ఉద్యోగి అరెస్టు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) ప్రాంతీయ కార్యాలయంలో నిధులు గోల్‌మాల్ చేసిన ఉద్యోగిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేశారు. ఐఆర్‌డీఏఐలో అసిస్టెంట్ మేనేజర్ భాస్కరభట్ల సూర్యనారాయణ శాస్త్రి తన అప్పులను తీర్చడం కోసం సంస్థ నిధులను మళ్లించాడు. నకిలీ ఇన్వాయిసులు, కొటేషన్లు, ఇతర పత్రాలను సృష్టించి, ఐఆర్‌డీఏఐకు చెందిన అసలు విక్రేతల బ్యాంకు ఖాతాల వివరాల స్థానంలో అతడి కుటుంబసభ్యుల వివరాలను పేర్కొని నేరానికి పాల్పడ్డాడు. నోట్ ఫైళ్లను ఉన్నతాధికారులు ఆమోదించడంతో అకౌంట్స్ విభాగం ఉద్యోగులు కూడా వాటికి సంబంధించిన చెల్లింపులు చేశారు. ఈ చెల్లింపులన్నీ చట్టబద్ధమైన విక్రేతలకే చేరుతున్నాయని నమ్మి నిందితుడి కుటుంబసభ్యుల ఖాతాలకు డబ్బులను బదిలీ చేశారు. ఈ విధంగా నిందితుడు రూ.5.30 కోట్ల వరకు మళ్లించినట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం డీసీపీ ఎ.ముత్యంరెడ్డి తెలిపారు.

భూదాన్ భూముల కేసులో.... నిందితుల ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భూదాన్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిందితుల ఆస్తులను అటాచ్ చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం సర్వే నం.181లోని భూదాన్ భూములను ఫోర్జరీ డాక్యుమెంట్లతో ప్రముఖులకు విక్రయించిన మహ్మద్ మునావర్ ఖాన్, అతని భార్య ఫైకా తహాఖాన్‌కు చెందిన ఆస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ అధికారులు సోమవారం వెల్లడించారు. బంజారాహిల్స్, టోలీచౌకీ, శంషాబాద్‌లోని రూ.4.80 కోట్లు విలువైన స్థిరాస్తుల్ని అధికారులు అటాచ్ చేశారు.

కొడుకులు పట్టించుకోవడంలేదని కలెక్టర్‌ను ఆశ్రయించిన తండ్రి

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తను రాసిచ్చిన భూమిని అనుభవిస్తున్నారు కానీ, వృద్ధులైన తల్లిదండ్రులను మాత్రం కొడుకులు పట్టించుకోవడం లేదని ఓ వృద్ధ తండ్రి కలెక్టర్‌ను ఆశ్రయించాడు. కన్న బిడ్డల తీరుతో మనస్తాపం చెందిన తండ్రి.. అనారోగ్యంతో నడవలేని పరిస్థితుల్లో ఉన్నా.. వాకర్ స్టాండ్ సహాయంతో వచ్చి ప్రజావాణి కార్యక్రమంలో తన ఆవేదనను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చాడు. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం చిట్టిగిద్దకు చెందిన బాపు నర్సింహారెడ్డి దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కొడుకుల్లో ఒకరు జీహెచ్ఎంసీలో ఉద్యోగి కాగా, మరొకరు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నర్సింహారెడ్డి తన పేరిట ఉన్న 14 ఎకరాలను ఇద్దరు కొడుకుల పేరిట పట్టా చేయించాడు. అయితే, రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత తమ బాగోగులు చూడడం మానేశారని వృద్ధుడు వాపోయాడు. రైతుభరోసా కూడా కొడుకుల బ్యాంకు ఖాతాల్లో జమవుతోందన్నాడు. ఇద్దరు కొడుకులు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో ప్రభుత్వం పేదలకు ఇచ్చే చేయూత పెన్షన్‌కు కూడా నోచుకోలేకపోతున్నామని, బతికే మార్గం లేక తమ జీవితం ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన నర్సింహారెడ్డి.. తనను ఆదుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాడు.

ట్రాన్స్‌జెండర్ సమ్మిళిత పాఠ్యాంశాలపై మీ అభిప్రాయం ఏమిటి?

- కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: పాఠశాల విద్యలో ట్రాన్స్‌జెండర్ల అంశాలకు సంబంధించిన పాఠ్యాంశాలను చేర్చడంపై అభిప్రాయం చెప్పాలని కేంద్రం, ఎన్సీఈఆర్టీ, ఆరు రాష్ట్రాలకు సుప్రీం కోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. దీనికి సంబంధించి దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం, ఎన్సీఈఆర్టీతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు నోటీసులు ఇస్తూ.. ఎనిమిది వారాల్లోగా స్పందన తెలియజేయాలని స్పష్టం చేసింది. స్కూల్ పాఠ్యాంశాలు, పుస్తకాల్లో ట్రాన్స్‌జెండర్ సమ్మిళిత కాంప్రహెన్సివ్ సెక్సువాలిటీ ఎడ్యుకేషన్ (సీఎస్ఈ)ను ప్రవేశపెట్టేలా ఎన్సీఈఆర్టీ, ఎస్సీఈఆర్టీలను ఆదేశించాలని కోరుతూ ఆ పిల్‌ను 12వ తరగతి విద్యార్థి కావ్య ముఖర్జీ సాహా దాఖలు చేశారు. నల్సా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఎన్సీఈఆర్టీతో పాటు పలు ఎస్సీఈఆర్టీలు అమలు చేయడంలేదని పిల్‌లో పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల రక్షణ) చట్టం-2019లోని సెక్షన్లు 2(డీ), 13లను ఎన్సీఈఆర్టీ, ఎస్సీఈఆర్టీలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు.

వైద్య విద్యలో ప్రవేశానికి.. 'నాలుగేళ్ల స్థానికత' తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

శాశ్వత నివాసి అని నిర్ధారించడానికి ప్రభుత్వ నిబంధనలు సరిగ్గా లేవు. మొదట మార్గదర్శకాలు, నిబంధలను రూపొందించండి" అని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుపై తెలంగాణ సర్కారు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. గత నెల 5న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం తన తీర్పును రిజర్వ్ చేసింది. సోమవారం 32 పేజీల తీర్పును వెలువరించింది. హైకోర్టు తీర్పును రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. 2017లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో, 2024లో చేసిన సవరణను సమర్థించింది. గత ఏడాది స్థానికత అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించి, సీట్లు పొందిన విద్యార్థులకు తమ తీర్పు వర్తించదని తెలిపింది. వైద్యవిద్యలో ప్రవేశాలకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని తేల్చిచెప్పింది. ఈ అంశానికి సంబంధించిన అన్ని పిటిషన్లను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది.

తెలంగాణ సర్కారు బలమైన వాదనలు

తన అప్పీల్‌పై తెలంగాణ సర్కారు సుప్రీంకోర్టులో బలమైన వాదనలను వినిపించింది. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనూసింఘ్వీ విచారణ సందర్భంగా సుదీర్ఘంగా వాదించారు. "సంపన్నుల పిల్లలు విదేశాల్లో 11, 12వ తరగతి చదువుకుంటే.. ఎక్కడైనా వైద్యవిద్య సీట్లను పొందగలరు. తెలంగాణ స్థానికతతో చదువుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని, ఈ నిబంధనను తీసుకొచ్చాం" అని పేర్కొంటూ పలు తీర్పులను ప్రస్తావించారు. అసోం, హరియాణా, మరికొన్ని రాష్ట్రాల్లో స్థానికతపై ఉన్న నిబంధనలను ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ స్థానికత అమలవుతోందని, అక్కడ వైద్యవిద్యను అభ్యసించేందుకు తెలంగాణ విద్యార్థులకు అవకాశమే లేదని వివరించారు. కాళోజీ వర్సిటీ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ వాదనలను వినిపించారు. తెలంగాణ పొరుగునే ఉన్న మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడులోనూ ఈ తరహా నిబంధనలున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, రాష్ట్రపతి ఉత్తర్వులు, ఆర్టికల్ 371(డీ) కింద పదేళ్లపాటు ఏపీ విద్యార్థులకు అవకాశం కల్పించామని, దాని గడువు ముగియడంతో.. తెలంగాణ ప్రభుత్వం కొత్త నిబంధనను తీసుకొచ్చిందని వెల్లడించారు. ధర్మాసనం ఈ వాదనలను కీలకంగా పరిగణించి, తుదితీర్పునిచ్చింది. ఆర్టికల్ 371(డీ), 1974 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులకు అనుగుణంగానే జీవో 33 ఉందని అభిప్రాయపడింది. ఆల్-ఇండియా కోటాలో 15% సీట్లను కేటాయించడాన్ని స్వాగతించింది. స్థానికత విషయంలో 4 క్యాటగిరీల ఉద్యోగుల పిల్లలకు మినహాయింపులను సూచించింది.

సుప్రీంకోర్టు మినహాయింపులివే..

- రాష్ట్ర ప్రభుత్వోద్యోగులు(క్యాటగిరి-1), రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని కార్పొరేషన్లు, ఏజెన్సీల్లో పనిచేసేవారు(క్యాటగిరి-4) విధినిర్వహణలో భాగంగా ఇతర రాష్ట్రాల్లో పనిచేసి ఉంటే.. వారి పిల్లలు 9 నుంచి 12 తరగతులు తెలంగాణలో చదవకున్నా.. వైద్యవిద్యకు అర్హులు.
- ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ వంటి ఆల్-ఇండియా సర్వీసుల అధికారులు(క్యాటగిరి-2) తెలంగాణ వెలుపల విధులు నిర్వహిస్తే.. ఆ కాలానికి అనుగుణంగా వారి పిల్లలకు మినహాయింపు ఉంటుంది.
- రక్షణ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల్లో పనిచేసే తెలంగాణ పౌరుల(క్యాటగిరి-3) పిల్లలకూ మినహాయింపు ఇవ్వాల్సిందే. ఈ 4 క్యాటగిరీల్లోనూ ఉద్యోగుల పిల్లలు ఇతర రాష్ట్రాల్లో పనిచేసినప్పుడు చదువుకున్న ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.

11వ తేదీ తర్వాత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్

నిజానికి యాజమాన్య, ఎన్నారై కోటా ప్రవేశాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసినా.. జూలై చివరి వారంలోనే కౌన్సెలింగ్ ప్రారంభించాలని కాళోజీ వర్సిటీ నిర్ణయించింది. స్థానికత, ఆలిండియా కోటాపై స్పష్టత లేక.. ప్రక్రియ నిలిచిపోయింది. సుప్రీంకోర్టు తీర్పుతో ఇప్పుడు వైద్యవిద్యలో ప్రవేశాలకు లైన్ క్లియరైంది. సుప్రీంకోర్టు పేర్కొన్న 4 క్యాటగిరీలపై స్పష్టత కోసం ప్రభుత్వానికి వర్సిటీ లేఖ రాసింది. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కాగానే.. నోటిఫికేషన్ జారీ కానుంది. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం మెరిట్ జాబితాను విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తారు. ఆ వెంటనే తుది జాబితా విడుదలవుతుంది. ఈ మొత్తం ప్రక్రియను ఈనెల 10లోగా పూర్తిచేయాలని వర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. 11 నుంచి కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అదే సమయంలో ఆల్‌ఇండియా కోటా రెండో విడత ప్రవేశాల షెడ్యూల్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ) విడుదల చేసింది. ఈ నెల 4-12 తేదీల మధ్య ఈ కోటాలో కౌన్సెలింగ్ జరుగుతుంది. సీటు పొందిన వారు 19లోగా కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. మూడో విడతను ఈనెల 24 నుంచి వచ్చేనెల 3 మధ్య నిర్వహిస్తారు. సీటు పొందిన వారు అక్టోబరు 10లోగా కళాశాలల్లో చేరాలి. మిగిలిపోయిన సీట్లకు అక్టోబరు 14-18 తేదీల్లో తుది విడతగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. కాగా.. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 8,515 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 4,090 సీట్లు ఉండగా.. వాటిలో 613 సీట్లను ఆలిండియా కోటాకు కేటాయించారు.

లారీ-వోల్వో బస్సు ఢీకొని నలుగురి మృతి

మరో ఐదుగురికి గాయాలు.. మహబూబ్‌నగర్ జిల్లా కాటవరం స్టేజీ వద్ద ఘటన



అష్రాఫ్ ఉన్నీసా బేగం, సుబ్బారావు(ఫైల్)

మూసాపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓవర్‌టేక్ చేస్తుండగా ట్రైలర్ లారీని వోల్వో బస్సు ఢీకొన్న సంఘటనలో నలుగురు మృతి చెందగా.. ఐదుగురు క్షతగాత్రులయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం, కాటవరం స్టేజీ వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. అడ్డాకుల ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ నుంచి 32 మంది ప్రయాణికులతో ఏపీలోని ప్రొద్దుటూరుకు బయటుదేరిన వోల్వో బస్సు.. సోమవారం తెల్లవారుజామున 2.30గంటలకు 44వ జాతీయ రహదారిపై.. కాటవరం స్టేజీ వద్దకు చేరుకుంది. ఓవర్‌టేక్ చేసే క్రమంలో ముందు ఇనప చువ్వలతో వెళ్తున్న ట్రైలర్ లారీని వోల్వోబస్సు ఢీకొంది. బస్సు ముందుభాగం నుజ్జునుజ్జవ్వడంతో.. బస్సు క్లీనర్, ఏపీలోని ప్రొద్దుటూరుకు చెందిన కొత్తపల్లి హసన్(39), ప్రయాణికులు– నంద్యాలకు చెందిన అష్రాఫ్ ఉన్నీసా బేగం(70), ఎల్లమ్మ(39) దుర్మరణం పాలయ్యారు. నంద్యాలకు చెందిన సుబ్బారావు గోస్పాడ్(45)అనే ప్రయాణికుడికి తీవ్ర గాయాలవ్వగా.. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఏపీలోని నంద్యాలకు చెందిన సురేశ్‌రెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన జోషి, ఆళ్లగడ్డకు చెందిన ఓబులేశ్, హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. వీరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా.. ఎల్లమ్మ భర్త రాజారెడ్డి ఏడాదిక్రితం దాయాదులతో గ్రామం లో జరిగిన ఘర్షణలో మృతిచెందారు. ఎల్లమ్మ హైదరాబాద్‌లోని ఓ టిఫిన్‌సెంటర్‌లో పనిచేస్తుండగా.. ఆమె మరణంతో ఏడేళ్ల కుమారుడు సంతోష్ అనాథగా మారాడు. ఎల్లమ్మ మృతదేహం వద్ద సంతోష్ "అమ్మా.. అమ్మా.." అంటూ విలపించడం అక్కడి వారిని కలిచివేసింది.

వసుధ ఫార్మా డైరెక్టర్ ఆత్మహత్య


ప్రసాదరాజు (ఫైల్)

విశాఖపట్నం/ఉక్కునగరం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలో గల వసుధ ఫార్మా కెమికల్స్ డైరెక్టర్ (వర్క్స్) మంతెన వెంకట సూర్య నాగవర ప్రసాదరాజు(61) ఆత్మహత్య చేసుకున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పోలీసుల కథనం మేరకు.. కుటుంబంతో కూర్మన్నపాలెంలో నివాసం ఉంటున్న నాగవర ప్రసాదరాజు ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బయటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఆయన సెల్‌కు బంధువైన ఇందుకూరి సత్యనారాయణ కాల్ చేయగా, గుర్తుతెలియని వ్యక్తి లిఫ్ట్ చేసి.. వరప్రసాదరాజు ప్రగతి మైదానంలో పడిపోయి ఉన్నట్టు చెప్పడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లగా అప్పటికే వరప్రసాదరాజు మృతి చెందారు. ఆయన పక్కన పురుగుల మందు డబ్బా, వాటర్ బాటిల్ ఉన్నాయి. వసుధ ఫార్మా కెమికల్స్ కంపెనీ 1994లో ఏర్పాటైంది. దీనికి ఎంవీ రామరాజు సీఎండీగా వ్యవహరిస్తున్నారు. వరప్రసాదరాజు 2007 నుంచి వసుధలో పనిచేస్తున్నట్టు సమాచారం. కంపెనీ ప్రాజెక్టు వర్క్‌లన్నీ ఆయన సమన్వయం చేస్తుంటారు. కంపెనీ అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలో ఉండగా, ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోని కావూరి హిల్స్‌లో ఉంది. ఈ కంపెనీ ఫెంటానిల్ అనే మందును తయారుచేసి అమెరికా, తదితర దేశాలకు ఎగుమతి చేస్తోంది. ఆ మందు వినియోగించి అమెరికాలో వందలాది మంది మరణించారనేది ప్రధాన ఆరోపణ. దీంతో ఈ సంస్థకు చెందిన టాప్ ఎగ్జిక్యూటివ్, చీఫ్ గ్లోబల్ బిజినెస్ ఆఫీసర్ తన్వీర్ అహ్మద్ మొహమద్ హుస్సేన్ పార్కర్ (63), మార్కెటింగ్ డైరెక్టర్ మంతెన వెంకట నాగ మధుసూదనరాజులను ఈ ఏడాది మార్చి 20న న్యూయార్క్‌లో అరెస్టు చేశారు.

నిమజ్జనానికి వెళ్తున్న ట్రాక్టర్‌ని ఢీకొన్న డీసీఎం.. ఇద్దరి మృతి



జమ్మన్న, నర్సింహులు(ఫైల్)

ఎర్రవల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న ట్రాక్టర్‌ను డీసీఎం వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, 8మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక.. జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఇటిక్యాల ఎస్సై రవినాయక్ కథనం ప్రకారం.. ఇటిక్యాలలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జన కోసం ట్రాక్టర్‌లో బీచుపల్లి వద్ద గల కృష్ణానదికి తరలించారు. ట్రాక్టర్ జాతీయ రహదారిపై.. కొట్టం ఇంజనీరింగ్ కాలేజీ సమీపానికి రాగానే.. వెనక నుంచి ఓ డీసీఎం వాహనం ఢీకొంది. ట్రాక్టర్ బోల్తాపడడంతో.. జమ్మన్న(50) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలైన నర్సింహులు(48) ఆస్పత్రికి తరలిస్తుండగా తుదిశ్వాస విడిచారు. మరో ఎనిమిది మందికి గాయాలవ్వగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

ట్రాలీ చెరువులో పడి తండ్రీకొడుకు దుర్మరణం


జాన్‌వెస్లీ, శ్రీనివాస్(ఫైల్)

దుండిగల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిమజ్జనానికి వెళ్లిన తండ్రి, కుమారుడు ఆటోతో సహా చెరువులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. దుండిగల్‌కు చెందిన శ్రీనివాస్(35) ఆదివారం సాయంత్రం తన ఆటోట్రాలీలో వినాయక విగ్రహాన్ని మోతీచెరువులో నిమజ్జనానికి తరలించారు. ఆయన తన కుమారుడు జాన్‌వెస్లీ(7)ని వెంట తీసుకెళ్లారు. నిమజ్జన తర్వాత.. చెరువుకట్టపై రివర్స్ తీసుకునే క్రమంలో ఆటోట్రాలీ చెరువులోకి దూసుకెళ్లింది. దాంతో.. శ్రీనివాస్, జాన్‌వెస్లీ నీట మునిగారు. చీకటవ్వడంతో ఎవరూ ఈ విషయాన్ని గమనించలేదు. సోమవారం ఉదయానికి కూడా తండ్రీకొడుకులు ఇంటికి రాకపోవడంతో.. కుటుంబ సభ్యులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, డీఆర్ఎఫ్ బృందం చెరువులో గాలించి, ఆటోను గుర్తించారు. అందులోనే శ్రీనివాస్, జాన్‌వెస్లీ మృతదేహాలు లభ్యమయ్యాయి. కాగా.. చెరువు వద్ద నిమజ్జనం కోసం సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ గణేశ్ ఉత్సవ కమిటీ కన్వీనర్ ఆకుల సతీశ్ ఆరోపించారు.

ఏఐ టూల్స్‌తో ఏ లాభం లేదు!

- 95% కంపెనీలకు రాబడి సున్నా: ఎంఐటీ అధ్యయనం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు ఖర్చులు తగ్గించుకొని, లాభాలు పెంచుకోవడానికి కృత్రిమ మేధ (ఏఐ)ను వాడుకోవాలని చూస్తున్న ఈ తరుణంలో ఓ ఆశ్చర్యకరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఏఐ వ్యవస్థలను అమలు చేసిన 95 శాతం సంస్థలు పెట్టిన పెట్టుబడికి ఏ లాభాన్ని పొందలేకపోయాయని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) అధ్యయనంలో తేలింది. జెన్ ఏఐలో సుమారు 30-40 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టిన 95 శాతం సంస్థలు ఏ రాబడిని పొందలేదని వివరించింది. 'ది జెన్ ఏఐ డివైడ్: స్టేట్ ఆఫ్ ఏఐ ఇన్ బిజినెస్-2025' పేరుతో ఎంఐటీ అధ్యయన నివేదికను విడుదల చేసింది. పరిశోధకులు 300 ఏఐ ప్రాజెక్టులపై సర్వే చేసి.. 350 మంది ఉద్యోగులతో నేరుగా మాట్లాడారు. చాట్ జీపీటీ, కోపైలట్ టూల్స్‌ను విస్తృతంగా వాడుతున్న కేవలం 5 శాతం సంస్థలు మాత్రమే వాస్తవంగా లాభాల్లో ఉన్నాయని పరిశోధకులు వెల్లడించారు. ఇక మిగతా సంస్థలు ఏ లాభం కానీ.. నష్టం కానీ లేకుండా నడుస్తున్నాయని తెలిపారు. '80 శాతం సంస్థలు ఏఐ సేవల కోసం ప్రయత్నించాయి. దాదాపు 40 శాతం సంస్థలు ఏఐ వ్యవస్థలను అమలు చేశాయి. అయితే ఈ ఏఐ సాధనాలు వ్యక్తిగత ఉత్పాదకతను పెంచాయే తప్ప లాభ నష్టాలపై ఏ ప్రభావం చూపకలేకపోయాయి. ఈ క్రమంలోనే చాలా సంస్థలు ఏఐ సేవలను నిశ్శబ్దంగా తిరస్కరిస్తున్నాయి' అని వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


భూక్య గణేశ్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లాలోని కొమ్ముగూడెం తండాలో సోమవారం చోటుచేసుకుంది. తండాకు చెందిన భూక్య గణేశ్ (30) కుటుంబ అవసరాల కోసం సుమారు రూ. 2 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ క్రమంలో పనికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్న గణేశ్‌ను అప్పు ఎలా తీరుస్తావని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గణేశ్ ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగాడు. గమనించిన పక్కింటివారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం గణేశ్ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య జ్యోత్స్న ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపారు. గణేశ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అమెరికాలో రెండు విమానాలు ఢీకొని ఒకరి మృతి

- ల్యాండింగ్ సమయంలో ఘటన

కొలరాడో, సెప్టెంబర్ 1: అమెరికాలోని కొలరాడో విమానాశ్రయంలో రెండు చిన్న విమానాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. కొలరాడో రాష్ట్రంలోని ఫోర్ట్ మోర్గాన్ మున్సిపల్ ఎయిర్‌పోర్ట్ వద్ద ల్యాండింగ్ సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం ఇద్దరు ప్రయాణికులతో వస్తున్న సెస్నా 172 విమానం లాండింగ్‌కు సిద్ధమవుతున్న సమయంలో.. ఎక్స్‌ట్రా ఈఏ300 మోడల్ విమానం గాలిలోనే ఢీకొంది. ప్రమాదంలో ఈఏ300లో ప్రయాణిస్తున్న ఒకరు అక్కడే మృతిచెందగా, సెస్నా 172లో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఢీకొన్న వెంటనే రెండు విమానాలు శిథిలాలుగా మారాయని ఫెడరల్ ఏవియేషన్ అధికారులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఈ సయోధ్య స్థిరమేనా?

ప్రధాని నరేంద్రమోదీ చైనా పర్యటనకు షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) వేదిక కావచ్చును కానీ, ఈ సందర్భంగా మనకు కనిపిస్తున్న దృశ్యాలు అంతకుమించిన ప్రాధాన్యం ఉన్నవి. మారిన పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా అతివేగంగా పడిన అడుగులు ఉభయ దేశాలను చేరువచేశాయి. 'మన అధ్యక్షుడు అహానికి పోయి భారత ప్రధాని మీద ఒత్తిడిపెంచుతున్నాడు కానీ, మూడు దేశాలను కలిపి ముడివేస్తున్నానని తెలుసుకోవడం లేదంటూ' అమెరికా పత్రిక ఒకటి గతంలో చేసిన వ్యాఖ్యానానికి తియాంజిన్‌లో మోదీ, పుతిన్, జిన్‌పింగ్ ఆత్మీయతలు, చిరునవ్వులు, ముచ్చట్లు అద్దంపడుతున్నాయి. పహల్గాం ఘాతుకానికి పాకిస్థాన్ మీద ప్రతీకారం తీర్చుకుంటున్నప్పుడు, ఆయుధ సాయంతో పాటు అత్యంత కీలకమైన ఇంటలిజెన్స్ సమాచారాన్ని కూడా అందించిన చేతులు ఇవేనని జిన్‌పింగ్‌తో కరచాలనం చేస్తున్నప్పుడు మోదీకి గుర్తొచ్చే ఉంటుంది. ఆ చేదు అనుభవాన్ని మనసులోనే వెనక్కునెట్టి, మంచి భవిష్యత్తుకోసం భారత్ చైనాలు కలిసి అడుగులు వేయాలని మోదీ కాంక్షించారు. చైనా అధ్యక్షుడు అయితే ఏకంగా డ్రాగన్, ఏనుగు కలిసి డాన్స్ చేయాలంటున్నారు. నాలుగేళ్ళపాటు రెండుదేశాలు సరిహద్దుల్లో ముష్టిఘాతాలకు దిగిన గతానికి స్వస్తిచెప్పాలన్న ఇరువురి సంకల్పం మెచ్చుకోదగింది. ఇకపై అంతా శుభమే అన్నట్టుగా ఈ సంభాషణలూ ఉన్నప్పటికీ, ట్రంప్ సుంకాలు, వీరంగాలు పునాదిగా ఈ సయోధ్య సాధ్యపడిన వాస్తవం కాదనలేనిది. మూడో దేశంతో ముడివడని రీతిలో ఈ బంధం కలకాలం నిలవాలన్న ఆశ, ఆకాంక్ష నెరవేరుతుందో లేదో చూడాలి.

ఉమ్మడి శత్రువు కమ్ముకొచ్చినప్పుడు, కోటలు కూలదోస్తున్నప్పుడు ఇలా చేయీచేయీ కలపాల్సివస్తుంది. కడదాకా నిలుస్తాడని అనుకున్న ట్రంప్ శత్రువును మించి కత్తులు దూస్తున్నందున రక్షణకవచాలు అవసరపడ్డాయి. అయినా, కాలం ఒకేలా ఉండదనీ, మిత్రులు, శత్రువులు శాశ్వతం కాదన్న స్పృహతోనే మోదీ ప్రయాణం నిర్ణయమైందని విశ్లేషకులు అంటారు. చైనాకు శత్రువు, అమెరికాకు దీర్ఘకాలిక మిత్రదేశమైన జపాన్‌లో మొదట కాలూని, భారీ ఒప్పందాలు కుదుర్చుకొని, సాంకేతికతల బదలాయింపు గురించి మాట్లాడుకొని, అక్కడనుంచి ఎస్సీవో సదస్సుకు ప్రయాణం కట్టడం వెనుక చైనాకు, అమెరికాకు అవసరమైన సందేశాలున్నాయని అంటారు. మనంత కాకున్నా, జపాన్ కూడా ప్రస్తుతానికి ట్రంప్ బాధితదేశమే కనుక, ఆ లెక్కకూడా సరిపోతుంది. ఆలింగనాలవరకూ వెళ్ళిన మోదీ ట్రంప్ బంధం ఇప్పుడు అలకలూ, ఆగ్రహాల దశలో ఉంది. చైనాతో కరచాలనాలే తప్ప, ఆలింగనాలు ఉండవని మోదీకి తెలుసు. భారత్‌ను చైనాకు పోటీగా నిలబెట్టి, బలోపేతం చేసే దశాబ్దాల నాటి విధానాన్ని ఈ సుంకాల సమరంలో పడి ట్రంప్ విస్మరించాడు. ట్రంప్‌ను నమ్ముకొని చైనాతో ఘర్షణలు పెంచుకున్న మనకు ఇప్పుడు మళ్ళీ చైనాతో చేయికలపాల్సిన పరిస్థితి తీసుకువచ్చాడు. దశాబ్దాల పాటు ఒక్క బుల్లెట్ కూడా పేలని సరిహద్దు ఇప్పుడు ఘర్షణలు, చొరబాట్లు, దురాక్రమణలతో సతమతమవుతోంది. ఏదో అవసరార్థం సయోధ్య కుదిరినా, ఆ శాంతి ఎక్కువకాలం నిలిచే అవకాశం లేదు. పరస్పర నమ్మకం, గౌరవం వంటివి మాటలకే తప్ప, ఇరుదేశాల మధ్య ఆచరణలో అంతరించిపోయాయి. ఇప్పుడు మళ్ళీ పడుతున్న ఈ కొత్త అడుగుతో ఇరుదేశాల మధ్య అతుకు ఎంతబలంగా ఏర్పడుతుందో చూడాలి.

గత ఏడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సు భారత్, చైనా తమ ఘర్షణాత్మకవైఖరిని సడలించుకొనేందుకు వీలు కల్పించింది. పలు విడతల చర్చల అనంతరం సరిహద్దులు కాస్తంత శాంతించినప్పటికీ, మోహరించివున్న సైన్యాన్ని వెనకకురప్పించే చర్యలు సత్వరమే జరగలేదు. ఉన్నతస్థాయి సంకల్పం అవసరపడిన దశలోనే ట్రంప్ వీరంగాలు భారత్, చైనా సయోధ్యను వేగవంతం చేశాయి. రష్యా చమురు ఇంధనంలాగా పనిచేసింది. ట్రంప్ ఒత్తిళ్లు, బెదిరింపులకు లొంగకుండా స్థిరంగా నిలబడిన మనపక్షాన చైనా, రష్యాలు రెండూ నిలిచాయి. అంతకుముందు కొన్ని ఉత్పత్తులమీద విధించిన ఆంక్షలను కూడా ఎత్తివేసి, మార్కెట్లు తెరిచేందుకు చైనా తయారవుతోంది. వాణిజ్యం గురించి ఇరుదేశాధినేతలూ ప్రత్యేకంగా మాట్లాడుకుంటున్న ఈ వాతావరణ మార్పు ఐదారునెలలక్రితం కూడా ఎవరి ఊహకూ అందనిది. వచ్చే ఏడాది బ్రిక్స్ సదస్సులోగా తుఫానులేవీ సంభవించబోవని ఆశిద్దాం.

దేశంలో సెమీకండక్టర్ విప్లవం మొదలైంది!

కంప్యూటర్లు వచ్చిన కొత్తలో ఒక గది మొత్తాన్నీ నింపేసే భారీ యంత్రాల్లా ఉండేవి. ఇప్పుడు మీ వేలి గోరుకన్నా చిన్నదైన చిప్ లోపల అనంతమైన శక్తి దాగి ఉంటుంది. మీ మొబైల్ ఫోన్లు, కార్లు, రైళ్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్‌లు మొదలుకొని ఫ్యాక్టరీ యంత్రాలు, విమానాలు, అంతరిక్షంలో సంచరించే ఉపగ్రహాల దాకా ఇవే నడిపిస్తున్నవి. ఇదంతా సెమీకండక్టర్ల మాయాజాలం!

ఒక దేశం ప్రగతిపథంలో సాగాలంటే వృద్ధికి తోడ్పడే కీలక రంగాలపై పట్టు సాధించాలి. ఉక్కు, విద్యుత్తు, టెలికాం, రసాయనాలు, రవాణా, సెమీకండక్టర్లు వంటి రంగాలు దీనికి పునాదులు. వీటిలో సెమీకండక్టర్ల పాత్ర అత్యంత ప్రధానం. కర్మాగారాలు, వంతెనలు, రైల్వే రంగాల్లో ఉక్కు ప్రాథమిక అవసరం. అదే తరహాలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు సెమీకండక్టర్లు మూలాధారాలు. చిప్‌లు లేనిదే ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థ పనిచేయదు. డేటా ప్రాసెసింగ్ సహా కృత్రిమ మేధ మనజాలదు. పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు ఉండవు. రక్షణ రంగం సురక్షితంగా ఉండదు. అందువల్ల, సెమీకండక్టర్ల రంగంలో బలోపేతం కావడమనే అంశానికి పరిశ్రమను మించిన ప్రాధాన్యం ఉంటుంది.

ప్రపంచ భౌగోళిక రాజకీయాలకు సెమీకండక్టర్లే నేడు కేంద్రకంగా మారాయి. చిప్ తయారీ కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం కావడంతో స్వల్ప అంతరాయాలు కూడా ప్రపంచమంతటా అలజడి రేపుతున్నాయి. ఇటీవలి కాలంలో అరుదైన లోహాలపై అన్ని దేశాలూ దృష్టి సారిస్తున్నాయి. కీలక వనరులపై నియంత్రణ ప్రపంచ శక్తి సమీకరణాల్లో ఎంత ప్రాముఖ్యతను ఇవ్వగలదో ఈ పరిణామం స్పష్టం చేస్తున్నది.



సెమీకండక్టర్ల రంగంలో భారత్ పురోగమనం ప్రధాని మోదీ దూరదృష్టిలో ఒక భాగం. డిజిటల్ మౌలిక సదుపాయాల రూపకల్పనతో పాటు, డిజిటల్ ఇండియా కార్యక్రమంతో ఇది శ్రీకారం చుట్టుకుంది. సమాంతరంగా మన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి వ్యవస్థను కూడా బలోపేతం చేసిన నేపథ్యంలో ప్రస్తుతం సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, పరికరాల కోసం తయారీ వ్యవస్థను రూపొందిస్తున్నాం. ఈ రోజు ప్రారంభమయ్యే సెమికాన్ ఇండియా సమ్మిట్ 2025, ఈ ప్రయాణానికి కొనసాగింపుగా చెప్పుకోవచ్చు.

దేశంలో ప్రస్తుతం 65 కోట్లకుపైగా స్మార్ట్‌ఫోన్ వినియోగదారులున్నారు. మన ఎలక్ట్రానిక్స్ తయారీ ఇప్పుడు ఏటా రూ.12 లక్షల కోట్లకు చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో మనం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థలు, డేటా సెంటర్లు నెలకొల్పడంతోపాటు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీని కూడా చేపడుతున్నాం. ఈ విధంగా డిమాండ్–ఆవిష్కరణ రెండింటా కనిపిస్తున్న పెరుగుదల ద్వారా ప్రపంచ సెమీకండక్టర్ విలువ శ్రేణిలో భారత్ తనదైన స్థానం సంపాదించుకోనున్నది.

సెమీకండక్టర్ల విషయంలో మన దేశం దశాబ్దాలుగా అనేక అవకాశాలు కోల్పోయిందన్న మాట మనకు వినిపిస్తోంది. కానీ, ఇకపై ఆ పరిస్థితి మారనున్నది. 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' కింద దేశంలో 10 సెమీకండక్టర్ల తయారీ ప్లాంట్లకు ఆమోదముద్ర పడింది. వాటి నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది.

ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాదిలోనే తొలి 'మేడ్ ఇన్ ఇండియా' చిప్ ఆవిష్కృతం కాగలదని మనం సగర్వంగా చాటగలం. గుజరాత్‌లోని సనంద్‌లోగల ఒక యూనిట్‌లో ఇప్పటికే ప్రయోగాత్మక ఉత్పత్తి మొదలు కావడంతో ఏడాదిలోగా వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభం కాగలదని అంచనా. ఈ కర్మాగారాలు, సరఫరా శ్రేణులకు మద్దతు దిశగా అప్లైడ్ మెటీరియల్స్, లామ్ రీసెర్చ్, మెర్క్, లిండే.. వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెడుతున్నాయి. భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమ దీర్ఘకాల అభివృద్ధిపై ప్రధానమంత్రి కేంద్రీకృత దృష్టిని ఈ దృక్పథం ప్రతిబింబిస్తోంది.

ఏ కోణంలో చూసినా విధానం, పెట్టుబడులు అత్యంత ప్రధానం. అయితే, భారత్‌కు నిజమైన సానుకూలత దాని ప్రజానీకంలోనే ఉన్నది. ప్రస్తుతం ప్రపంచ డిజైన్ శ్రామిక శక్తిలో భారత్ వాటా 20 శాతం కాగా, ఒక అంచనా ప్రకారం వచ్చే దశాబ్దారంభం నాటికి అంతర్జాతీయంగా సెమీకండక్టర్ నిపుణుల కొరత 10 లక్షలకు పైగా ఉంటుంది. ఈ అంతరాన్ని పూరించే దిశగా భారత్ నేడు ముందడుగు వేస్తున్నది. ఎందుకంటే– 350 పరిశ్రమలు, అంకుర సంస్థలలో 60వేలకు పైగా వినియోగదారులు ప్రభుత్వం ఉచితంగా సమకూర్చే అంతర్జాతీయ స్థాయి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) ఉపకరణాలను వాడుతున్నారు. ఈ మేరకు 2025లోనే వీటి వాడకం 1.2 కోట్ల గంటల స్థాయిని దాటింది. ప్రభుత్వం నుంచి బలమైన మద్దతు లభించడంతో అంకుర సంస్థలు భారత చిప్ డిజైన్ వ్యవస్థను శక్తిమంతం చేస్తున్నాయి. ఈ మేరకు ఐఐటీ–మద్రాస్ దేశీయంగా రూపొందించిన 'శక్తి' ప్రాసెసర్ సాయంతో 'మైండ్‌గ్రోవ్ టెక్నాలజీస్' సంస్థ 'ఐఓటీ' చిప్‌లను రూపొందిస్తోంది. ఇక 'నేత్రసేమి' అనే మరో అంకుర సంస్థ ఇటీవలే రికార్డు స్థాయిలో రూ.107 కోట్ల నిధిని సమీకరించుకోగలిగింది. దేశంలోని సెమీకండక్టర్ డిజైన్ రంగంలోనే ఇది అత్యంత భారీ వెంచర్ క్యాపిటల్ సమీకరణ. ఈ రంగంపై పెట్టుబడిదారులలో పెరుగుతున్న విశ్వాసానికి ఇదొక నిదర్శనం. 'డిజైన్ సంధానిత ప్రోత్సాహకం' (డీఎల్ఐ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇలాంటి అనేక అంకుర సంస్థలకు చేయూత లభిస్తోంది.

మొహాలీలోని సెమీ కండక్టర్ లాబొరేటరీ (ఎస్‌సీఎల్)లో 17 విద్యాసంస్థల నుంచి వచ్చిన విద్యార్థులు ఇప్పటికే 20 చిప్‌లను తయారు చేశారు. రాబోయే కాలంలో ఇలాంటి మరిన్ని చిప్‌లను వారు ఆవిష్కరించగలరు. ఈ విధమైన నైపుణ్యాభివృద్ధి భారతదేశాన్ని సెమీ కండక్టర్ పరిశ్రమలో పటిష్ఠమైన స్థానంలో నిలబెడుతుంది. ఈ మేరకు యువ ఆవిష్కర్తల స్వప్న సాకారం దిశగా 'ఎస్‌సీఎల్' ఆధునికీకరణ చేపట్టారు. ఈ విధంగా భారత ప్రతిభ క్లాస్‌రూమ్ నుంచి క్లీన్‌రూమ్ వైపు మళ్లగలదనే భరోసా లభిస్తోంది.

భారత యువతరం ప్రతిభపై ప్రపంచ అగ్రశ్రేణి సంస్థలు కూడా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ మేరకు 'లామ్ రీసెర్చ్' సంస్థ దేశంలోని 60వేల మంది ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వనుంది. అలాగే అప్లైడ్ మెటీరియల్స్, ఏఎండీ, మైక్రోచిప్ సంస్థలు పరిశోధన–ఆవిష్కరణల కోసం 101 కోట్ల డాలర్ల పెట్టుబడికి హామీ ఇచ్చాయి. మరోవైపు ఐఐఎస్సీ, ఐఐటీలు తదితర సంస్థల భాగస్వామ్యంతో ప్రయోగశాల నుంచి తయారీ ప్రతిభగల (ల్యాబ్–టు–ఫ్యాబ్) బలమైన కార్మికశక్తి రూపకల్పనకు భరోసా లభిస్తోంది.

సెమీకండక్టర్ల రంగంలో భారత్ పురోగమనం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టిలో ఒక భాగం. డిజిటల్ మౌలిక సదుపాయాల రూపకల్పనతో పాటు పౌరులకు సాధికారతను ఇచ్చిన డిజిటల్ ఇండియా కార్యక్రమంతో ఇది శ్రీకారం చుట్టుకుంది. ఇండియా స్టాక్, యూపీఐ, ఆధార్, టెలికాం నెట్‌వర్కులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి భారతీయుడి వేలికొసలకు చేర్చాయి. ఈ పురోగమనానికి సమాంతరంగా మన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి వ్యవస్థను కూడా బలోపేతం చేసిన నేపథ్యంలో ప్రస్తుతం సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, పరికరాల కోసం తయారీ వ్యవస్థను రూపొందిస్తున్నాం. నేడు ప్రారంభమయ్యే సెమికాన్ ఇండియా సమ్మిట్ 2025, ఈ ప్రయాణానికి కొనసాగింపుగా చెప్పుకోవచ్చు. ప్రధానమంత్రి ఈ రోజు ఈ సదస్సును ప్రారంభించనున్నారు. ఈ సంవత్సరం 48 దేశాల నుంచి 500 మందికి పైగా ప్రపంచ పారిశ్రామిక నాయకులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. అనిశ్చితితో సతమతమవుతున్న ప్రపంచానికి స్థిరమైన భారత్ ఆశాకిరణం కాబట్టి, ప్రపంచం మన తలుపు తడుతోంది. ఇందులో జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, మలేషియా దేశాల ప్రత్యేక పెవిలియన్లు అర్థవంతమైన సహకారాన్ని ప్రోత్సహిస్తాయి. ప్రపంచవ్యాప్త పరిశ్రమల ప్రతినిధులు, యువ ప్రతిభావంతుల మధ్య 'బి 2బి' చర్చలు, అవగాహన ఒప్పందాలు, భాగస్వామ్యాలు ఏర్పడే వీలుంటుంది.



రాబోయే దశాబ్దంలో మన సెమీకండక్టర్ యూనిట్లు పరిపక్వతతో పాటు పరిమాణం రీత్యా ఉన్నత స్థాయికి ఎదుగుతాయి. తద్వారా సెమీకండక్టర్ విలువ శ్రేణి మొత్తానికీ భారత్ ఒక పోటీతత్వ కూడలిగా నిలిచేందుకు సిద్ధమవుతోంది.


▪ **అశ్వినీ వైష్ణవ్**
కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి

వ్యాపారంలో తనామనా తకరారు!

ఆర్థిక పరిస్థితుల్లో తేడాలొస్తే ఆలోచనలు తలకిందులు అవుతాయి. ఆందోళనలు పుడతాయి. కొత్త వాదాలు వస్తాయి. బలబలాల ప్రదర్శనలు మొదలవుతాయి. చరిత్ర అంతా ఇదే జరిగింది. దాన్ని ఈ కోణం నుంచి చూస్తే వైవిధ్య భరిత జీవితం కనపడుతుంది. రాజవంశాలతో విసుగుపుట్టించే చరిత్ర పోయి సాధారణ ప్రజల ప్రయాణంలో వెలుగుచీకట్లు వెల్లడవుతాయి. వివిధ వర్గాల సంఘర్షణలు, సమైక్యతలపై సమగ్రచిత్రం అందుతుంది. తెలంగాణలో మార్వాడీల వ్యాపార ఆధిపత్యంపై తలెత్తుతున్న ఆందోళనల నేపథ్యంలో చరిత్రను తడిమితే ఎన్నో ఆసక్తికరమైన అంశాలూ బయటపడతాయి.

వ్యాపారాల్లో మార్వాడీల ఆధిపత్యం నిన్నమొన్నటిది కాదు. దీని వెనుక 250 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. నిజానికి మార్వాడీ పేరుతో ఒక కులం లేదు. ఒక తెగ లేదు. రాజస్థాన్‌లోని మార్వార్ ప్రాంతం నుంచి వ్యాపారాల కోసం తరలి వచ్చిన వాళ్లందరినీ మార్వాడీలు అనటం ఒక నానుడిగా మారిపోయింది. మార్వార్ నుంచే గాక రాజస్థాన్‌లోని ఇతర చోట్ల నుంచి వచ్చిన వాళ్లని కూడా అదే పేరుతో పిలవటం మొదలైంది. మార్వాడీలుగా మనందరం పిలిచే వాళ్లందరూ ఎక్కువగా వైశ్యవర్గంలోని వివిధ కులాలకు చెందినవారే. ఆ వర్గంలో 30కి పైగా కులాలు ఉన్నాయి. అందులో ఆరు ప్రధాన కులాలను సూచించే పేర్లు ఏదో విధంగా మనకు నిత్యం తారసపడుతూనే ఉంటాయి. అగర్వాల్, మహేశ్వరి, ఓస్వాల్, పోర్‌వాల్, ఖండేల్‌వాల్, శ్రీమాలి అనే వాటిని ఆ ఆరు కులాలుగా చరిత్రకారులు చెబుతారు. ఈ కులాలకు చెందినవారే ఇప్పటికీ వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. బిర్లా, గోయంకా, సింఘానియా, బజాజ్, ఖేతాన్, మిత్తల్, గోయల్, ముంద్రా, జలాన్, పొద్దార్, ఝున్‌ఝున్‌వాలా, కనోరియా ఇంటిపేర్లున్న వారందరూ అగర్వాల్ కులానికి చెందినవారు. దాల్మియా, కొటారి, తపాడియా, పారీఖ్, బంగూర్, ధూత్, కేడియా, రాఠీ, చింట్లాంగియా ఇంటిపేర్లు మహేశ్వరీ కులంలో కనపడతాయి. ఇక కులం పేరు అయిన మహేశ్వరీ చాలా మందికి ఇంటిపేరు గానూ ఉంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో 30కి పైగా వెంచర్లు ఉన్న మహేశ్వరీ గ్రూప్ మార్వాడీలకు చెందిందే. డి-మార్ట్ కూడా మహేశ్వరీలకు చెందిన మార్వాడీలదే. లోధా, భన్సాలీ, జవేరీ, భండారీ, కొటారీ, దుగ్గర్, సురానా లాంటి ఇంటిపేర్లు ఓస్వాల్ కులంలో ప్రధానమైనవి. దోషి, పరేఖ్, మెహతా, కాసిల్‌వాల్, బొహ్రా, శాంక్ల అనే ఇంటిపేర్లు పోర్‌వాల్ కులంలో కనపడతాయి. బన్సాల్, సింఘాల్, ఖండేల్‌వాల్, కన్సాల్, శ్రీమాల్ బైడ్, భుటాడ మొదలైన ఇంటిపేర్లు మిగతా రెండు ప్రధాన కులాల్లో ఉంటాయి. మార్వాడీల్లో 30 నుంచి 35 శాతం వరకూ జైన మతాన్ని, మిగతావారు హిందూ మతాన్ని అనుసరిస్తారు. మార్వార్ ప్రాంతాన్ని అసలు మరుదేశం అని పిలిచేవారు. మరు అంటే ఎడారి ప్రాంతం. థార్ ఎడారిలో భాగంగానే మార్వార్‌ను చూసేవారు.

1948కి ముందు మూడు భాషా ప్రాంతాల్లో విస్తరించిన నిజాం సంస్థానంలోని కులాలు, జాతుల గురించి ఆసక్తికరమైన విషయాలను అందించిన వారిలో సయద్ సిరజ్ ఉల్ హస్సన్‌ను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. 1920 నాటికే నిజాం సంస్థానంలో పాతుకుపోయిన మార్వాడీల గురించి ఆయన చాలా సమాచారాన్ని ఇచ్చారు. హైదరాబాద్‌తో పాటు ఔరంగాబాద్, జాల్నా, పర్భణీ, నాందేడ్, గుల్బర్గా నగరాలతో పాటు వాణిజ్య వ్యవహారాలు సాగే అన్నిచోట్లకు మార్వాడీలు విస్తరించారనీ తెలిపారు. వడ్డీ, ధాన్యం, బట్టల వ్యాపారులుగా, బ్యాంకర్లుగా, మిల్లులు, దుకాణాల యజమానులుగా, డీలర్లుగా స్థిరపడినప్పటికీ జీవిత చరమాంకంలో మార్వార్‌కు వెళ్లేవారూ ఉండేవారు. అగర్వాల్, మహేశ్వరీ, ఓస్వాల్, పోర్‌వాల్ కులాలతో పాటు జైనమతాన్ని అనుసరించే శ్రావక మార్వాడీల ఆచార వ్యవహారాల గురించి కూడా హస్సన్ వివరించారు. మరో నాలుగు మార్వాడీ కులాలు కూడా నిజాం సంస్థానంలో ఆనాడు ఉండేవి. వివాహాల్లో కులపట్టింపులను అందరూ పాటించేవారు. ఒకే కులంలో జైన, హిందూ సంప్రదాయాలను అనుసరించే వారి మధ్య వివాహాలు జరిగేవి. భర్త మతాన్ని బట్టి భార్యల మతం మారిపోయేది.



కొంచెం అటూఇటుగా 400 ఏళ్ల నుంచి మార్వాడీలు తెలంగాణ ప్రాంతం వ్యాపారాల్లో కీలకపాత్రను పోషిస్తూనే ఉన్నారు. నగర పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా వడ్డీ, ధాన్యం వ్యాపారాల్లో పట్టు సంపాదించారు. పర్భణీ చుట్టుపక్కల రైతులు మార్వాడీల అధిక వడ్డీలకు వ్యతిరేకంగా 1906లో పెద్దఎత్తున ఆందోళన చేశారు. హైదరాబాద్‌కు 1980ల నుంచి ఇతర ప్రాంతాల నుంచి పారిశ్రామికవేత్తలూ, వ్యాపారులూ రావటం ఎక్కువైనా రిటైల్ రంగంలో మార్వాడీల పాత్ర క్షీణించలేదు. 1990ల తర్వాత అదింకా పెరిగింది. వీరితో పోటీకి నిలబడలేని పరిస్థితి స్థానిక కిరాణా వ్యాపారులకు వచ్చింది. ఇటీవల ఆందోళనలకు అదే కారణం.

నిజాం పాలన (1724) ఆరంభమైన నాటి నుంచి మార్వాడీల ప్రాబల్యం పెరిగినా అంతకుముందు మొగల్ కాలంలో కూడా కొందరు ఉండేవారు. బుర్హాన్‌పూర్, ఔరంగాబాద్‌ల నుంచి క్రమేపీ నిజాం సంస్థానంలోకి వచ్చి 1800ల నాటికి హైదరాబాద్‌లో పట్టు సంపాదించారు. బేగంబజార్, రికాబ్‌గంజ్, శాలిబండ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసేవారు. నవాబులు, జాగీరుదార్ల కుటుంబాలు నగదు అవసరాలకు వీళ్ల మీద ఆధారపడేవి. హోల్‌సేల్ వ్యాపారంలో మార్వాడీలకే గుత్తాధిపత్యం ఉండేది. వస్త్ర, కిరాణా, ఇనుము, హార్డ్‌వేర్, నగల పరిశ్రమల్లోనూ వారిదే పైచేయి. సీతారామ్‌బాగ్ ఆలయాన్ని నిర్మించిన గనేరీవాలా కుటుంబం నిజాంకు బ్యాంకరుగానూ వ్యవహరించేది. కొంచెం అటూఇటుగా 300 ఏళ్ల నుంచి మార్వాడీలు తెలంగాణ ప్రాంతం వ్యాపారాల్లో కీలకపాత్రను పోషిస్తూనే ఉన్నారు. నగర పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా వడ్డీ, ధాన్యం వ్యాపారాల్లో పట్టు సంపాదించారు. పర్భణీ చుట్టుపక్కల రైతులు మార్వాడీల అధిక వడ్డీలకు వ్యతిరేకంగా 1906లో పెద్దఎత్తున ఆందోళన చేశారు. హైదరాబాద్‌కు 1980ల నుంచి ఇతర ప్రాంతాల నుంచి పారిశ్రామికవేత్తలూ, వ్యాపారులూ రావటం ఎక్కువైనా రిటైల్ రంగంలో మార్వాడీల పాత్ర క్షీణించలేదు. 1990ల తర్వాత అదింకా పెరిగింది. హార్డ్‌వేర్, కిరాణ, ఎలక్ట్రికల్, ప్లమింగ్, నగలు, వజ్రాల వ్యాపారంలో మార్వాడీల విస్తరణ ఎక్కువగానే కనపడుతుంది. వీరితో పోటీకి నిలబడలేని పరిస్థితి స్థానిక కిరాణా వ్యాపారులకు వచ్చింది. ఇటీవల ఆందోళనలకు అదే కారణం.



▪ రాహుల్ కుమార్

వ్యాపార పోటీలో కొందరు పతనం అవ్వటం, నష్టపోవటం సాధారణమైనా దానికి అన్ని సందర్భాల్లోనూ సమాధానపడటం ఉండదు. ప్రాంతీయ భావనలు ప్రబలంగా ఉన్నచోట అధికార బలంతో పోటీని కట్టడిచేయాలనే డిమాండ్లు రావటం సహజం. ప్రాంతీయ, కులశక్తులు కొన్ని సందర్భాల్లో పోటీని ఎదుర్కొంటాయి. మరికొన్ని సందర్భాల్లో పోటీని నిలువరించటానికి ప్రయత్నిస్తాయి. అస్తిత్వ పోరాటాలకూ ఆరాటాలకూ వెనుక ప్రధానంగా ఉండేది ఈ ఆర్థిక అంశాలే. వాటిని కప్పిపుచ్చటానికి ఎన్ని ఇంద్రజాలాలు చేసినా అసలు విషయాలు ఆర్థికాలే. అవి కూడా కొన్ని వర్గాలకే పరిమితం.

ఎడారి ప్రాంతమైన మార్వార్ నుంచే ఎక్కువ మంది వ్యాపారులు ఎందుకు వచ్చారని ప్రశ్నించుకుంటే లభించే సమాధానం ఆసక్తిగా ఉంటుంది. ఒకానొక సందర్భంలో పరిస్థితుల ప్రభావంతో ఏదో ఒకరంగాన్ని ఎంచుకున్న ఒక తరం వాళ్ళు.. దాన్ని తరాలపాటు కొనసాగేలా తదుపరి తరాలకు కొన్ని అలవాట్లు, పద్ధతులను ఒక సంస్కృతిగా మార్చి ఉగ్గుపాలలా అందించగలగటం చాలా అరుదనే చెప్పాలి. యూరప్‌లో యూదులు అది చేశారు. అందుకే వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో అక్కడ ఆ పట్టును సాధించారు. ఎంతటి సమాచారాన్నైనా, ఎంతటి చిక్కు పరిస్థితులనైనా సరళీకరించి అర్థం చేసుకుని, తదనుగుణంగా వ్యవహరించి తమ ప్రయోజనాలను కాపాడుకోవటంలో యూదులు అగ్రగాములుగా ఉండేవారు. పలుదేశాల ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషించినా ఎక్కడా రాజకీయ ఆధిక్యతను సంపాదించటానికి కనీస సంఖ్యాబలం లేకపోవటం, ప్రత్యేకతను కాపాడుకోటానికి నిరంతరం ప్రయత్నించటం, కొన్ని విషయాల్లో అసాధారణ ప్రతిభ.. అవన్నీ కలగలసి మిగతా ప్రజల్లో ఈర్ష్యనూ, ద్వేషాన్నీ కలగచేశాయి. యూరప్‌లోని ఆధిపత్య రాజకీయాలకూ, నాజీయిజానికీ బలిపశువులయ్యారు. మార్వాడీలు కూడా వ్యాపార సంస్కృతిని తదుపరి తరాలకు అందించటంలో, తమ సొంతకులం వాళ్లను చేరదీసి, ప్రోత్సాహం ఇవ్వటంలో, లాభనష్టాల గణనలో అసాధారణ ప్రతిభను చూపించటంలో విశిష్టత సాధించారని చెప్పే పరిశోధనలు చాలానే వచ్చాయి. మార్వాడీలపై ఎంతో పరిశోధన చేసిన థామస్ ఎ టింబర్గ్ అభిప్రాయమూ అదే.


వ్యవసాయానికి అనుకూలంగాలేని మరుదేశం మార్వాడీలను వ్యాపారం వైపు మొగ్గేలా చేసింది. కానీ అలా మొగ్గటానికి వాళ్లున్న ప్రాంతం ఎడారిగా ఉంటే సరిపోదు. అది ఇతరత్రా కూడా వ్యాపారానికి అనుగుణంగా ఉండాలి. అరేబియా సముద్ర ఓడరేవుల నుంచి వచ్చే ఉత్పత్తులనూ, మరోవైపు ముస్లిం దేశాల నుంచి భూమార్గం ద్వారా వచ్చే వస్తువులనూ అటూఇటూ చేరవేయటానికి కావాల్సిన భౌగోళిక అనుకూలత మరుదేశానికి ఉండటం మార్వాడీలకు కలిసివచ్చింది. 18వ శతాబ్దంలో రాజస్థాన్ 20–22 పెద్ద సంస్థానాలుగా విడిపోయి ఉండేది. మరికొన్ని చిన్న జమిందారీలు ఉండేవి. వీటన్నిటి మధ్యా పోటీతో పాటు యుద్ధాలూ జరిగేవి. అప్పటికే ఆర్థిక వ్యవహారాల్లో నగదు వాడకం బాగా పెరిగింది. సంస్థానాధీశుల నగదు అవసరాలు విపరీతంగా ఉండేవి. వీటిని తీర్చటానికి ముందుకు వచ్చిన మార్వాడీ వ్యాపారులకు పరిపాలనలో కూడా పెద్దపీట వేశారు. తీసుకున్న అప్పులకు బదులుగా జాగీర్లు కట్టబెట్టారు. కొన్ని పట్టణాలపై పన్ను వసూళ్ల అధికారం ఇచ్చారు. కొన్ని చోట్ల ఖజానాపై పర్యవేక్షణను అప్పగించారు. వీటన్నిటితో మార్వాడీల చేతుల్లో నగదు పోగుపడింది. మొగలు సైన్యాల వెంట అప్పటికి కొంతకాలం ముందే యూపీ, బిహార్, బెంగాల్, మధ్యప్రదేశ్‌లకు కొందరు మార్వాడీలు వెళ్లారు. ఇక బ్రిటిష్ పాలనతో వ్యాపారభద్రత రావటంతో వారి వలసలు బాగా పెరిగాయి. ఈస్టిండియా కంపెనీకీ, ఆ తర్వాత బ్రిటిష్ వ్యాపారులకూ మధ్యవర్తులుగా పనిచేశారు. వాళ్లకే అప్పులిచ్చారు. బ్రిటిష్ పాలన నిలదొక్కుకోటానికి సహాయమూ చేశారు. ప్లాసీ యుద్ధంలో బ్రిటిష్ వారితో చేతులూ కలిపారు. కాంగ్రెస్ బలం పుంజుకున్నప్పుడు దానికి అండదండలూ ఇచ్చారు. వ్యాపారానికి అనువుగా ఉన్న ఏ అవకాశాన్ని వదులుకోలేదు. అన్నిచోట్లా వ్యాపార నిర్వహణకు సొంతకులం వారిపైనే ప్రధానంగా ఆధారపడి మెట్టుమెట్టుగా ఎదిగారు. వడ్డీలూ, సరుకుల కొనుగోలు, అమ్మకాల స్థాయి నుంచి పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన తర్వాత ఆధునిక మేనేజ్‌మెంట్ పద్ధతులను పాటిస్తున్నా ఇప్పటికీ కులాభిమాన సంస్కృతి మార్వాడీల్లో బలంగానే ఉంటుంది. సోషలిస్టు విధానాల పేరుతో వ్యాపార, పరిశ్రమ రంగాల విస్తరణపై కాంగ్రెస్ ఆంక్షలు పెట్టినప్పుడు స్వతంత్ర పార్టీ వైపునకు మొగ్గారు. ఆ తర్వాత బీజేపీకి మద్దతు పలికారు. కొన్నిచోట్ల హిందుత్వ రాజకీయాలకు ఛాంపియన్లుగా మారారు. ఇక హిందీ భాషా విస్తరణను వందేళ్ల నుంచీ మార్వాడీలు సమర్థిస్తూనే ఉన్నారు. జాతీయస్థాయిలో ఎటువంటి అడ్డంకుల్లేని మార్కెట్ ఉండాలని కోరుకునే వాళ్లకూ ప్రాంతీయ మార్కెట్‌పై ఆధిపత్యం ప్రాంతీయులకే ఉండాలని వాదించే వర్గాలకూ మధ్య సంఘర్షణ ఈనాటిది కాదు. అది ఇప్పట్లో ముగిసిపోయేదీ కాదు. నినాదాలు ఏవైనా రెండిటి వెనకాలా ఉన్నది ఆర్థికతంత్రమే!

జాతీయస్థాయిలో ఎటువంటి అడ్డంకుల్లేని మార్కెట్ ఉండాలని కోరుకునే వాళ్లకూ ప్రాంతీయ మార్కెట్‌పై ఆధిపత్యం ప్రాంతీయులకే ఉండాలని వాదించే వర్గాలకూ మధ్య సంఘర్షణ ఈనాటిది కాదు. అది ఇప్పట్లో ముగిసిపోయేదీ కాదు. నినాదాలు ఏవైనా రెండిటి వెనకాలా ఉన్నది ఆర్థికతంత్రమే!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

గాంధీ శకానికి వారసుడు

'తోటపల్లి గాంధీ'గా, 'కరీంనగర్ గాంధీ'గా పేరు గడించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కీ.శే. బోయినపల్లి వేంకట రామారావు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేటి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామంలో సెప్టెంబర్ 2, 1920న రంగమ్మ, కొండల్ రావు పుణ్య దంపతులకు జన్మించారు. చిన్ననాటి నుంచి వేంకట రామారావు చురుకైన విద్యార్థి. తండ్రితోను, ఇతర పెద్దలతోను చర్చల ద్వారా రాజకీయ సామాజిక స్థితిగతులను అవగతం చేసుకున్నారు. తోటపల్లిలో ప్రాథమిక విద్య అనంతరం రామారావుని పై చదువులకి కరీంనగర్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలకు మార్పించారు. తర్వాత గోలకొండ పత్రిక సంపాదకులు, ప్రసిద్ధ సాహితీవేత్త సురవరం ప్రతాపరెడ్డి ప్రేరణతో, ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వహించే మెట్రిక్యులేషన్ పరీక్షను 1939లో రాసి ఉత్తీర్ణుడైనా ఆ తరువాత చదువులకు ఫుల్‌స్టాప్ పెట్టారు. మొదటి నుంచి చురుకైన, తెలివైన విద్యార్థి అయినందున తెలుగుతో పాటు ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషలను కూడా నేర్చుకొన్నారు.



ఆర్య సమాజ్ స్థాపకులు దయానంద సరస్వతి రచన 'సత్యార్థ ప్రకాశం' చదవడం వలన ఆర్య సమాజ్ భావాల పట్ల ప్రభావితుడైన రామారావు, ఆ భావాలను ప్రజలలో వ్యాప్తి చేయడానికి 'నాటక సమాజం', 'భజనమండలి' స్థాపించారు. నాటకాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారు. దేవుని పేరు మీద పశుబలులను నిరసించారు. శాకాహారం గురించి ప్రచారం చేశారు. వేదాలలోని లోటుపాట్లను ఎత్తిచూపారు. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. తోటపల్లి గ్రామంలో 1946లోనే హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించారు. బాల్య వివాహాలను వ్యతిరేకించారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు. రామారావు సారథ్యంలో 40 జంటలకు కులాంతర, మతాంతర వివాహాలు జరిగాయి. 50 మంది వితంతువులకు పునర్వివాహం జరిగింది.

గాంధీజీ ఆత్మకథను చదివి గాంధీజీ ఆశయాలకనుగుణంగా తన జీవిత విధానాన్ని మార్చుకున్నారు రామారావు. శాంతి, అహింస, శాకాహారం, సత్యాగ్రహం, గ్రామ స్వరాజ్యం వంటి అంశాలు రామారావు జీవితంలో ముఖ్య భాగాలయ్యాయి. మూగజీవుల రక్షణార్థం జంతుబలులు వద్దని చెప్తూ 'జీవ రక్షక ప్రచారమండలి' స్థాపించారు. 1945లో గాంధీ మద్రాస్ నుంచి వార్ధా వెళుతున్నపుడు కాజీపేట రైల్వే స్టేషన్‌లో దూరం నుంచి గాంధీజీని దర్శించుకోవడం తన జీవితంలో ముఖ్యమైన సంఘటనగా భావించారు రామారావు. కందుకూరి వీరేశలింగం పంతులును ఆదర్శంగా తీసుకొని సమాజంలోని బాల్యవివాహాలు, జోగినీ వ్యవస్థ, కుల వివక్ష, బహు భార్యత్వం మొదలగు దురాచారాల నిర్మూలనకు కృషి చేశారు. వితంతు వివాహాలను ప్రోత్సహించారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, హైదరాబాద్ స్టేట్ స్వతంత్ర రాజ్యంగానే ఉంటుందని నిజాం ప్రభువు ప్రకటించినపుడు జాతీయవాదులైన తెలంగాణవాదులు, యోధులు పోరాటం చేశారు. అప్పుడు రామారావు కొంతకాలం అజ్ఞాతంలో కూడా ఉండవలసి వచ్చింది. నిజాం ప్రభుత్వం ఆయన కుటుంబసభ్యులను, బంధువులను ఇబ్బందులకు గురిచేసింది. వారి తండ్రి కొండల్రావును అరెస్ట్ చేసింది. 1945, అక్టోబర్ 1న, వారు నడుపుతున్న సంస్థలను మూసివేసింది. 1947 డిసెంబర్‌లో జమ్మికుంటలో రైల్వేట్రాక్ తొలగించే సందర్భంలో రామారావు, ఆయన అనుచరులు అరెస్ట్ అయ్యారు. చివరికి 1948, సెప్టెంబర్ 17న భారత సైనిక చర్య వలన హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్‌లో విలీనమైన తర్వాత జైలు నుంచి ధీరుడిలా విడుదలైనారు రామారావు.

1962లో కరీంనగర్ జిల్లా రచయితల సంఘాన్ని స్థాపించి, జిల్లాలోని పలువురు కవులు, రచయితలకు పెద్దదిక్కుగా నిలిచారు. ఆయన స్వయంగా రచయితగా– 'కరీంనగర్ జిల్లా దేవాలయాలు, జిల్లా గ్రంథాలయ సంస్థలు', 'కరీంనగర్ జిల్లా సాహితీ చరిత్ర', 'ఆంధ్ర మహాసభల వృత్తాంతం', 'బి. వేంకటరామారావు గేయాలు–1', 'వేంకటరామారావు గేయాలు–2', 'కరీంనగర్ జిల్లా రచయితల పరిచయ గ్రంథం', 'బోవేరా వ్యాసాలు', 'గాంధీ తత్వాలు', 'సారస్వత జ్యోతి గ్రంథమాల–1', 'గ్రంథమాల–2'... తదితర పుస్తకాలు రాశారు. 'సారస్వత జ్యోతి' అనే మూడు ప్రత్యేక సాహిత్య సంచికలు వారి సంపాదకత్వంలో వచ్చాయి.

ఇలా బహుముఖ ప్రజ్ఞతో నాటి తరానికి నేటి ప్రతినిధిలా, గాంధీజీ ఆశయాలు పాటిస్తూ తోటపల్లి గాంధీ, కరీంనగర్ గాంధీగా పేరు గడించిన బోయినపల్లి వేంకట రామారావు తన 95వ ఏట 27 అక్టోబరు 2014న అస్తమించారు. వారి అంత్యక్రియలను తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో మానేరు నదీ తీరాన నిర్వహించింది. నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు స్వయంగా ఈ అంత్యక్రియలకు హాజరయ్యారు. వారి పేరున మానేరు నది తీరాన ఒక స్మృతివనం ఏర్పాటు చేయవలసి ఉంది. వారి శిలా విగ్రహమును కరీంనగర్ పట్టణంలో ఒక కూడలిలో నెలకొల్పవలసి ఉంది. కందుకూరి వీరేశలింగం, రఘుపతి వెంకటరత్నం నాయుడులా తెలంగాణ నేలలో కరీంనగర్ కేంద్రంగా ఒక సంఘసంస్కర్తలా కార్యక్రమాలు నిర్వర్తించారు బోయినపల్లి వేంకట రామారావు. వారిని ప్రత్యక్షంగా గమనించిన వారికి తెలుస్తుంది వారు గాంధీ శకానికి వారసులు అని.

● **సబ్బని లక్ష్మీనారాయణ**

(నేడు బోయినపల్లి వేంకట రామారావు 105వ జయంతి)

5న గణపతుల నిమజ్జనం


భద్రకాళి దేవస్థానం అర్చకుడు భద్రకాళి శేషు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన (శుక్రవారం) గణపతుల నిమజ్జనం నిర్వహించాలని భద్రకాళి దేవస్థానం అర్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. గురువారం నాటికి నవరాత్రులు పూర్తవుతున్నందున శుక్రవారం నాడు నిమజ్జనం చేయాలన్నారు. కొందరు పది రోజులు, మరికొందరు పదకొండు రోజుల పాటు వేడుకలను నిర్వహిస్తున్నారని, ఈసారి అలా చేయవద్దని సూచించారు. ఈ నెల 7న గ్రహణం ఉన్నందున 5వ తేదీనే నిమజ్జనం చేయాలన్నారు. కొందరు శుక్రవారం చేయవద్దు అంటున్నారని, కానీ నిమజ్జనానికి వార దోషం ఉండదని స్పష్టం చేశారు. నవరాత్రి పాంచన దీక్ష జరిపిన వారు దీక్ష విరమణ చేసి జలంలో గణపతిని నిమజ్జనం చేయాలని శేషు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్ర విద్యా పాలసీ మెంబర్‌గా కడియం



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి చోటు దక్కింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు చైర్మన్ కాగా, శ్రీహరితో పాటు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామక్రిష్ణారావు, తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ వి.బాక్రిష్ణారెడ్డి సభ్యులుగా ఉన్నారు. విద్యాశాఖ సెక్రెటరీ యోగితా రాణా సభ్య కన్వీనర్‌గా నియమితులయ్యారు. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)-2020, రాష్ట్ర నిర్దిష్ట విద్యా అవసరాలు, ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని ఈ కమిటీ ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించనున్నది.



పంచాయతీ పోరుకు సై

- ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు
- గ్రామం యూనిట్‌గా వార్డుల వారీగా ఓటర్ల జాబితా
- నేడు తుది జాబితా ప్రకటన
- 90 శాతం ఏర్పాట్లు పూర్తి
- బ్యాలెట్ బాక్సులు సిద్ధం
- పోలింగ్ సిబ్బంది నియామకం
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఖరారుతో ఉత్సాహం

హనుమకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండడంతో జిల్లా యంత్రాంగాలు ఏర్పాట్లలో తలమునకలై ఉన్నాయి. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల ఆమోదం కూడా పొందడంతో ఏ క్షణాన్నయినా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఈ లోగా ఏర్పాట్లు పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల గుర్తింపు, రూట్ మ్యాపులు సిద్ధం చేయడం, సిబ్బంది నియామకం, వారికి శిక్షణ ఇవ్వడం తదితర ఏర్పాట్లు 90శాతం వరకు పూర్తయ్యాయి. ఇక మిగిలింది తుది ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల ఖరారు. ఓటర్ల జాబితాల సవరణకు సంబంధించిన షెడ్యూల్ ఇటీవలే విడుదలైంది. ఆ మేరకు జాబితాలు సిద్ధం అయ్యాయి. ఓటర్ల తుది జాబితాను మంగళవారం ప్రచురిస్తారు. దీనితో పంచాయతీ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు ఎంత మంది అనేది తేటతెల్లం కానున్నది.

పంచాయతీల స్వరూపం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,708 గ్రామ పంచాయతీలు, 15,006 వార్డులు, 15,006 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వరంగల్ జిల్లాలో 317 పంచాయతీలు, 2,754 వార్డులు, 2,754 పోలింగ్ కేంద్రాలు, హనుమకొండ జిల్లాలో 210 పంచాయతీలు, 1,986 వార్డులు, 1,986 పోలింగ్ కేంద్రాలు, జనగామ జిల్లాలో 280 పంచాయతీలు, 2,534 వార్డులు, 2,534 పోలింగ్ కేంద్రాలు, మహబూబాబాద్ జిల్లాలో 482 పంచాయతీలు, 4,110 వార్డులు, 4,110 పోలింగ్ కేంద్రాలు, ములుగు జిల్లాలో 171 పంచాయతీలు, 1,520 వార్డులు, 1,535 పోలింగ్ కేంద్రాలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 248 పంచాయతీలు, 2,101 వార్డులు, 2,102 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

సిద్ధమైన ఓటర్ల జాబితాలు

పంచాయతీ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితా రూపుదిద్దుకుంటోంది. కార్యదర్శులు పంచాయతీల వారీగా ఓటర్ల వివరాలను పోర్టల్‌లో నమోదు ప్రక్రియ ఆగస్టు 10వ తేదీతో ముగిసింది. ఎన్నికల సంఘం ఆదేశానుసారం గ్రామం యూనిట్‌గా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను మళ్లీ తయారు చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా రూపొందించి ఎంపీడీవోల లాగిన్ ద్వారా టీపోల్ పోర్టల్‌లో నమోదు చేశారు. అయితే పంచాయతీలు వార్డుల సంఖ్య పెరగడం లేదా కొన్ని చోట్ల తగ్గడం జరిగిన నేపథ్యంలో మళ్లీ ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల్సి వచ్చింది. ఈ మేరకు తాజాగా ఓటర్ల సవరణను చేపట్టారు. ఎన్నికల సంఘం ఇటీవలే సవరణకు షెడ్యూల్ జారీ చేసింది. దీని ప్రకారం మండల, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఆగస్టు 28న గ్రామ పంచాయతీల వారీగా ఫొటో ఎలక్టోరల్ ముసాయిదా జాబితాను తయారు చేశారు. 29వ తేదీన ఈ ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను తెలుసుకునేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారులు జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. 30వ తేదీన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల స్థాయిలో ఎంపీడీవోలు నిర్వహించారు. ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వార్డులవారీగా (మిగతా 6లో..)



హనుమకొండ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న దృశ్యం

కాంగ్రెస్ అంటేనే కక్ష సాధింపు..

- కాళేశ్వరంపై కావాలనే రాద్ధాంతం చేస్తున్నారు
- బీజేపీతో కుమ్మక్కై బీఆర్‌ఎస్‌ను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారు
- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్
- కాంగ్రెస్ పార్టీ, సీఎం దిష్టిబొమ్మల దహనం

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అంటే.. కక్ష సాధింపు, కమీషన్లు, కాలయాపన అని బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్ ధ్వజమెత్తారు. బీడువారిన భూములకు నీళ్లు ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే.. దానిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నుంచి కాళోజీ, అంబేద్కర్ జంక్షన్, పబ్లిక్‌గార్డెన్ మీదుగా హనుమకొండ చౌరస్తా వరకు బీఆర్‌ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వినయభాస్కర్, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి చౌరస్తాలోని ప్రధాన రోడ్డుపై నల్లా జెండాలతో బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం దిష్టిబొమ్మలను దహనం చేశారు.

ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంప్‌హౌస్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్, 141 టీఎంసీల స్టోరేజీ, 530 మీటర్లకు ఎత్తిపోయడం, 240 టీఎంసీల నీటి ఉపయోగంలాంటివన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఒక బ్యారేజీలో 100 పిల్లర్లలో 3 పిల్లర్లు కుంగితే.. కాంగ్రెస్ పార్టీ రాద్ధాంతరం చేయడం దుర్మార్గమన్నారు. కమీషన్ల పేరుతో కేసీఆర్‌పై బురదజల్లే ప్రయత్నంతో పాటు బీఆర్‌ఎస్‌ను అణగదొక్కేందుకు బీజేపీతో కాంగ్రెస్ పార్టీ మిలాఖత్ అయిందని ఆరోపించారు. కాగా సీఎం దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో సీఐ శివకుమార్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సంకు నర్సింగ్‌రావు, కిరణ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజనీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు బొల్లపెల్లి పున్నం చందర్, విక్టరీబాబు, వెంకన్న, రమేష్, స్నేహిత్, శరత్, రాకేష్‌యాదవ్, వినీల్‌రావు, రవీందర్, మూటిక రాజు, సోని, అఫ్జల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పరవళ్లు తొక్కుతున్న బొగత

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లిలోని బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. కొండల పైనుంచి దూకుతున్న జలధారలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. జలపాతం అందాలను వీక్షించేందుకు పర్యాటకులు సోమవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి సహజ సౌందర్యాన్ని కెమెరాల్లో బంధిస్తూ, సెల్ఫీలు దిగుతూ మైమరచిపోయారు.

\- ఆంధ్రజ్యోతి, వాజేడు

పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి..

- ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల ఉద్యోగులు సోమవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ముందుగా హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యోగ జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు, జేఏసీ నేత అన్నమనేని జగన్‌మోహన్‌రావు, టీఎస్‌యూటీఎఫ్ నాయకులు పి.రాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల జేఏసీ నేతలు బైరి సోమయ్య, గణిపాక రాజ్‌కుమార్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, గాజె వేణుగోపాల్, ఫణికుమార్, పుల్లూరు వేణు, గోపాల్, సదానందం, పనికెల రాజేష్, అనూప్, ప్రణయ్, పృథ్వీ, కిరణ్‌గౌడ్‌తోపాటు ఉద్యోగస్తులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, పెన్షనర్ల సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు లైజనింగ్ సెల్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంటకయ్య




వెంకటయ్యకు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

రాంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్పీడీసీఎల్‌లో ప్రత్యేక లైజనింగ్ సెల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ మెంబర్లు కుర్సం నీలాదేవి, రేణికుంట్ల ప్రవీణ్, శంకర్, రాంబాబు నాయక్‌లతో కలిసి సోమవారం ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కల్పిస్తున్న రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్స్, బ్యాక్‌లాగ్ వెకెన్సీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మర్ వెంకటయ్య మాట్లాడుతూ.. అసోసియేషన్ నాయకులు నివేదించిన సమస్యలపై నెలరోజుల్లో యాక్షన్ రిపోర్ట్ ఇవ్వాలని (మిగతా 6లో..)

ఆగని యూరియా రగడ

- అరకొర సరఫరాపై ఆగ్రహిస్తున్న అన్నదాతలు
- వెల్లువెత్తిన రైతులతో అట్టుడికిన మహబూబాబాద్ జిల్లా
- మరిపెడలో జాతీయ రహదారిపై రాస్తారోకో
- నాలుగు గంటల పాటు నిలిచిపోయిన రాకపోకలు
- కేసముద్రంలో తోపులాట.. పలువురికి గాయాలు
- రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు వర్షంలోనే జాగారం
- మహబూబాబాద్, కురవి, నర్సంపేట, వర్ధన్నపేటలో ఆందోళనలు



నర్సంపేటలోని అంగడి సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

మహబూబాబాద్/నర్సంపేట/వర్ధన్నపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యూరియా బస్తాల కోసం వెల్లువెత్తిన రైతులతో సోమవారం మహబూబాబాద్, వరంగల్ జిల్లాలు అట్టుడికాయి. పలుచోట్ల రైతులు ఆందోళనలకు దిగారు. పీఏసీఎస్‌ల ఎదుట బారులు తీరారు. బస్తాల లోడుతో వచ్చిన లారీల వద్దకు తోసుకువచ్చారు. రైతువేదికల వద్ద తోపులాటలకు దిగారు. యూరియా కొరతను నిరసిస్తూ ధర్నా, రాస్తారోకోలు చేపట్టారు. కేసముద్రం రైతు వేదిక వద్ద సోమవారం తెల్లవారుజామున యూరియా బస్తాలకు టోకెన్ల పంపిణీలో తోపులాట జరగడంతో పలువురు రైతులకు గాయాలయ్యాయి. టోకెన్లు ఇస్తారనే సమాచారంతో ఆదివారం రాత్రి నుంచే సుమారు 500 మంది రైతులు క్యూలైనులో నిల్చొని అక్కడే నిద్రించారు. ఉదయం వివిధ గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మంది వరకు రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. రాత్రి నుంచి వర్షం పడుతుండడంతో గొడుగులు, కవర్లు కప్పుకొని అలాగే నిల్చున్నారు. ఉదయం వ్యవసాయాధికారులు టోకెన్ల పంపిణీ ప్రారంభించారు. కొద్దిసేపు టోకెన్లు సజావుగానే సాగినప్పటికీ రైతులు ఒక్కసారిగా గుంపుగా మారారు. దీంతో రైతులు, మహిళా రైతుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. రైతులు ఒకరిని ఒకరు నెట్టేసుకోవడం, పట్టాపాస్‌పుస్తకాల జిరాక్స్ ప్రతులను లాక్కొని వెళ్లారు. పలువురు రైతులకు స్వల్పగాయాలయ్యాయి. టోకెన్లు అందని రైతులు మహబూబాబాద్-వరంగల్, తొర్రూరు రహదారిపై బైఠాయించి రాస్తారోకో (మిగతా 6లో..)



కేసముద్రంలో రైతు వేదిక వద్ద తోపులాట



మరిపెడలోని జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

నేడు నలుగురు మంత్రుల రాక

మానుకోటలో వైద్య కళాశాల హాస్టల్ భవనాల ప్రారంభోత్సవం

మహబూబాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం వైద్య కళాశాల బాలుర, బాలికల హాస్టళ్లను ప్రారంభించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖ హాజరవుతున్నారని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. వీరితో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్ హాజరవుతారని పేర్కొన్నారు. మహబూబాబాద్ మెడికల్ కళాశాల హాస్టల్ భవనాల వద్ద సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు రూ.250 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు వివరించారు. ఉదయం 11 గంటలకు మానుకోటకు చేరుకుని హాస్టళ్లను ప్రారంభించాక వైద్య కళాశాల విద్యార్థులతో సమావేశమై మాట్లాడతారని తెలిపారు. వైద్య కళాశాలలో బాలుర, బాలికల హాస్టళ్లను ప్రారంభించిన తర్వాత 350 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

● ఫిర్యాదుదారులకు భరోసానివ్వడం మన బాధ్యత ● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ● 81 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్, అధికారులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ద్వారా వచ్చే ఫిర్యాదులపై వేగం పెంచి ప్రజలకు శాఖాపరమైన నమ్మకాన్ని పెంచాలని నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడారు. నగంరలో శానిటేషన్ సమస్య రాకుండా చూడాలన్నారు. గ్రీవెన్స్‌లో వస్తున్న ఫిర్యాదులే మళ్లీ వస్తున్నాయని, సమస్యలు పునరావృత్తం కాకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి 81 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, పన్నుల అధికారి రామకృష్ణ, డీఎఫ్‌వో శంకర్‌లింగంతో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇలా..

● హనుమకొండ వడ్డేపల్లి టీచర్స్‌కాలనీ రోడ్డు నెం.2, 5లో ఓ వ్యక్తి 30 ఫీట్ల రోడ్డును ఆక్రమించి ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడు. అక్రమ నిర్మాణాలపై గతంలో పలుమార్లు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు రోడ్డుపై అక్రమ కట్టడాలను కట్టడి చేయాలని కాలనీవాసులు కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందించారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

● గ్రేటర్ 29వ డివిజన్ పాపయ్యపేట, రామన్నపేట, రఘునాథ్‌కాలనీ, ఓఎస్ నగరంలో చాలా సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఇక్కడ ప్రభుత్వ భూమిలో మాజీ ఉపరాష్ట్రపతి బాబు జగ్జీవన్‌రామ్ స్మారక కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని కొందరు ప్రజాప్రతినిధులు విలువైన స్థలాన్ని ఆక్రమించి వాటర్ ప్లాంట్ నిర్మించి నిరుపయోగంగా మిగిల్చారని కమిషనర్‌ను విన్నవించారు.

● నగర పాలక సంస్థ మలేరియా విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో 90 మంది కార్మికులు పని చేస్తున్నారు. వారికి గత రెండు నెలల కిందట జీతాలు పెంచుతూ కౌన్సిల్ తీర్మానం చేశారు. పెంచిన జీతాలు ఇప్పటివరకు అందలేదు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి మలేరియా సిబ్బందికి పెంచిన జీతాలు చెల్లించాలని తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం అందించారు.

● కాజీపేట దర్గా ప్రాంతంలో ఇందిరమ్మ కాలనీలో 20 ఏళ్లుగా 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అదే ప్రాంతంలో ఉండే రాకేశ్, రాజు అనే ఇద్దరు వ్యక్తులు సుమారు 300లకు పైగా పందులను పెంచుతూ ఇండ్లపైకి వదులుతున్నారు. గతంలో వారికి పిలిచి మందలించగా తమపైకి దాడికి ప్రయత్నించి దుర్భాషలాడారు. దీనిపై స్పందించి న్యాయం చేయాలని ఇందిరమ్మ కాలనీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కమిషనర్‌ను కలిసి విన్నవించారు.

ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి.. ఇంజనీరింగ్ విభాగంపై 18 ఫిర్యాదులు రాగా హెల్త్, శానిటేషన్ 8, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ 11 వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ 41, మంచి నీటి సరాఫరా -1, హార్టికల్చర్ 2 ఫిర్యాదులు అందాయి. మొత్తం 81 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.

ఉపరాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన ఎంపీ కావ్య

హనుమకొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 9వ తేదీన జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఎంపీల మద్దతు కోసం పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వచ్చిన ఆయనను ఎంపీ డాక్టర్ కావ్య భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్య మాట్లాడుతూ.. రాజ్యాంగం పట్ల, రాజ్యాంగ పరిరక్షణ పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన సుదర్శన్‌రెడ్డి ఇండియా కూటమి అభ్యర్థిగా, కూటమికి ట్రంప్ కార్డుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.



ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డితో ఎంపీ డాక్టర్ కావ్య

అఖిల భారత మేయర్ల సదస్సుకు సుధారాణి



వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ (ఏఐసీఎం) సదస్సుకు వరంగల్ మేయర్ గుండు సుధారాణి ఎంపకయ్యారు. హరియాణా రాష్ట్రంలోని కార్నాల్ జిల్లాలో ఈ నెల 2, 3 తేదీలలో 53వ సర్వసభ్య సమావేశం జరుగనున్న నేపథ్యంలో మేయర్‌కు ఆహ్వానం అందింది. మేయర్ సుధారాణి ఈ సదస్సులో పాల్గొంటారు. దేశంలోని పలు రాష్ట్రాల మునిసిపల్ కార్పొరేషన్‌ల స్థితిగతులు, అభివృద్ధిపై రెండు రోజుల సదస్సులో చర్చ జరగనుంది. తనకు ఈ అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందని మేయర్ సుధారాణి తెలిపారు.

నాలుగేళ్ల స్థానికతపై సంబరాలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెడికల్ అడ్మిషన్లలో స్థానికత అన్న అంశంపై ఎట్టకేలకు నీట్ పేరెంట్స్ అసోసియేషన్ విజయం సాధించింది. మెడికల్ అడ్మిషన్ల స్థానికత కోసం తీసుకొచ్చిన జీవో 33ను తప్పకుండా అమలు చేయాలని నీట్ పేరెంట్స్ అసోసియేషన్ ఇటీవల అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ క్రమంలో సోమవారం సుప్రీంకోర్టు తెలంగాణ వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థులకు నాలుగేళ్ల స్థానికత తప్పనిసరి అని తీర్పునిచ్చింది. సోమవారం నీట్ పేరెంట్స్ అసోసియేషన్ కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీలో రిజిస్ట్రార్ నాగార్జునరెడ్డిని కలిసి స్వీట్లు అందించిన అనంతరం ఆవరణలో టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో నీట్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, పొడిశెట్టి రమేశ్ కుమార్, దొడ్డెపల్లి రఘుపతి, అంజాద్‌పాష తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేడీసీలో కామర్స్ సబ్జెక్టులో గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వరకు దరఖాస్తులు చేసుకోవాలని, 4న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. పీజీ, పీహెచ్‌డీ, నెట్ స్లెట్ ఉన్న వారికీ ఎంపికల్లో ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 99633-56835 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దీర్ఘకాలిక సెలవులో డిప్యూటీ కమిషనర్

కాశిబుగ్గ ఇన్‌చార్జి డీసీగా సమ్మయ్యకు బాధ్యతలు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కాశిబుగ్గ సర్కిల్ -1 డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.ప్రసన్నరాణి దీర్ఘకాలిక సెలవులో వెళ్లనున్నారు. ఆమె స్థానంలో ప్రస్తుతం బల్దియా ప్రధాన కార్యాలయం డిప్యూటీ కమిషనర్ (అడ్మిన్)గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.సమ్మయ్య అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రసన్నరాణి అమెరికాకు వెళ్లేందుకు కమిషనర్‌కు అర్జీ పెట్టుకోగా సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 8 వరకు 38 రోజుల పాటు దీర్ఘకాలిక సెలవును మంజూరు చేశారు.

ఆగని యూరియా రగడ

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. యూరియా అందించాలని నినాదాలు చేస్తూ బైఠాయించారు. కొద్దిసేపటి తర్వాత పోలీసులు సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు.ఇక మరిపెడలోనూ యూరియా ఆందోళన తీవ్రంగా కొనసాగింది. సోమవారం మరిపెడ పీఏసీఎస్‌కు తెల్లారిజామునుంచే వివిధ గ్రామాల నుంచి రైతులు సద్దులు కట్టుకొని పెద్ద ఎత్తున చేరుకున్నారు. తొమ్మిది అయ్యాక ఈ రోజు యూరియా రావట్లేదని లారీలు రేపు వస్తాయని రేపే యూరియా పంపిణీ జరుగుతుందని అధికారులు తెలుపడంతో రైతులకు కోపం కట్టలు తెంచుకుంది. మరిపెడబంగ్లాలోని సెంట్రల్ పెట్రోల్ బంకు దగ్గరికి చేరుకొని 365-563 నేషనల్ హైవేపై ధర్నాకు దిగారు. ఉదయం 10గంటలకు మొదలైన ఆందోళన మధ్యాహ్నం 2గంటల వరకు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిస్తూ చే పట్టారు. రైతుల ధర్నాతో ఎన్‌హెచ్ ఏపై భారీగా వాహనాలు కిలోమీటర్లకొద్ది నిలిచిపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను బుజ్జగించారు. ససేమిరా అంటూ యూరియా ఇస్తేనే ఇక్కడినుంచి కదులుతామని భీష్మించి నాలుగు గంటల పాటు ధర్నాకు దిగారు. ధర్నాతో బస్సుల్లోని ప్రయాణికులు అన్నపానీయాల కోసం అరిగోస పడ్డారు. చివరి ప్రయత్నంగా ఏడీఏ విజయ్‌చందర్, ఏవో వీరాసింగ్, సీఐ, ఎస్సైలు రైతులను బతిమలాడి రేపు 8వేల యూరియా బస్తాలను తెప్పించి ఊరూరా కౌంటర్లను ఏర్పాటు చేసి యూరియా సరఫరా చేస్తామని నమ్మకమైన హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తొర్రూరు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై వాటర్ ట్యాంక్ వద్ద యూరియా కోసం స్వచ్ఛందంగా రైతులు సుమారు 3 గంటల పాటు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. యూరియా లేదని చెప్పడంతో ఆగ్రహించిన రైతులు తాటికమ్మలు తెచ్చి రోడ్డు వేసి తగులబెట్టారు. అనంతరం మూడు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి యూరియా అందించాలని నినాదాలు చేశారు. కురవి జాతీయ రహదారిపై యూరియా కోసం రైతులు రాస్తారోకో నిర్వహించారు. యూరియా వస్తుందంటే సొసైటీకి ఉదయమే వచ్చామని, గంటల తరబడి వేచి ఉన్నప్పటికి యూరియా రాకపోవడంతో ఆగ్రహించిన రైతులు కురవి జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో ఎస్సై గండ్రాతి సతీష్ రాస్తారోకో వద్దకు వచ్చి రైతులకు నచ్చజెప్పి రాస్తారోకో విరమింప చేశారు. గూడూరులో రెండు ప్రైవేట్ దుకాణాలకు 440 బస్తాలు యూరియా వచ్చిందన్న సమాచారం మేరకు భారీ స్థాయిలో రైతులు షాపుల వద్దకు చేరుకున్నారు. యూ రియా బస్తాల పంపిణీ కోసం గూడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారికి టోకెన్లు ఇచ్చారు. కేవలం గూడూరు గ్రామానికి చెందిన రైతులకు మాత్రమే యూరియా టోకెన్లు ఇచ్చి యూరియా బస్తాలను అందించారు. గ్రామాల నుంచి వచ్చిన రైతులు యూరియా అందకపోవడంతో గతంలో టోకెన్లు ఇచ్చిన 1500 మంది రైతులు నిరాశతో ఇంటిముఖం పట్టారు. ఇక నర్సంపేటలోని అంగడి సెంటర్ వద్ద మాధన్నపేట, నాగుర్లపల్లె, రాజుపేట, ముత్తోజిపేట గ్రామాల రైతులు రాస్తారోకో నిర్వహించారు. నాట్లువేసి సుమారు రెండు నెలలు అవుతున్నా రైతులకు సరిపడా యూరియాను రేవంత్ సర్కార్ అందించడం లేదని రైతులు నినదించారు. గంట పాటు రైతులు చేపట్టిన రాస్తారోకో కారణంగా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇక నెక్కొండ మండలంలోని తోపనపలి లో రైతులు యూరియా కోసం రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. క్యూ లైన్‌లో సుమారు 750 మంది రైతులు ఉన్నారు. కేవలం 222 మంది రైతులకు కేవలం 2 బస్తాల వంతున ఇచ్చినప్పటికీ మిగతా రైతులు రోడ్డుపై వచ్చి రాస్తారోకో చేస్తూ ఆందోళనకు దిగారు. ఇక వర్ధన్నపేటలోనూ రైతులు ఆందోళనకు దిగారు. పట్టణంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించారు. అయితే ఆందోళన చేస్తున్న రైతుల పట్ల వర్ధన్నపేట అదనపు ఎస్ఐ మేరుగు రాజు వ్యవహరించిన తీరును పలువురు విమర్శించారు. రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారంటూ వారిని బలవంతంగా పోలీసు జీపులో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. వర్ధన్నపేట ఆగ్రోస్ సెంటర్ చుట్టూ గత పది రోజులుగా తిరుగుతూ పడిగాపులు కాస్తున్నప్పటికీ, యూరియా దొరకడం లేదని రైతులు ఆరోపించారు.

ఫీడర్ స్మార్ట్ మీటర్‌లను పర్యవేక్షించిన సీఎండీ

రాంనగర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సర్కిల్‌లోని సుబేదారి సెక్షన్‌లో ఎంసీబీ, ఫీడర్ స్మార్ట్ మీటర్‌లను సోమవారం సీఎండీ కర్నాటీ వరుణ్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్‌ల ద్వారా ఎల్‌టీ లైన్లలో సమస్య త్వరతగిన పరిష్కారించడానికి కార్పొరేట్ ఆఫీస్‌లో ఉన్న కంట్రోల్ రూమ్ సంబంధిత ఏడీఈ, ఏఈలకు సమాచారం వెళ్తుందని, తద్వారా సమస్యను గుర్తించి పరిష్కరించేందుకు ఫీడర్‌స్మార్ట్ మీటర్ దోహదం చేస్తుందన్నారు. ఎక్కడైతే సమస్య ఉందో అక్కడి వరకు లైన్ కట్‌చేసి మిగతా వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ పునరుద్ధరించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈ సాంబరెడ్డి, దర్శన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా రవి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు భీమనాథుడి రవి ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సంఘం రాష్ట్ర ఎన్నికల్లో రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా, రవి హనుమకొండలోని బాసిత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇరవై ఏళ్ల నుంచి ఎస్టీయూలో పనిచేస్తున్నారు.

కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

శంభునిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలని, నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 3వ తేదీలోగా తమ దరఖాస్తులను కళాశాలలో ఇవ్వాలని తెలిపారు. వివరాలకు 9440020690 నెంబర్‌లో సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

డ్రైవర్‌కు గాయాలు.. బొల్లికుంట వద్ద ప్రమాదం..



నుజ్జునుజ్జయిన ఆటో

మామునూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మామునూరు బొల్లికుంట వాగ్దేవి కళాశాల ప్రధాన రహదారి వద్ద సోమవారం రాత్రి 11.30గంటలకు ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ బర్ల అజయ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కాగా అజయ్ సొంత పని మీద ఆటోలో వరంగల్ వైపునకు వస్తుండగా ఖమ్మం - వరంగల్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చి ఢీకొంది. క్షతగాత్రుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలంలో ఆటో నుజ్జు నుజ్జు అయింది.

స్టాం వాటర్ డ్రైన్‌లు ఏర్పాటు చేయాలి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణంలో స్ట్రాం వాటర్ డ్రైన్‌లు ఏర్పాటు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. సోమవారం బాలసముద్రంలోని కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ఏజెన్సీ ప్రతినిధులు, గ్రేటర్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఎస్‌టీపీలు, స్ట్రాంవాటర్‌పై అధికారులు దృష్టి సారించి డీపీఆర్‌లు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, ఇరిగేషన్ ఈఈ కిరణ్, డీఈ హర్షవర్ధన్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు లైజనింగ్ సెల్

(5వ పేజీ తరువాయి)

సూచించారు. పరిష్కారంకాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిండంలో కమిషన్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా.. కమిషన్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతీ 3నెలలకోసారి పర్మినెంట్ నెగోషియన్ కమిటీ (పీఎన్‌సీ) ఏర్పాటు చేయాలని, రోస్టర్ పాయింట్స్‌ను తనిఖీ చేసుకునే అవకాశం ఉద్యోగులకు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అవలంబిస్తున్న విధానాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ సి.ప్రభాకర్ వివరించారు. ఈ సందర్భంగా ఎస్టీ, ఎస్సీ అసోసియేషన్ నాయకులు అజ్మీరా శ్రీ రాంనాయక్, బక్కి దానయ్య, ఆనందం, రాందాస్ నాయక్‌లు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్‌కు నివేదించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, సీఈ మాధవరావు, జీఎంలు గిరిధర్, శ్రీ కృష్ణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డబ్బులను దొంగిలించిన మహిళ అరెస్టు

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళ భుజానికి వేసుకున్న హ్యాండ్‌బ్యాగులో నుంచి రూ.75,000 డబ్బులను దొంగలించిన మహరాష్ట్ర నాగ్‌పూర్‌కు చెందిన మహిళా దొంగను హనుమకొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హనుమకొండ సీఐ శివకుమార్ కథనం ప్రకారం.. ములుగు జిల్లా గొల్లవాడ గ్రామానికి చెందిన ప్రమీల అనే మహిళ.. ఆస్పత్రి పని మీద హైదరాబాద్ వెళ్లేందుకు సోమవారం హనుమకొండ బస్టాండ్‌కు వచ్చింది. బస్సు ఎక్కుతుండగా రద్దీ సమయంలో గుర్తు తెలియని మహిళ ఆమె బ్యాగులో నుంచి డబ్బులు దొంగలించింది.

ఇది గ్రహించిన బాధిత మహిళ కేకలు వేయడంతో అక్కడే విధుల్లో ఉన్న ఎస్సై కిషోర్ మహిళను అదుపులోకి తీసుకొని సోదా చేయగా రూ.75,000 పట్టుబడ్డాయి. అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేయగా మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన సరిఫబాయి సురేశ్ మంకార్‌గా చెప్పింది. నిందితురాలిపై గతంలో హైదరాబాద్‌లో కేసు నమోదు అయింది. ప్రయాణికులు బస్సు ఎక్కే, దిగే క్రమంలో డబ్బులు, ఆభరణాలు, సెల్‌ఫోన్‌లను జాగ్రత్తగా పెట్టుకోవాలని సీఐ సూచించారు.

8 నుంచి కేయూ ఫార్మ్ డీ రెగ్యులర్ పరీక్షలు

కేయూక్యాంపస్ సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 8 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫార్మ్ డీ మొదటి ఏడాది రెగ్యులర్ పరీక్షలు జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎమ్డీ ఆసీం ఇక్బాల్‌లు సోమవారం తెలిపారు. సెప్టెంబరు 8, 10, 12,15, 17.19 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరు కావాలని స్పష్టం చేశారు.

పంచాయతీ పోరుకు సై

(5వ పేజీ తరువాయి)

తయారు చేసిన ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించారు. 31న వచ్చిన అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారి పరిష్కరించారు. ఈనెల 2వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తారు.

వార్డుల వారీగా విభజన

గతంలో అనుబంధ గ్రామాలుగా ఉన్న పంచాయతీలు నేడు ప్రత్యేక పంచాయతీలుగా ఆవిర్భవించాయి. అందుకే పంచాయతీ కార్యదర్శులు ముందుగా పంచాయతీల వారీగా ఓటర్లను పోర్టల్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత రెండో దశలో పంచాయతీలకు వచ్చిన ఓటర్లతో వార్డుల వారీగా విభజించారు.. ఈ ప్రక్రియలో ఒక కుటుంబ సభ్యుల ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కొత్త జాబితాలో మృతుల పేర్లను తొలగించడంతో పాటు కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నవారి పేర్లను చేర్చారు. ప్రస్తుత ప్రక్రియ కారణంగా ఓటర్ల వరుస సంఖ్యలో కొన్ని మార్పులు చేసుకునే అవకాశం ఉంది. కొత్తగా నమోదైన ఓటర్లను ఎక్కడ చేర్చాలనే దానిపై తుది నిర్ణయం తీసుకున్నారు. సాధ్యమైనంత వరకు వారు నివసిస్తున్న వార్డులో ఓటు ఉండేలా చూశారు. ఆ వార్డుకు ఓటర్ల సంఖ్య పరిమితి మించితే ఇతర ప్రాంతానికి మార్చారు. ఒక్కో వార్డుకు 300 మందిలోపు ఓటర్లు ఉండేలా విభజన ప్రక్రియను చేపట్టారు. ఆ మేరకు ఓటర్ల జాబితాల్లో వారి పేర్లను స్థానికతను బట్టి చేర్చారు. తుది ఓటర్ల జాబితా నాటికి ఎంత మంది పెరిగేది ఈనెల 2న ప్రచురించే తుది ఓటర్ల జాబితాను బట్టి తెలుస్తుంది. గతంలో కన్నా ఈ సారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

పోలింగ్ కేంద్రాలు

ఉమ్మడి జిల్లాలో పంచాయతీల సంఖ్య, వార్డు స్థానాల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. దీనితో పోలింగ్ కేంద్రాల సంఖ్యలో కూడా హెచ్చు తగ్గులు ఉండనున్నాయి. ములుగు జిల్లాలో ఇది వరకు 174 పంచాయతీలు ఉండేవి. వీటిలో మూడు కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీ పరిధిలోకి రావడంతో వీటి సంఖ్య 171కి తగ్గింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇది వరకు 241 పంచాయతీలు ఉండేవి. ఏడు అదనంగా వచ్చి చేరడంతో వీటి 248కి పెరిగింది. జనగామ జిల్లాలో గత ఏడాది రెండు కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కావడంతో మూడు గ్రామపంచాయతీలు ఇందులో విలీనం అయ్యాయి. జిల్లాలో ప్రస్తుతం 280 జీపీలు ఉన్నాయి.

శిక్షణ

ఎన్నికల నిర్వహణకు ఆర్‌వోలు, ఏఆర్‌వోలు, పీవోల నియామక ప్రక్రియ పూర్తయింది. వీరితో పాటు బీఎల్‌వోలకు శిక్షణ ఇవ్వడం కూడా పూర్తయింది. వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులను కేటాయించారు. ఫారిన్ సర్వీస్‌పై ఇతర ప్రభుత్వశాఖల్లోకి డిప్యూటేషన్‌పై వెళ్లిన పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బందిని ఎన్నికల నిర్వహణకు గాను పక్షం రోజుల కిందట తిరిగి మాతృశాఖకు బదిలీ చేశారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రి జిల్లా పంచాయతీ కార్యాలయాలకు ఇది వరకే చేరింది. బ్యాలెట్ బాక్సుల కొరత లేకుండా చూడడానికి ముందస్తు ఏర్పాట్లలో భాగంగా పక్క రాష్ట్రాల నుంచి బాక్సులు తెప్పిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల ఎంపిక ఇప్పటికే పూర్తయింది. ఇక ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులకు కేటాయించే గుర్తులు కూడా సిద్ధమైనట్టు సమాచారం. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డు సభ్యులకు 20 గుర్తులను ఆమోదించినరట్లుగా తెలుస్తోంది. దాదాపు అవే గుర్తులు ఖరారయ్యే అవకాశం ఉంది.

రిజర్వేషన్ల సందడి

పంచాయతీ ఎన్నికల్లో ప్రస్తుతం ఎన్నికల రిజర్వేషన్లే హాట్‌టాపిక్‌గా మారింది. సామాజికవర్గాల వారీగా ఆశావహులు పోటీకి సిద్ధమవుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలించకుంటే స్థానిక ఎన్నికల వైపు గురిపెడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సగం దాకా మహిళా రిజర్వేషన్లు ఉండడంపైనా తర్జనభర్జన పడుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లో సామాజిక వర్గాల జనాభా శాతం, మహిళల సంఖ్యతో పాటు గతంలో వరుసగా మూడు సార్లు వచ్చిన రిజర్వేషన్లను కూడా పరిగణలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7550	5300
మక్కలు	2216	1521
కందులు	5582	3022
పెసళ్లు	5550	3022
పల్లికాయ (సూక)	6200	3500
పల్లికాయ (పచ్చిది)	4260	2400
పసుపు (కాడి)	11066	7889
పసుపు (గోల)	10788	8996
తేజ మిర్చి	12000	9500
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15000	12000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్341ఏసీ	15000	9000
దీపిక	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)



మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.

ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్.. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ మగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఈ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలుయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్ద సారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది పడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో ఆయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని ఆయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత

సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- టీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒకట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే మున్ముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరఫున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే .ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

ఆయుష్ డిస్పెన్సరీల్లో

యోగా కేంద్రాలు

- 220 కేంద్రాల్లో 348 మంది యోగా శిక్షకుల నియామకం
- భూపాలపల్లిలో 50 పడకల ఆయుష్ ఆస్పత్రి
- సమయపాలన పాటించని సిబ్బందిపై కఠిన చర్యలు
- ఆయుష్ ఆర్‌డిడి డాక్టర్ బంటు ప్రమీలదేవి



వరంగల్ మెడికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ శాఖ పరిధిలోని సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకులు (ఆర్‌డిడి) డాక్టర్ బంటు ప్రమీల దేవి కోరారు. ఉమ్మడి జిల్లాలో ఆయుష్ వైద్య సేవల విస్తరణకు గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు విస్తృతమైన ఏర్పాట్లు జరిగాయని అన్నారు. ఆయుష్ ద్వారా తన పరిధిలోని 19 జిల్లాల్లో అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో వైద్య సిబ్బంది, మందులు తదితర వివరాలను ఆమె 'ఆంధ్రజ్యోతి'కి వెల్లడించారు.

సమయ పాలన

ఆయుష్ ఆసుపత్రుల్లో విధులు సరిగా నిర్వర్తించని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది విషయంలో కఠిన చర్యలు తీసుకుకోవడంతో పరిస్థితి చాలా వరకు మెరుగుపడిందన్నారు. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (ఎన్ఆర్‌హెచ్ఎం) కింద పని చేస్తున్న డాక్టర్లు సిబ్బంది రోజుకు మూడు సార్లు ఉదయం 9, మధ్యాహ్నం 1, సాయంత్రం 4 గంటలకు తాము పని చేస్తున్న ప్రదేశం నుంచి ప్రత్యేక యాప్ ద్వారా తమ ఫోటోలతో లోకేషన్ పంపాల్సి ఉంటుందన్నారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆసుపత్రుల్లో ఉండడమే కాకుండా వారు ప్రత్యేక ద్వారా ముఖ గుర్తింపు పెట్టాలన్నారు. విధులకు సరిగా రానివారికి వేతనాల్లో కోతపాటు సెలవులు కూడా రద్దు చేస్తున్నామని తెలిపారు. ఆయుష్ శాఖలో తన పరిధిలోని జిల్లాల్లో 827 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 690 మంది కాంట్రాక్టు ఉద్యోగులున్నారని చెప్పారు.

ఆరోగ్య శిబిరాలు

వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ ప్రమీలదేవి తెలిపారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా గ్రామాల్లో ఫీవర్ క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 358 వైద్య శిబిరాలను నిర్వహించినట్టు తెలిపారు. ఆయుష్‌లో సిబ్బంది కొరత ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేయడానికి ఆశావర్కర్ల సహాయం కూడా తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 1030 మంది ఆశా వర్కర్లు ఆయుష్ సేవలను అందిస్తున్నారన్నారు. ఇందుకు గాను వీరికి నెలకు రూ. వెయ్యి గౌరవ వేతనంగా అందిస్తున్నామన్నారు.

50 పడకల ఆస్పత్రులు

రూ. 15 కోట్ల వ్యయంతో రెండు 50 పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేస్తున్నట్టు డాక్టర్ ప్రమీళా దేవి వెల్లడించారు. ఇందులో ఒకటి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో, మరొకటి సిద్దిపేటలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. భూపాలపల్లిలో ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయిందని, సిబ్బంది నియామకం త్వరలో పూర్తవుతుందన్నారు.

ఆయుర్వేదం, యునాని, హోమియో వైద్య సేవలు ఈ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంటాయన్నారు.

యోగా కేంద్రాలు

ప్రజల్లో యోగా పట్ల అవగాహన కలిగించడమే కాకుండా యోగాభ్యాసం పెంపొందించేందుకు ఆయుష్ డిస్పెన్సరీల్లో యోగా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాల నిర్వహణకు 420 మందికి గాను ఇప్పటికే 340 మందిని నియమించామన్నారు. యోగ శిక్షకులకు పురుషులకు నెలకు రూ. 8 వేలు, మహిళలకు రూ. 5 వేలు గౌరవ వేతనంగా చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ సెంటర్లలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పురుషులకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు మహిళలకు యోగాలో శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

ఉద్యమానికి సజీవ సాక్ష్యం.. అమరధామం

- మరో జలియన్‌వాలాబాగ్‌గా పరకాల ఉదంతం
- ప్రతీ ఏటా సెప్టెంబర్ 2న నివాళులు
- నాటి పరకాల రక్తచరిత్రకు 78 ఏళ్లు



అమరధామంలో ఏర్పాటు చేసిన నాటి సమరయోధుల విగ్రహాలు



పరకాలలో నిర్మించిన అమరధామం

పరకాల సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రజాకారుల పాశవిక దాడికి పరకాలలో 15 మంది సమరయోధులు అమరులయ్యారు. ఈ ఉదంతం జరిగి నేటితో 78 ఏళ్లు పూర్తయ్యాయి. ఆనాటి తెలంగాణ స్వాతంత్రోద్యమ చరిత్ర వింటే ఒళ్లు గగ్గుర్పొడుస్తోంది. అక్షరజ్ఞానం తక్కువ ఉన్న నాటి రోజుల్లోనే ఉద్యమం ఉప్పెనలా ఎగిసిందంటే పరకాల ప్రాంతానికి ఎంత చరిత్ర ఉందో అర్థం చేసుకోవచ్చు. భారతదేశం బ్రిటీష్ పాలన నుంచి విముక్తి చెంది ఆగస్టు 15న స్వేచ్ఛా స్వాతంత్ర్యం పొందినప్పటికీ నిజాం రాజు కబంధ హస్తాల్లో తెలంగాణకు విముక్తి లభించలేదు. స్వాతంత్ర్యం కోసం తెలంగాణ ప్రాంత ప్రజలు ఉద్యమం వైపు అడుగేశారు. ప్రజా సంఘాలు, సాయుధ పోరాటానికి సిద్ధమయ్యాయి. ఈ ఉద్యమానికి బెంబేలెత్తిన నిజాం సర్కారు.. ఖాసీం రజ్వీ రజాకారులను గ్రామాల పైకి ఉసిగొల్పింది. ఈ నేపథ్యంలో పరకాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని 1947 సెప్టెంబర్ 2న ఉద్యమకారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ కార్యక్రమానికి పరకాల ప్రాంతంలోని ప్రతీ గ్రామం నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. అప్పటికే పథకం ప్రకారం నిజాం సేనలు మాటు వేసి ఉన్నాయి. పట్టణంలోని తహసీల్ కార్యాలయం వరకు ప్రజలు చేరగానే రజాకారు మూకలు కత్తులు, బరిసెల, తల్వార్లతో ఉద్యమకారులను వెంబడించి ఊచకోత కోయగా నిజాం ఆధీనంలోని పోలీసులు తుపాకులతో విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 15 మంది అమరులవ్వగా వందలాదిమంది క్షతగాత్రులయ్యారు.

అమరధామంపై నిర్లక్ష్యం

ఉద్యమంలో ప్రాణాలర్పించి కొట్లాడిన ఉద్యమకారుల పేర్లు, వారి కృషి రోజురోజుకూ అంతరించి పోతోంది. ఆనాటి దృశ్యాలు, రక్తపు మరకలు నేటికి కూడా చెక్కు చెదరని రూపంలో అమరధామం చూస్తూ ఒళ్లు జలదరించే దృశ్యాలను కళాకారులు చిత్రీకరించారు. అయినా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అమరధామం రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటోంది. విగ్రహాల చేతులు ఊడిపోయి అమరధామంలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి.

ఏడాదికొకసారి సెప్టెంబర్ 2ను పురస్కరించుకొని ఉద్యమకారులు అమరధామానికి చేరుకొని అమరవీరులకు నివాళులర్పించి వెళ్లిపోతున్నారు. ఒక పర్యాటక కేంద్రంగా జిల్లాలో కొనసాగే అమరధామం విలువలు లేకుండా పోయింది.

అమరుల స్మారకార్థం మందిరం

తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల స్మారకార్థం పరకాలలో అమరవీరుల మైదానం ఏర్పాటు చేసి మందిరాన్ని నిర్మించారు. ఇప్పటికీ అక్కడ స్వాతంత్ర్య సమరయోధులు సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటారు. ఇదిలా ఉండగా అమరవీరులు రక్తం ఒడిసిన ప్రాంతంలో అమరధామాన్ని నిర్మించారు. అప్పటి మహారాష్ట్ర, తమిళనాడు గవర్నరు చెన్నమనేని విద్యాసాగర్‌రావు నేతృత్వంలో అమరధామంను ఏర్పాటు చేశారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో వారి తల్లి చెన్నమనేని చంద్రమ్మ జ్ఞాపకార్థం 23 ఏళ్ల కిందట అమరధామాన్ని నిర్మించారు. రంగాపురం సంఘటనకు సాక్ష్యంగా నిలిచే అమరుల చిత్రాలను అమరధామం చుట్టూ ఉద్యమకారుల విగ్రహాలను అబ్బురపరిచేలా ఏర్పాటు చేశారు. కాగా ప్రతీ ఏటా సెప్టెంబర్ 2న అమరధామం వద్ద స్వాతంత్ర్య సమరయోధులు, మేధావులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు అమరులకు నివాళులు అర్పిస్తుంటారు.

---

750 కిలోల గంజాయి పట్టివేత

పోలీసులు అదుపులో నలుగురు నిందితులు



చిలుకమ్మనగర్ శివారులో పోలీసు వాహనంలో తరలిస్తున్న పట్టుకున్న గంజాయి సంచులు

ఖానాపురం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిలుకమ్మనగర్ శివారు గువ్వల బోడు అటవీ ప్రాంతంలో అక్రమంగా డంప్ చేసిన 750 కిలోలకుపైగా ఎండు గంజాయిని సోమవారం పోలీసులు పక్కా సమాచారం మేరకు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఒడిశా నుంచి హైదరాబాద్‌కు టాటా ఏసీ వాహనంలో 23బస్తాలలో ఎండు గంజాయిని నలుగురు వ్యక్తులు తరలిస్తున్నారు. ఈ క్రమంలో భారీ వర్షం కురుస్తుండడంతో నిందితులు కొత్తగూడ చిలుకమ్మనగర్ బార్డర్‌లో గువ్వల బోడు సమీపంలోని అటవీ ప్రాంతంలో డంప్ చేసారు. వాహనాన్ని అక్కడి నుంచి తరలించి నలుగురు నిందితులు దూరం నుంచి కాపలా కాశారు. పక్కా సమాచారం అందుకున్న దుగ్గొండి సిఐ సాయి రమణ, స్థానిక ఎస్సై రఘుపతిలు సిబ్బందితో కలిసి వెళ్లి డంప్‌చేసిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్కడే తూకం వేసి టాటాఏసీ, పోలీసు వాహనాలలో నర్సంపేటకు తరలించినట్లు సమాచారం. అదే విధంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా, గంజాయి ఒడిశా రాష్ట్రం నుంచి భద్రాచలం మీదుగా వస్తున్నట్లు మరో సమాచారం.

వరద సహాయక చర్యలు పకడ్బందీగా అందించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరద సహాయక చర్యలను అధికారులు పకడ్బందీగా అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం భారీ వర్షాలు, వరద సహాయంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా బేసిన్ పరిధిలో భారీ వరదల కారణంగా దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, కుంటల వివరాలను సేకించాలని, వీటి మరమ్మతు, పునరుద్ధరణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వరదల సహాయం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్న నేపథ్యంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు రాష్ట్రం వద్ద అందుబాటు లో ఉన్నాయని చెబుతున్నారని, గత వరదల సమయంలో వినియోగించిన నిధులను పూర్తిస్థాయిలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద జమ చేసి కేంద్రం నుంచి మరింత సహాయం రాష్ట్రానికి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, సెప్టెంబరు నెలాఖరు వరకు నిధులు యూసీలను సమర్పించాలన్నారు. గతంలో వరదల సమయంలో పాడైన రోడ్ల మరమ్మతు పనులకు ఖర్చు చేసిన నిధులు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కింద నమోదు చేస్తూ వివరాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 2 నుంచి 6 వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచనల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ వరద సహాయక చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. వరంగల్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సత్యశారద, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



4న ఫార్మసీ కళాశాల గోల్డెన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

కేయూక్యాంపస్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల గోల్డెన్ సిల్వర్ జూబ్లీ వేడుకలను సెప్టెంబరు 4న కేయూ సెనెట్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్యలు ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. సెప్టెంబరు 4న సెనెట్ హాల్‌లోజరిగే కార్యక్రమంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, కృష్ణవేణి, నరసింహారెడ్డిలు పాల్గొంటారని తెలిపారు.



ఆహ్వానపత్రాన్ని చూపుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంలు



నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలో గణపతి వద్ద పూజకు హాజరైన కమిషనర్

కాంట్రాక్టర్ల అన్నదానం అభినందనీయం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రుల సందర్భంగా అన్నదానం చేయడం అభినందనీయమని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయంలో హనుమకొండ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా అక్కడి అర్చకులు కమిషనర్‌తో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు కర్రు రమేష్, నాయకులు అదిల్, ఖాజాపాష, గొలుసుల సంపత్, దేవేందర్, తోట రాజేశ్‌తో పాటు ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, మాధవిలత, డీఈలు కార్తీక్‌రెడ్డి, సారంగం ఏఈలు పాల్గొన్నారు.

కేయూ న్యాయశాస్త్ర సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూక్యాంపస్ సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సోమవా రం కేయూ న్యాయశాస్త్ర సెమిస్టర్‌పరీక్షలు ప్రారంభమయ్యాయి. సుబేదారి లోని యూనివర్సిటీ పీజీ కళాశాల, వరంగల్ సీకేఎం కళాశాల సెంటర్లలో జరిగిన 3, 5 ఏళ్ళ సెమిస్టర్ పరీక్షల తీరును కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, పీజీకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, కేయూ స్టూడెంట్ వెల్ఫేర్ సెంటర్ డైరెక్టర్ నిరంజన్ పరిశీలించారు.

వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంపత్

వడ్డెపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన గండికోట సంపత్ నియమితులయ్యారు. తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి ఐలమల్లు సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డెరల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గండికోట సంపత్ పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ఐలమల్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లపు మల్లికార్జున్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న బాధితులు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి పలు సమస్యలపై 179 వినతులు వచ్చాయి. కలెక్టర్ స్నేహ శబరీష్ బాధితుల నుంచి వినతులు స్వీకరించి సంబంధిత అధికారిని పిలిచి సమస్యపై విచారణ చేసి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలకు ప్రభుత్వంపై, అధికారులపై నమ్మకం ఉంటుందన్నారు. ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ మేన శ్రీను, పరకాల ఆర్‌డీఓ డాక్టర్ నారాయణ, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు పనులు

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుసగా కురుస్తు న్న వర్షాల కారణంగా హ నుమకొండ 10వ డివిజన్ రాయపురలో దెబ్బతిన్న అం తర్గత రోడ్డును స్థానిక డివిజన్ కార్పొరేటర్, జీడ బ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు తన సొంత నిధులతో మరమ్మతు పను లు చేపట్టారు. ఈ సంద ర్భంగా వెంకటేశ్వర్లు మాట్లా డుతూ.. అలంకార్ జంక్షన్ సమీపంలోని రాయపుర వాసులు నిత్యం ప్రయాణం కొనసాగించే రోడ్డు దెబ్బతినడంతో జేసీబీ సహాయంతో మరమ్మతు పనులను చేపట్టానన్నారు. దీంతో 10వ డివిజన్ రాయపుర వాసులు వెంకటేశ్వర్లుకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి..

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ని ధులు దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు సోమవారం ప్రెస్‌క్లబ్ బాధ్యులు, ఐజేయూ నాయకులు ఫిర్యాదు చేశారు. పూర్వ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ శ్రీధర్‌రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు హయాంలో నిధు లు దుర్వినియోగం చేసి కేసులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిధులు రికవరీ చేసి ప్రెస్‌క్లబ్‌కు జమచేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారి లో టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యదర్గ సభ్యులు పెండెం వేణుమాధవ్, కంకణాల సతోష్, రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి ఉన్నారు.

మడికొండలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

మడికొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును మంత్రివర్గం ఆమోదించింది. ఈ నేపథ్యంలో సోమవారం మడికొండ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్, వర్ధన్నపేట నియోజకవర్గ టీపీసీ వైస్ చైర్మన్ నార్లగిరి కుమారస్వామి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవీందర్, పల్లపు అర్జున్, కొప్పుల నవీన్, వస్కుల శ్రీను, కంచనపెల్లి వెంకటయ్య, పెనుకుల వినయ్, ముంజ రమేష్, జిట్ట చంటి, అంకూస్, రాజ్‌కుమార్, మూల మురళి, బోగి మహేష్, లక్ష్మీనారాయణ, కుర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



మడికొండ చౌరస్తాలో సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

గణపయ్యకు భక్తజన నీరాజనం



వేయిస్తంభాల ఆలయంలో కొలువుదీరిన మట్టి గణపయ్య



అడ్వకేట్స్ కాలనీలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం

- రుద్రేశ్వరాలయంలో మహా అన్నదానం
- 6వ రోజుకు చేరిన నవరాత్రి వేడుకలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కళ్లకు జిగేల్‌మనిపించేలా ఏర్పాటు చేసిన విద్యుత్‌దీప శోభాయమాన కాంతుల మధ్య ఏర్పాటు చేసిన భారీ మండపాల్లో కొలువైన ఆదిదేవుడు గణపయ్య ఓరుగల్లు భక్తులతో నీరాజనాలు అందుకుంటున్నాడు. సోమవారం గణపతి నవరాత్రి ఉత్సవాలు 6వ రోజుకు చేరుకున్నాయి. ఒక్కొక్క చోట ఓ తీరుగా కార్యక్రమాలను నిర్వహిస్తూ భక్తులు గణపయ్యను కొలుస్తున్నారు.ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో సోమవారం ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో విశేష అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డెపల్లి, టీచర్స్ కాలనీ ఫేస్-2లోని అభయాంజనేస్వామి ఆలయంలో కొలువైన గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలకు మ్యూజికల్ చైర్స్‌తోపాటు పిల్లల కోసం పెయింటింగ్ లాంటి పోటీలు నిర్వహించారు. 55వ డివిజన్ రాంనగర్‌లోని భువనేశ్వరిమాత ఆలయంలో నాట్యాచార్యుడు బొంపెల్లి సుధీర్‌రావు శిష్యబృందం నిర్వహించిన సంప్రదాయ కూచిపూడి నృత్యాన్ని కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. వడ్డెపల్లిలోని జీఎంఆర్ అపార్ట్‌మెంట్‌లో భారీ గణపయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి వైభవంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్ పేరిట భిన్నత్వంలో ఏకత్వం సాధించేలా మహిళలు దేశంలోని వివిధ రాష్ట్రాలను పోలిన వైవిధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రాహ్మణవాడలోని విక్కీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ నవరాత్రి వేడుకల్లో భాగంగా దొప్ప లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు బూరుగుపల్లి చంద్రశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో సోమవారం విశేష అన్నదానం నిర్వహించారు.

● వడ్డెపల్లి : హనుమకొండ 56వ డివిజన్ సప్తగిరి కాలనీ వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కేయూ సీఐ రవికుమార్, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు తదితరులు ప్రారంభించారు. గోపాల్‌పూర్ దేవరాజ్ కాలనీలో శ్రీసాయి గజానన మండలి ఆధ్వర్యంలో మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీటీసీ దూలం నీరజ రాజు గౌడ్ ప్రారంభించారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని అగ్రతి గజానన మండలి ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఉత్సవ కమిటీ ప్రతినిధులు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 59వ డివిజన్ కనకదుర్గ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో నవరాత్రోత్సవాలను కనులపండువగా నిర్వహిస్తున్నారు. సోమవారం కమ్యూనిటీ హాల్‌లోని వినాయక మండపం వద్ద గణపతి హోమంతో పాటు అన్నదానం చేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

బాలసముద్రం: హనుమకొండ బాలసముద్రంలోని అడ్వకేట్స్ కాలనీలోని వినాయక గజానన మండలి ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద హనుమకొండ రోటరీ క్లబ్‌తో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఎంజీఎం రక్తనిధికి 65యూనిట్ల రక్తాన్ని సేకరించి ఇచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి, కార్యదర్శి గంగోజుల నరేష్, కోశాధికారి మిర్యాల రాజ్‌కుమార్, అన్నంరవీంద్రనాథ్, మంజుల, కన్నారెడ్డి, రాజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రామారావు, సందసాని నరేష్, రక్తదాతలు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలి

కాజీపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సమీపంలోని అయోధ్యపురంలో నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులు, అర్హులైన వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. అయోధ్యపురం గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు. కలెక్టరేట్ వద్ద మీడియాతో వారు మాట్లాడారు. ఈ విషయాన్ని గత జూలైలో వచ్చిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విన్నవించినట్లు తెలిపారు. అర్హులైన వారిని జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో కలెక్టర్ గుర్తిస్తారని వారు చెప్పినట్లు పేర్కొన్నారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో పాటు ఇతర ఎమ్మెల్యేలకూ వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. తమభూ ములు కోల్పోవడంతో జీవనోపాధి కోల్పోయామన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీ చొరవ తీసుకుని అర్హులైన వారికి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాదం యాదగిరి, స్థానిక మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వెంకటయ్యను సన్మానించిన మార్నేని

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో సమీక్ష నిర్వహణకు విచ్చేసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సన్మానించారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ ఖాళీలు, భర్తీ, పదోన్నతులు, రిజర్వేషన్ అమలు తదితర అంశాలపై సమీక్ష జరిగింది. కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్ వివరాలను తెలియచేశారు. అనంతరం వెంకటయ్యను ఘనంగా సన్మానించారు.

● హనుమకొండ కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటకు వచ్చిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఎన్ఐటీలో సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటయ్యకు కలెక్టర్ స్నేహ శబరీష్ పూలమొక్క అందజేశారు. అనంతరం కలెక్టర్, జిల్లా అధికారులు వెంకటయ్యతో సమావేశమయ్యారు.

మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెడికవర్ హాస్పిటల్‌లో అత్యవసర శస్త్ర చికిత్స ద్వారా ఓ రోగి చేయిని విజయవంతంగా కాపాడినట్లు డాక్టర్ రవికిరణ్ తెలిపారు. తిరుపతి అనే వ్యక్తి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఓ ప్రయివేట్ హాస్పిటల్‌లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. ఇంటికి చేరిన రోజే అతడి కుడి చేయిలో విపరీతమైన నొప్పి రాగా స్థానికంగా డాక్టర్‌ను సంప్రదించినట్లు తెలిపారు. డాక్టర్ పరీక్షించి రక్త ప్రసరణ ఆగిపోయిందన్నారు. వెంటనే రోగి మెడికవర్ హాస్పిటల్‌కు చేరుకున్నారు. కన్సల్టెంట్ కార్డియోథరాసిక్ వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ రవికిరణ్, కన్సల్టెంట్ న్యూరాలజిస్టు డాక్టర్ ప్రియాంక అత్యవసర పరీక్షల అనంతరం శస్త్రచికిత్స చేసి రక్తగడ్డలను తొలగించి రక్తప్రసరణను పునరుద్ధరించారు. సమయానికి చికిత్స అందించడంతో రోగి చేయి కాపాడగలిగామని తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ రవికిరణ్

ప్రభుత్వ తీరుతో రోడ్డున పడుతున్న విద్యార్థులు

- ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్
- కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో విద్యార్థులు రోడ్డున పడుతున్నారని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ ధ్వజమెత్తారు. విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని నిరసిస్తూ ఏబీఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా మందనరేష్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, విద్యాసంస్థలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా వారి భవిష్యత్‌తో ఆడుకుంటుందని తీవ్ర విమర్శలు చేశారు. డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు పైచదువులకు వెళ్లాలంటే సర్టిఫికెట్స్‌నుఆయా కళాశాలలు సర్టిఫికెట్స్ ఇవ్వడానికి ససేమిరా అంటుండంటంతో విద్యార్థులు తమచదువులను మధ్యలోనేఆపేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ధర్నా చేస్తున్న విద్యార్థి నాయకులను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి పంపించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు ఉదయ్, ప్రసాద్, శ్రీకాంత్, మధు, అశోక్, నందు, శ్రీనివాస్, ప్రశాంత్, జీవన్, శ్రావణి, నవ్య, అఖిల, కళ్యాణతోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఏబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులను బలవంతంగా తీసుకెళ్తున్న పోలీసులు

అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు



పొడేటి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డాక్టర్ కొట్టే భాస్కర్, శాస్త్రి, మల్లేశ్వర్, శ్రీనివాస్ తదితరులు

కేయూక్యాంపస్ సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా కేయూ బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పొడేటి శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కేయూ పరీక్షల విభాగంలో ఇప్పటి వరకు అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా పనిచేసిన డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య నుంచి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పొడేటి శ్రీనివాస్‌ను పూలే ఆశయ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్, సభ్యులు డాక్టర్ తాడూరి శాస్త్రి, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, కేయూ ఎస్టీఎల్‌సీఈ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్‌లు శాలువా, పుష్పగుచ్ఛం అందచేశారు. కేయూ మాదిగ ఉద్యోగుల సంఘం కేయూ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్.సుజాత, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, జిల్లా ఎంఈఎఫ్ నేతలు బొడ్డు దయాకర్, ఎంఎస్ఎఫ్ నేతలు మంద భాస్కర్, బొచ్చు తిరుపతి, కుమ్మరి శ్రీనాథ్, డాక్టర్ వడ్డెపల్లి మధు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సౌజన్య

కాకతీయ యూనివర్సిటీ మహిళ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కేయూ గణితశాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ బీఎస్ఎల్ సౌజన్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మహిళ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సౌజన్యకు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పుష్పగుచ్ఛం శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, స్కాలర్లు తదితరులు పాల్గొన్నారు.

కేయూతో ఇంటర్నేషనల్ న్యాచరోపతి లైబ్రరీతో ఎంఓయూ

కేయూక్యాంపస్ సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్డులోని అంతర్జాతీయ న్యాచరోపతి లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్‌తో కాకతీయ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. న్యాచురోపతి అండ్ రీసెర్చ్ సెంటర్ వ్యవస్థాపకుడు, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కేయూ సెనెట్ హాల్‌లో ఎంఓయూ పత్రాలను మర్చుకున్నారు. కేయూ లైబ్రరీ సైన్స్, ఆర్ట్స్‌లైఫ్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, యోగా, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధనలకు విస్తృత అవకాశాలు కలుగుతాయి. లైబ్రరీ వర్గీకరణ, కేటలాగింగ్ వంటి పనుల్లో కేయూ లైబ్రరీ సిబ్బంది భాగస్వామ్యం చేయనున్నారు ఇరు సంస్థల సమన్వయంతో సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించే అవకాశం కలుగుతోంది. ఇంటర్నేషనల్ న్యాచరోపతి లైబ్రరీని కేయూ స్కాలర్లు, విద్యార్థులు తమ పరిశోధనకు ఉపయోగించుకోనున్నారు. ఈ కార్యక్రమంలో కేయూ డీన్లు ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, జి.హన్మంతు, ప్రిన్సిపాల్ తాళ్ళపల్లి మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ఏఆర్ డాక్టర్ కొలా శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఓయూ పత్రాలతో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, రామేశ్వరం తదితరులు



రౌతు రమేష్‌ను సన్మానిస్తున్న బక్కి వెంకటయ్య

అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


హసన్‌పర్తి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, లైన్ ఇన్‌స్పెక్టర్ రౌతు రమేష్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా రమేష్-ప్రమీల దంపతులను సన్మానించి మాట్లాడారు. ప్రశ్నించేతత్వం లేకపోతే సమాజ మనుగడ లేదన్నారు. చదువే సమాజ మార్పుకు దోహదం చేస్తుందన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే అరెపల్లి మోహన్, డీబీఎఫ్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్ రౌతు రమేష్ సేవలు కొనియాడారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, రాముబాబునాయక్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, వివిధ సంఘాల నాయకులు రౌతు రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, కేయూ జేఏసీ చైర్మన్ మంద వీరస్వామి, జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఏ రాంచందర్‌రావు, అంబేద్కర్ రాష్ట్ర నాయకులు సింగారపు రవిప్రసాద్ , వివిధ రాజకీయ పార్టీల నాయకులు, జర్నలిస్టులు, విద్యుత్ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం,సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 25 మందిని సో మవారం కోర్టులో హాజరుపరచగా న్యాయ మూర్తి ఎ.వేణుగోపాల్ ఐదుగురికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ సీతారెడ్డి తెలిపారు. మిగతా 20 మందికి రూ.26,400 జరిమానా విధించామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 13 మందికి రూ.10,600 జరిమానా విధించారన్నారు.

మోసం చేయగలిగేవాడే గొప్ప నేత

రాజకీయాల్లో నిజాలు మాట్లాడటంపై నిషేధం ఉంది: గడ్కరీ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: తాను ఉన్న రాజకీయ రంగంలో హృదయాంతరాల్లోంచి నిజాలు మాట్లాడటంపై నిషేధం ఉందని, ఈ రంగంలో ప్రజలను మోసం చేయగలిగేవాడే నేతల్లోకెల్లా గొప్ప నేత అనిపించుకుంటాడని బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. నాగపూర్‌లో సోమవారం అఖిల భారతీయ మహానుభావ పరిషత్ నిర్వహించిన కార్యక్రమంలో గడ్కరీ మాట్లాడారు. బతకడానికి దగ్గరిదారులు (షార్ట్‌కట్స్) వెతకొద్దని.. నిబద్ధత, నిజాయితీ, విశ్వసనీయతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. దగ్గరిదారులు సత్వర ఫలితాలు ఇవ్వొచ్చునేమో గానీ, దీర్ఘకాలంలో విశ్వసనీయతను దెబ్బతీస్తాయని హెచ్చరించారు. విజయం ఎప్పుడూ సత్యం వెంటే ఉంటుందని, భగవద్గీతలో శ్రీకృష్ణుడు కూడా ఎప్పుడైనా చివరికి సత్యమే గెలుస్తుందని చెప్పాడని పేర్కొన్నారు.

ఉపరాష్ట్రపతి నివాసం ఖాళీ చేసిన ధన్‌ఖడ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేసి, దక్షిణ ఢిల్లీలోని ఛతర్‌పూర్ ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఫామ్‌హౌస్‌కు మారారు. తన పదవికి రాజీనామా చేసిన ఆరు వారాల తరువాత ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఛతర్‌పూర్‌లోని గడైపూర్ ప్రాంతంలో ఉన్న ఈ ఫామ్‌హౌస్ ఐఎన్‌ఎల్‌డీ నాయకుడు అభయ్ చౌతాలాకు చెందినది. మాజీ ఉపరాష్ట్రపతిగా ఆయనకు కేటాయించాల్సిన టైప్-8 అధికారిక నివాసం లభించే వరకు ఇది తాత్కాలిక ఏర్పాటు అని అధికారులు తెలిపారు. ఆరోగ్య సమస్యలున్నాయని జూలై 21న తన పదవికి రాజీనామా చేసిన ధన్‌ఖడ్, అప్పటి నుంచి పార్లమెంటుహౌస్ దగ్గర్లో వైస్ ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌లో ఉంటున్నారు.


జనగణనకు 14 వేల కోట్లు ఇవ్వండి: ఆర్జీఐ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: దేశంలో చేపట్టనున్న జనగణన కోసం రూ.14,618.95 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్జీఐ) ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర హోం శాఖకు ప్రతిపాదనలతో కూడిన నివేదికను అందజేసింది. రెండు దశల్లో చేపట్టే జనాభా లెక్కింపునకు 35 లక్షల మందికి పైగా క్షేత్రస్థాయి సిబ్బంది అవసరం ఉందని పేర్కొంది. వీరికి శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రక్రియ మొత్తం డిజిటల్‌గానే సాగనుందని వివరించింది. ప్రతిపాదిత మొత్తాన్ని రెండు దశల లెక్కింపునకు వినియోగించనున్నట్టు తెలిపింది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు తొలిదశ, 2027, ఫిబ్రవరి నుంచి రెండో దశ లెక్కింపు చేపట్టనున్నట్టు వివరించింది.

మెడిసిన్ ట్యూబ్‌లతో తీవ్రమైన ఇన్ఫెక్షన్లు

ముంబై, సెప్టెంబరు 1: ఆస్పత్రుల్లో చికిత్స సమయంలో మందులు సరఫరా చేయడానికి, ద్రవపదార్థాలను శరీరంలోకి పంపడానికి ఉపయోగించే ట్యూబ్‌ల నిర్వహణ సరైన పద్ధతిలో చేపట్టకపోవడం వల్ల రోగులు అనేక రకాల బ్లడ్ ఇన్ఫెక్షన్లకు గురవుతున్నారని తాజా అధ్యయనంలో గుర్తించారు. దేశవ్యాప్తంగా 54 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, 200కి పైగా ఐసీయూల్లో ఏడేళ్లపాటు నిర్వహించిన ఈ అధ్యయనంలో మెడిసిన్ ట్యూబ్‌ల నిర్వహణలోపం కారణంగా 8,600కి పైగా కేసుల్లో తీవ్రమైన ఇన్ఫెక్షన్లను గుర్తించారు. సెంట్రల్ లైన్ ఇన్ఫెక్షన్లుగా పేర్కొంటున్న వీటి వల్ల ముఖ్యంగా నవజాత శిశువులు అధికంగా ప్రభావితమైనట్టు కనుగొన్నారు. ఇన్ఫెక్షన్ల బారినపడిన రోగుల్లో దాదాపు 40 శాతం మంది రెండు వారాల్లోనే చనిపోయారని ఈ అధ్యయనం పేర్కొంది. ప్రతి వెయ్యి సెంట్రల్ లైన్ రోజులకు దాదాపు 9 సెంట్రల్ లైన్ ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయని తెలిపింది. ఈ అధ్యయనం వివరాలు ఇటీవల లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అఫ్గాన్‌లో భూకంపం





భూకంప ప్రభావంతో కునార్ ప్రావిన్స్‌లో కూలిన ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

విరిగిపడే ప్రమాదం ఉండడంతో సహాయ బృందాలు వెళ్లడం కష్టంగా మారింది. తూర్పు రాష్ట్రాలైన కునార్, నంగర్‌హార్‌లలో ఆదివారం అర్ధరాత్రి భూమి కంపించింది. భూమిలోపల పది కిలోమీటర్ల (5 మైళ్లు) లోతులో భూకంప కేంద్రం నమోదయింది. రెక్టార్ స్కేల్‌పై దీని తీవ్రత 6.0 పాయింట్లుగా రికార్డయింది. అనంతరం రాత్రంతా అయిదుసార్లు భూమి కంపించింది. కునార్ ప్రావిన్స్‌లో మొత్తం మూడు గ్రామాలు పూర్తిగా తుడిచిపెట్టుకొని పోయాయి. ఈ ప్రాంతంలో మట్టితో నిర్మించిన ఇళ్లే అధికం కావడంతో మృతుల సంఖ్య మరింతగా పెరిగే సూచనలు ఉన్నాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. అయిదు రాష్ట్రాల్లోని సుమారు 10.20 లక్షల మందిపై భూకంప ప్రభావం ఉంటుందని అమెరికా భూగర్భ సర్వే విభాగం అంచనా వేసింది. రోడ్లు పూర్తిగా పాడవడంతో సహాయ బృందాలు వెళ్లలేకపోతున్నాయి. దాంతో సైన్యమే విమానాల ద్వారా క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తోంది. 40 విమానాలు సేవలు అందిస్తున్నాయని, ఇంతవరకు 420 మంది క్షతగాత్రులను తరలించినట్టు సైన్యం ప్రకటించింది. నష్టం అధికంగా ఉండడంతో ఆదుకోవాలని తాలిబన్ ప్రభుత్వం అన్ని దేశాలను కోరింది. 2021లో ఆఫ్గాన్‌లో తాలిబాన్ ప్రభుత్వం ఏర్పాటయిన నుంచి చాలా దేశాలు సహాయాన్ని నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో తాలిబన్ ప్రభుత్వం చేసిన ఈ వినతి ప్రాధాన్యం సంతరించుకొంది. అంతర్జాతీయంగా తమను ఆదుకోవాలని ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి షరాఫత్ జమాన్ కోరారు. భారీ వర్షాలు కురుస్తుండడం, రోడ్లు పూర్తిగా పాడవడంతో సహాయ బృందాలు వెళ్లలేకపోతునున్నాయని ఐక్యరాజ్యసమితి మానవతా వ్యవహారాల సమన్వయ విభాగం అధికారి కేట్ కారే చెప్పారు. నీటి వనరులు కలుషితం కాకుండా జంతువుల కళేబరాలను వెంటవెంటనే తొలగిస్తున్నట్టు తెలిపారు.

అండగా ఉంటాం: మోదీ

అఫ్గాన్‌లో భూకంపం కారణంగా భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభించడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. అండగా ఉంటామని, మానవతా సాయం అందిస్తామని ప్రకటించారు. మరోవైపు తక్షణ సాయం కింద భారత్ 15 టన్నుల ఆహార పదార్థాలను కాబూల్ నుంచి కునార్‌కు పంపించిందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయ్ శంకర్ ఎక్స్ ద్వారా తెలిపారు. 1,000 ఫ్యామిలీ టెంట్లను పంపించినట్టు పేర్కొన్నారు. మంగళవారం నుంచి పలు రకాల సహాయ సామగ్రిని పంపిస్తామని పేర్కొన్నారు. ఆయన అఫ్గాన్ విదేశాంగ శాఖ మంత్రి మావ్లావీ అమీర్ ఖాన్ ముత్తాకీతో మాట్లాడారు. అఫ్గాన్‌లోని తమ బృందాలు సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అంటోనియా గుటెర్రస్ ప్రకటించారు. మృతులకు సంతాపం తెలుపుతూ పోప్ లియో సందేశం పంపారు. సాధ్యమైనంత మేర సాయం అందిస్తామని చైనా కూడా ప్రకటించింది. తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తరువాత మూడు పెద్ద భూకంపాలు సంభవించడం గమనార్హం.

అమెరికాలో ఉద్యోగం పోతే ఇంటికి పోతాం..

45% హెచ్-1బీ భారతీయుల మనోగతం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: అమెరికా విధిస్తున్న నిబంధనలు హెచ్-1బీ వీసాలపై అక్కడ పనిచేస్తున్న భారతీయ వృత్తి నిపుణుల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఒకవేళ ఉద్యోగం కోల్పోతే నిర్దేశిత సమయంలో అమెరికాను వారు వీడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ఉద్యోగం కోల్పోతే ఎక్కడికి వెళ్తారు అనే దానిపై అజ్ఞాత కమ్యూనిటీ యాప్ బ్లైండ్ సర్వేలో ప్రశ్నించగా.. భారత్‌కు తిరిగి వెళ్తామని 45% మంది భారతీయ వృత్తినిపుణులు తేల్చి చెప్పేశారు. మరో దేశానికి వెళ్తామని 26 శాతం మంది పేర్కొన్నారు. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని 29 శాతం మంది చెప్పారు. ఇక అమెరికాను విడిచివెళ్లడానికి చెబుతున్న ప్రధాన ఆందోళనల విషయానికి వస్తే.. జీతాల్లో కోతలు (25%), నాణ్యత లేని జీవితం (24%), సాంస్కృతిక లేదా కుటుంబ సర్దుబాట్లు (13%), తక్కువ ఉద్యోగ అవకాశాలు (10%) వంటివి ఉన్నాయి. మళ్లీ అమెరికా వర్క్ వీసాను ఎంచుకుంటారా అంటే.. కేవలం 35% మంది మాత్రమే ఎంచుకుంటామన్నారు.

నకిలీ పాస్‌పోర్టు, వీసాలపై కొరడా!

- మోసానికి పాల్పడితే కఠిన దండన
- ఏడేళ్ల జైలు, 10 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: నకిలీ పాస్‌పోర్టు, వీసాలతో దేశంలోకి వచ్చినా, ఇక్కడే తిష్టవేసినా.. ఇతర దేశాలకు వెళ్లే ప్రయత్నం చేయాలని అనుకున్నా ఇకపై కఠిన దండన తప్పదు. నకిలీ పాస్‌పోర్టులు, వీసాలపై కేంద్రం కొరడా ఝుళిపించనుంది. నకిలీరాయుళ్లను గుర్తించి కఠినంగా శిక్షించనుంది. దీనికి సంబంధించి ఈ ఏడాది పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించిన 'వలసదారులు, విదేశీయుల చట్టం-2025'ను సెప్టెంబరు 1 నుంచి(సోమవారం) అమల్లోకి తీసుకువచ్చినట్టు కేంద్ర హోంశాఖ అదనపు కార్యదర్శి నితీశ్‌కుమార్ వ్యాస్ పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం.. నకిలీలకు పాల్పడే వారికి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు, రూ.10 లక్షల వరకు జరిమానా విధించనున్నారు. ఈ చట్టాన్ని అత్యంత కఠినంగా అమలు చేయనున్నట్టు వ్యాస్ తెలిపారు. పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ బిల్లుకు ఈ ఏడాది ఏప్రిల్ 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. దీంతో ఇది చట్టంగా మారింది. ఈ చట్టంలోని సెక్షన్-1లో పేర్కొన్న సబ్ సెక్షన్-2 ప్రకారం దీనిని సెప్టెంబరు 1 నుంచి కేంద్రం అమల్లోకి తీసుకువచ్చింది.

దాచేందుకు కుదరదు!

- ఈ చట్టం ప్రకారం.. దేశంలోని వ్యాపార, వాణిజ్య సహా అన్ని సంస్థలు విదేశీయుల వివరాలను వెల్లడించాలి.
- హోటళ్లు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు.. ఇలా అన్ని సంస్థలు కూడా.. తమ వద్దకు వచ్చే విదేశీయుల వివరాలను దాచడానికి వీల్లేదు.
- ఇక, వీసాల గడువు తీరిపోయిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్నవారిని గుర్తించేందుకు ఈ చట్టం ఉపకరిస్తుంది.
- విమానాలు, నౌకలలో ప్రయాణించే విదేశీయుల వివరాలను కూడా ఆయా సంస్థల కంపెనీలు వెల్లడించాలి. విదేశీయులు తరచుగా పర్యటించే పర్యాటక ప్రాంతాలపై పూర్తి నియంత్రణ కేంద్రానికే ఉంటుంది.
- వలసలు, వీసా, పాస్‌పోర్టు, విదేశీయులు.. తదితర అంశాలకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్న నాలుగు వేర్వేరు చట్టాలను రద్దు చేశారు.

ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌పై 'పిల్' తిరస్కరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వినియోగాన్ని సవాలు చేస్తూ దాఖలయిన ప్రజా ప్రయోజన వ్యాజ్యా (పిల్)న్ని సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా బంకుల్లో 20 శాతం ఇథనాల్‌ను కలిపిన పెట్రోల్ (ఈబీపీ-20)ని విక్రయిస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొంటూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా ఈ పిల్‌ను దాఖలు చేశారు. 2023కు ముందు తయారు చేసిన బైకులు, కార్లు ఈబీపీ-20 వినియోగానికి అనువుగా లేవని తెలిపారు. ఈబీపీ-20 కారణంగా వాహనాల మైలేజీ తగ్గుతోందని, ఇంజిన్లు పాడవుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల బంకుల్లో ఇథనాల్ రహిత సాధారణ పెట్రోలు విక్రయించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఆ వాదనను ఖండించారు. ఈబీపీ-20 కారణంగా చెరకు రైతులకు మేలు కలుగుతుందని చెప్పారు. పిటిషన్ దాఖలు చేసిన మల్హోత్రా పేరుకు మాత్రమే కక్షిదారు అని, ఆయన వెనుక లాబీ ఉందని తెలిపారు. ప్రభుత్వం అన్ని విషయాలను పరిశీలిస్తోందని చెప్పారు. దీనితో ఏకీభవించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్‌చంద్రన్‌ల ధర్మాసనం పిల్‌ను తిరస్కరించింది.

వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధర రూ.51.50 తగ్గింపు

- వరుసగా ఆరోసారి దిగివచ్చిన ధర
- ఏటీఎఫ్ ధర 1.4 శాతం తగ్గింపు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1: వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌తోపాటు విమాన ఇంధనం ధర (ఏటీఎఫ్)ను ప్రభుత్వరంగ చమురు కంపెనీలు సోమవారం తగ్గించాయి. హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాటిలో వినియోగించే వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ (19 కిలోలు) ధరను కంపెనీలు రూ.51.50 మేర తగ్గించడంతో ఢిల్లీలో ఈ సిలిండర్ ధర రూ.1,580కు చేరుకుంది. తాజా తగ్గింపుతో వాణిజ్య ఎల్పీజీ రేట్లు వరుసగా ఆరోసారి తగ్గినట్టయింది. ఇంతకుముందు ఆగస్టు 1న ఈ సిలిండర్ ధర రూ.33.50 మేర తగ్గింది. ఏప్రిల్ నుంచి చూస్తే ఈ సిలిండర్ ధర మొత్తంగా రూ.223 మేర దిగివచ్చింది. ఇక గృహావసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్ ధర మాత్రం యథాతథంగా ఉంది. కాగా ఏటీఎఫ్ ధరను చమురు కంపెనీలు 1.4 శాతం మేర తగ్గించాయి. దీంతో ఢిల్లీలో కిలో లీటరు ఏటీఎఫ్ ధర రూ.1,308.41 తగ్గి రూ.90,713.52కు చేరుకుంది. ఇంతకు ముందు వరుసగా రెండుసార్లు ఏటీఎఫ్ ధరలను కంపెనీలు పెంచాయి. భౌగోళిక రాజకీయ ఆందోళనలు, వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడంతో అందుకనుగుణంగా దేశీయంగా ధరలు పెరిగాయి.

చిత్రజ్యోతి


SINCE 1965

అందర్నీ ఆకట్టుకుంటుంది



మౌళి తనుజ్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ దర్శకుడు. ఆదిత్య హాసన్ నిర్మించారు. కంటెంట్ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మాతలు బన్నీవాసు, వంశీ నందిపాటి ఈనెల 12న థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా బన్నీవాసు మాట్లాడుతూ 'యూత్‌కి నచ్చే కంటెంట్, కుటుంబ ప్రేక్షకులను మెప్పించే మంచి వినోదం ఉన్న చిత్రమిది. ఎక్కడా అశ్లీలత ఉండదు. ప్రేమ, చదువు నేపథ్యంలో ఆసక్తికరంగా సాగుతుంది' అని అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ 'ఈ సినిమాను చూసిన వెంటనే ఇది థియేటర్‌లో బ్లాస్ట్ అవుతుందని అనిపించింది. యంగ్‌టీమ్ పనిచేసిన చిత్రమిది. వారి ఎనర్జీ, తపన చిత్రంలో కనిపిస్తుంది. మన చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఈటీవీ విన్ నిర్మించే చిత్రాలుంటాయి' అని చెప్పారు.

స్టైలిష్ లుక్!



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. మంగళవారం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఓ స్టైలిష్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. స్టైల్లో, స్వాగ్‌లో, బాక్సాఫీస్‌కు ఉస్తాద్ లాంటి పవన్‌కల్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక గొప్ప ఫీస్ట్‌లా ఉంటుంది' అని మైత్రీ మూవీమేకర్స్ పేర్కొంది. 'నా హీరో, అన్న, స్ఫూర్తి.. ఒక్కగానొక్క పవన్‌కల్యాణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. నేను ఆయనను తెరపై ఎలా చూడాలనుకుంటున్నానో ఈ పోస్టర్ ద్వారా పరిచయం చేస్తున్నా' అని హరీశ్ శంకర్ పేర్కొన్నారు. ఈ సినిమాలో పవన్ శక్తిమంతమైన పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు.

వరుస ప్రాజెక్టులు చేస్తా

అనుష్క

'మా ఇళ్లలో జరిగే పెళ్లిళ్లకు కూడా వెళ్లడం లేదు. అందరూ ఎప్పుడు కనిపిస్తావ్ అని అడుగుతున్నారు. ప్రస్తుతం మంచి కథలను వింటున్నాను. వచ్చే ఏడాది నుంచి వరుస సినిమాలతో ప్రేక్షకులను పలకరిస్తాను. అందరి ముందుకూ వస్తాను' అని అన్నారు అనుష్క శెట్టి. క్రిష్ దర్శకత్వంలో ఆమె ప్రధాన పాత్రలో నటించిన 'ఘాటి' ఈ నెల 5న విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె రానాతో ఫోన్‌లో మాట్లాడుతూ 'ఇదొక వయెలెంట్ మూవీ. ఈ కథ ఇప్పటి సమాజంలోని పరిస్థితులకు సరిగ్గా సరిపోతుంది. 'బాహుబలి', 'అరుంధతి' తర్వాత నా ఉత్తమ చిత్రాల వరుసలో 'ఘాటి' నిలుస్తుంది. చిత్ర నేపథ్యం, విజువల్స్ అందరికీ కొత్త అనుభూతిని ఇస్తాయి. క్రిష్ కథను నడిపించిన విధానం అద్భుతంగా ఉంటుంది' అని చెప్పారు. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ 'ఇటీవలె క్రిష్‌ను కలిశాను. 'ఘాటి' గురించి ఆయన చెప్పిన విషయాలు చాలా ఆసక్తికరంగా అనిపించాయి. ప్రీమియర్‌కి తప్పకుండా వస్తా' అని తెలిపారు.



థియేటర్లలోనే చూడాల్సిన సినిమా



తేజ సజ్జా సూపర్ యోధ పాత్రలో నటించిన 'మిరాయ్' చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో మంచు మనోజ్ పవర్‌ఫుల్ పాత్ర పోషించారు. ఈ సందర్భంగా చెన్నైలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తేజ మాట్లాడుతూ 'యాక్షన్, ఫాంటసీ, డివోషన్, ఎమోషనల్ అంశాలు ఉన్న సినిమా ఇది. కచ్చితంగా థియేటర్‌లోనే చూడాల్సిన సినిమా 'మిరాయ్'. పీపుల్ మీడియా సంస్థలో నాకు ఇది రెండో సినిమా. మరిన్ని చిత్రాలు చేయాలని ఉంది.. 'మిరాయ్' అంటే హోప్ ఆఫ్ ఫ్యూచర్ అని అర్థం. దీనికి మరో మీనింగ్ కూడా ఉంది. అదేమిటో సినిమాలో చూసి మీరు కచ్చితంగా సర్‌ప్రైజ్ అవుతారు. దర్శకుడు కార్తీక్ విజన్ వల్లే ఈ సినిమా సాధ్యమైంది. ఆయన కథ చెప్పే విధానం ప్రేక్షకుల్ని అలరిస్తుంది' అన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు తేజ సమాధానాలు ఇస్తూ 'హనుమాన్ అంజనాద్రి అనే ఓ ఫాంటసీ ప్లేస్‌లో జరిగిన కథ. ఈ సినిమా కోసం థాయ్‌లాండ్ వెళ్లి 20 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. సినిమాలో మీరు చూసే స్టంట్స్ అన్నీ నేను స్వయంగా చేసినవే' అని చెప్పారు.

ఫారం –VI
(సెక్షన్- ఉప నియమం (1) యొక్క నియమం- 19)
మరియు సెక్షన్- 11 (1) యొక్క చట్టం- 30/2013)
తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ

ప్రాథమిక ప్రకటన

గెజిట్ నెం. 107/2025 తేది: 26.08.2025
No:ఇ/1151/2025 తేది: 26.08.2025
No:ఎఫ్/7326/2025 తేది: 25.08.2025

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా నారాయణపేట కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా కానుకుర్తి చెరువు పునరుద్ధరణ కొరకు నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, కానుకుర్తి గ్రామం పరిధిలో మొత్తం **ఎ.395.01 గుంటలు** భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.

తెలంగాణ ప్రభుత్వం నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయే భూ నిర్వాసితులకు 2013 భూ సేకరణ, పునరావాసం మరియు పునస్థాపన లో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టంలోని అధ్యాయం 2 మరియు 3 యొక్క వర్తింపు నుండి మినహాయించడానికి తేది12.02.2025 నాడు G.O.Ms .No.3 Irrigation & CAD(LA) Department జారీచేసింది. అందువలన ఆ చట్టం లోని 4 (1) సెక్షన్ ప్రకారం సామాజిక ప్రభావ అంచనా నిర్వహించబడలేదు. బాధిత కుటుంబాల పునరావాసం మరియు పునస్థాపన కోసం నారాయణపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నిర్వాహకుడిగా నియమితులయ్యారు.

అందువలన పైన తెల్పిన సదరు ప్రాజెక్టు కొరకు నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, కానుకుర్తి గ్రామం యొక్క మొత్తం ఎ.395.01 గుంటలు విస్తీర్ణం గల భూమి ఈ దిగువ తెలిపిన విధంగా వివరణాత్మక వివరణ ప్రకారం స్వాధీనత కొరకు ప్రతిపాదించడమైనదని తెలుపడమైనది.

క్రమ సం.	సర్వే నం.	భూ స్వభావం	భూమి రకం	భూమి సేకరణ విస్తీర్ణం	ఆసక్తి గల వ్యక్తి పేరు	సరిహద్దులు				చెట్లు		కట్టడాలు	
						ఉ	ద	తూ	ప	రకం	సంఖ్య	రకం	వైశాల్యం
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	192/అ2/1	పట్టా	మెట్ట	0.01	రామచందర్ తండ్రి బాలప్ప	191	193	269	196	-	-	-	-
2	192/అ	పట్టా	మెట్ట	4.26	రామచందర్ తండ్రి బాలప్ప	191	193	269	196	వేప టేకు చింత ఈత	2 25 1 2	-	-
3	192/ఆ1	పట్టా	మెట్ట	4.27	రాములు తండ్రి బాలప్ప	191	193	269	196	టేకు	20	బోర్	-
4	192/అ3	పట్టా	మెట్ట	4.27	రాములు తండ్రి బాలప్ప	191	193	269	196	-	-	-	-
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

రెవెన్యూ-రిజిస్ట్రేషన్-సర్వే

విభాగాలు అనుసంధానం..

▸▸ త్వరలో ఒకే సాఫ్ట్‌వేర్ ద్వారా సేవలు: పొంగులేటి



హైదరాబాద్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను అనుసంధానం చేస్తూ త్వరలో ఒకే సాఫ్ట్‌వేర్‌ను తీసుకొస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాల అధికారులతో మంత్రి సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్ జత చేయాలని ఇప్పటికే భూభారతి చట్టంలో ఉందన్నారు. భూభారతి పోర్టల్‌లో సర్వే మ్యాప్ లింక్ చేసేలా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. భూభారతి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పోర్టల్ వినియోగం సులభతరంగా ఉండేలా చూడాలని ఎన్ఐసీ అధికారులకు సూచించారు. కొత్తగా అభివృద్ధి చేసే సాఫ్ట్‌వేర్‌లో కోర్టు కేసులపై మానిటరింగ్ సిస్టమ్ ఉండేలా మార్పులు చేయాలన్నారు. నక్షా లేని 5 గ్రామాల్లో రీ సర్వే కొలిక్కి వచ్చిన నేపథ్యంలో మిగిలిన 408 గ్రామాల్లో కొద్ది రోజుల్లోనే రీ సర్వే ప్రారంభిస్తామన్నారు. భూభారతి హక్కుల రికార్డులో నమోదై ఉన్న వారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు పెట్టుకుంటే కొత్త పాస్ పుస్తకం జారీ చేస్తారు. భూముల అమ్మకాలు, కొనుగోలు సమయంలో హద్దులతో కూడిన సర్వే మ్యాప్‌ను ఖచ్చితంగా జతపరచాలని భూభారతి చట్టంలో ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో తొలి విడతగా ఈ 5 గ్రామాల్లో సర్వే మ్యాప్, భూధార్ కార్డుల జారీని అమలు చేయాలని రెవెన్యూశాఖ భావిస్తోంది. ప్రస్తుతం శిక్షణలో ఉన్న లైసెన్స్ సర్వేయర్లు అందుబాటులోకి వచ్చాక ఈ ప్రక్రియ ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు.

మహిళలకే చేప పిల్లల పెంపకం బాధ్యత: భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో చేప పిల్లలు, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజాభవన్‌లో మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 46 వేల చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి రూ.122 కోట్లను విడుదల చేశామన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సోలార్ పవర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. హైటెక్ సిటీ పక్కన శిల్పారామం వద్ద విలువైన స్థలాన్ని మహిళా సంఘాలకు ఇచ్చి ఆర్థికంగా ప్రోత్సహిస్తామని చెప్పారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లను ఏర్పాటు ఆలోచనలో ఉన్నామని భట్టి చెప్పారు.

'అలయ్-బలయ్'కి రండి

▸▸ రాష్ట్రపతి ముర్ముకు దత్తాత్రేయ ఆహ్వానం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండగా సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనవలసిందిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ ఆహ్వానించారు. సోమవారం, రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదిముర్ముతో దత్తాత్రేయ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అన్ని పార్టీలను ఒకే వేదికపై తీసుకువచ్చి నిర్వహించే ఓ సాంస్కృతిక కార్యక్రమమే 'అలయ్ బలయ్' అంటూ రాష్ట్రపతికి వివరించారు. ప్రతీ ఏటా ప్రేమ, ఆప్యాయత, సోదరభావం చాటేలా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం అభినందనీయమని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ఉచిత సన్న బియ్యం పంపిణీ పునఃప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉచిత సన్న బియ్యం పంపిణీ మళ్లీ మొదలైంది. గత మూడు నెలల కోటాను జూన్ నెలలో పంపిణీ చేసిన తరువాత జూలై, ఆగస్టు నెలల్లో రేషన్ షాపులు మూసివేశారు. ఇప్పుడు సెప్టెంబరు నెల కోటా పంపిణీని సోమవారం ప్రారంభించారు. రాష్ట్రంలో ఉన్న 99,70,832 రేషన్ కార్డుల ద్వారా 3.2 కోట్ల మంది లబ్ధిదారులకు 2,02,713 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఈ బియ్యాన్ని ఇప్పటికే 17 వేలకు పైగా ఉన్న రేషన్ షాపులకు పంపించారు. ఈనెల 15 వరకు బియ్యం పంపిణీ కొనసాగుతుంది. ప్రతి లబ్ధిదారుడికి 6 కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం అందజేస్తారు. జూలై, ఆగస్టు నెలల్లో కొత్తగా కార్డులు పొందిన వారికి సెప్టెంబరు నుంచి కోటా కేటాయింపులు చేశారు.

ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్!

▸▸ గవర్నర్ కోటా అభ్యర్థులుగా అధిష్ఠానం ఖరారు

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గవర్నర్ కోటా కింద శాసనమండలి(ఎమ్మెల్సీ) సభ్యుల నియామకానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారు. ఈమేరకు ప్రొఫెసర్ ఎం. కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌ల పేర్లను ఖరారు చేస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ సోమవారం ఒక లేఖ విడుదల చేశారు. ఈ లేఖను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు పంపారు. గవర్నర్ కోటాలో నామినేషన్ కోసం వచ్చిన ప్రతిపాదనలను కాంగ్రెస్ అధ్యక్షుడు ఆమోదించారని, ఈ విషయం మీ సమాచారం, తదుపరి చర్యల కోసం అని వేణుగోపాల్ ఆ లేఖలో పేర్కొన్నారు.

నిమ్స్ ప్రొఫెసర్ బీ.పీ సాహు కన్నుమూత



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ బీ. ప్రసాద్ సాహు (67) అనారోగ్యంతో కన్నుమూశారు. కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. నిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్‌గా చేరిన డాక్టర్ సాహు అడిషనల్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పలు పదోన్నతులు పొందారు. న్యూరో సర్జరీ విభాగానికి అధిపతిగా కూడా ఆయన సేవలు అందించారు. క్యాన్సర్ వ్యాధికి నిమ్స్‌లోనే చికిత్స పొందినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

రేపు 2 జిల్లాల పర్యటనకు సీఎం

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం రెండు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం మహబూబ్ నగర్ జిల్లాలోని దేవరకద్రలో ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం భద్రాద్రి జిల్లాలోని ఓ నియోజకవర్గానికి వెళ్తారు. అక్కడ ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిసింది. కాగా 4వ తేదీన కామారెడ్డి జిల్లా పర్యటనకు వెళ్లనున్నట్టు సమాచారం.

డీజీపీగా శివధర్ రెడ్డి?

(మొదటిపేజీ తరువాయి)

తెలిసింది. సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ఐజీ (పీ అండ్ ఎల్) ఎం.రమేష్‌తో పాటు మరికొందరు ముఖ్య అధికారులు, మూడు కమిషనరేట్ల పరిధిలో డీసీపీలు, పలువురు జిల్లా ఎస్పీలు, కమిషనర్లు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. పోలీస్ శాఖలో ఏ ఇద్దరు అధికారులు కలిసినా త్వరలో జరగబోయే బదిలీలు, పోస్టింగ్‌లపైనే చర్చించుకుంటూ ఊహాగానాలు చేస్తున్నారు. కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును పదవీ విరమణ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అనుమతితో గడువు పెంచి కొనసాగిస్తున్నట్లే డీజీపీ జితేందర్‌ను కూడా కొనసాగించే అవకాశం ఉందని మరికొందరు చర్చించుకుంటున్నారు.

(మిగతా 11వ పేజీలో)

371	286ఉ/3	పట్టా	మెట్ట	0.05	[illegible]	279	287	284	277	-	-	-	-
372	286ఇ	పట్టా	మెట్ట	0.15	[illegible]	279	287	284	277	-	-	-	-
373	286ఉ/2	పట్టా	మెట్ట	0.05	[illegible]	279	287	284	277	-	-	-	-
374	286ఉ/2	పట్టా	మెట్ట	0.03	[illegible]	279	287	284	277	-	-	-	-
375	286ఉ/3	పట్టా	మెట్ట	0.02	[illegible]	279	287	284	277	-	-	-	-
376	286ఉ/4	పట్టా	మెట్ట	0.02	[illegible]	279	287	284	277	-	-	-	-
377	286ఉ/1/1	పట్టా	మెట్ట	0.08	[illegible]	279	287	284	277	-	-	-	-
378	286ఉ/1/2	పట్టా	మెట్ట	0.02	[illegible]	279	287	284	277	-	-	-	-
379	287/1	పట్టా	మెట్ట	0.10	[illegible]	279	287	284	277	పెంకు పేవ	2 1	బోర్	-
380	287/ఎ/1	పట్టా	మెట్ట	0.01	[illegible]	279	287	284	277	-	-	-	-
381	287/ఔ	పట్టా	మెట్ట	0.02	[illegible]	289	146	291	147	-	-	-	-
382	287/10	పట్టా	మెట్ట	0.10	[illegible]	289	146	291	147	-	-	-	-

కాళేశ్వరం ప్రాజెక్టును మూసేసే కుట్ర

- గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించే పన్నాగం
- మోదీ, చంద్రబాబుతో కలిసి రేవంత్ కుతంత్రాలు
- కిషన్‌రెడ్డి, సంజయ్ అడగ్గానే సీబీఐ విచారణకు ఓకే
- మోదీ ప్రాపకం కోసం సీఎం తాపత్రయం: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం విచారణ సాకుతో తెలంగాణ అస్తిత్వంపై దాడి చేసేందుకు చంద్రబాబు, మోదీలతో కలిసి రేవంత్ రెడ్డి భారీ కుట్ర పన్నుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీబీఐ విచారణ పేరుతో కేవలం కేసీఆర్, బీఆర్ఎస్ మీదనే దాడి జరగడం లేదని.. కాళేశ్వరం ప్రాజెక్టును శాశ్వతంగా మూసేసి గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించే కుతంత్రాలకు ఆ ముగ్గురు తెరతీశారని ధ్వజమెత్తారు. తెలంగాణ గొంతుకగా ఉన్న కేసీఆర్, బీఆర్ఎస్‌లను లేకుండా చేసి రాష్ట్రంలో తిరిగి తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మోదీ, చంద్రబాబు ఎజెండా మేరకు బనకచర్ల ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రేవంత్ రెడ్డి.. తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెట్టి రైతుల నోట్లో మట్టి కొట్టారని మండిపడ్డారు. సీబీఐ, ఈడీ, ఐటీలను మోదీ జేబు సంస్థలుగా విమర్శించిన రేవంత్.. 48 గంటల్లోనే ఎందుకు మాట మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అంతా కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ దుర్వినియోగం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తుంటే.. రేవంత్ మాత్రం మోదీ ప్రాపకం కోసం వాటిని ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. రేవంత్ మీద ఈగ వాలకుండా ప్రధాని మోదీ కాపాడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీకి చేదుగా అనిపించిన సీబీఐ.. రేవంత్‌కు ముద్దొస్తుందా..? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కోరగానే.. అంగీకరించడం ఆ రెండు పార్టీల అక్రమ సంబంధానికి సాక్ష్యమని అన్నారు. కేసీఆర్ మీద విష ప్రచారం చేయాలన్న దుర్మార్గ, రాక్షస ఆలోచనతో రేవంత్ ఉన్నారని కేటీఆర్ విరుచుకుపడ్డారు. సీబీఐకే కాదు, ఏ ఏజెన్సీకి కాళేశ్వరం విచారణ అప్పజెప్పినా బీఆర్ఎస్ భయపడదన్నారు. న్యాయస్థానాల్లో పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. సోమ, మంగళవారాల్లో మండల, జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు, బైక్ ర్యాలీలు, ఇతర రూపాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనలు తెలుపుతాయని కేటీఆర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. "రాహుల్ గాంధీ.. సీబీఐ అంటే బీజేపీ 'ప్రతిపక్షాల నిర్మూలన సెల్' అని అన్నారు కదా..? మరి మీ సీఎం ఏం చేస్తున్నారో మీకు తెలుసా..?" అని కేటీఆర్ ఎక్స్‌లో ప్రశ్నించారు.

హరీశ్ 'మాస్టర్ క్లాస్'..

అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్‌పై ఆదివారం జరిగిన చర్చలో తమ నేత హరీశ్ రావు అద్భుతంగా బదులిచ్చారని కేటీఆర్ ప్రశంసించారు. కేసీఆర్ శిష్యుడిగా హరీశ్ చేసిన ప్రసంగంతో.. నీటి పారుదల శాఖ గురించి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు అయిష్టంగానైనా ఎంతో కొంత నేర్చుకుని ఉంటారని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇది తమ డైనమిక్ లీడర్ హరీశ్‌రావు ఇచ్చిన మాస్టర్ క్లాస్ అని కొనియాడారు.

కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తూ..

ఏ క్షణమైనా జీవో ఇచ్చే ప్రమాదం!

- నేటి వరకు ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోండి
- హైకోర్టుకు కేసీఆర్, హరీశ్‌రావు విజ్ఞప్తి
- మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వని కోర్టు
- నేడు వివరణ ఇవ్వాలని సర్కార్‌కు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు కేసును సీబీఐకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఏ క్షణమైనా జీవో ఇచ్చే ప్రమాదం ఉందని, కాబట్టి ప్రభుత్వం చేపట్టే తదుపరి చర్యలపై స్టే విధించాలని మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. తదుపరి చర్యలను అడ్డుకోకపోతే కాళేశ్వరం కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా తాము దాఖలు చేసిన పిటిషన్లు, తమ శ్రమ వృధా అవుతాయని పేర్కొన్నారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 8-బీ, 8-సీ కింద నోటీసులు ఇవ్వకుండా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక చెల్లదని, దానిని కొట్టేయాలని కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కమిషన్ నివేదికను అసెంబ్లీలో పెట్టి చర్చించే వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోబోమని ప్రభుత్వం చెప్పిన నేపథ్యంలో కేసీఆర్, హరీశ్‌రావుకు అనుకూలంగా హైకోర్టు ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేదు. తమ పిటిషన్లపై తుది తీర్పు వెలువడే వరకు అసెంబ్లీలో చర్చించిన తర్వాత కూడా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోవాలంటూ శనివారం కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టులో మళ్లీ మధ్యంతర దరఖాస్తులు (ఐఏ) దాఖలు చేశారు. తాజాగా వాటిపై అత్యవసర విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం ఉదయం 10.30 గంటలకు చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం ఎదుట పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామ శేషాద్రినాయుడు ప్రస్తావించారు. పోలీస్ యాక్ట్ 6(2) ప్రకారం కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారమే జీవో ఇచ్చే అవకాశం ఉందని, అదే జరిగితే తమ శ్రమంతా వృధా అవుతుందన్నారు. ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా స్టే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. "ముఖ్యమంత్రి అసెంబ్లీలో మాట్లాడుతూ 'మీరు సూచనలు ఇస్తే ఇవ్వండి.. లేకపోతే పోండి' అంటూ అర్ధరాత్రి 2 గంటలకు ఈ కేసును సీబీఐకి అప్పగిస్తున్నామని ప్రకటించారు. అసెంబ్లీలో చర్చించే వరకు ఎలాంటి చర్యలు తీసుకోబోమని హామీ ఇచ్చి చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఇది హైకోర్టుకు ఇచ్చిన హామీని విస్మరించడం కిందకే వస్తుందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. 'చర్యలు తీసుకున్నారా? తీసుకుంటారా?' అని ప్రభుత్వం తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి అందుబాటులో లేరని, వచ్చే వారం ఏదో ఒకరోజు విచారణ చేపట్టాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. మంగళవారం ప్రభుత్వ వివరణతో సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ న్యాయవాదులను హైకోర్టు ఆదేశించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

బీఆర్ఎస్ పని ఇక అయిపోయినట్టే

- మరో 15 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పని ఇక అయిపోయినట్టేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఇంకా 15 ఏళ్లు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని తెలిపారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. కేసీఆర్ కుటుంబ గొడవల్లో తాము తలదూర్చబోమని చెప్పారు. కానీ తమ పార్టీ, తమ ముఖ్యమంత్రి గురించి మాట్లాడితే బాగుండదని హెచ్చరించారు. కవితనే కాదు ఇంకెవరు మాట్లాడినా ఊరుకోబోమని చెప్పారు. తాము కాళేశ్వరం మీద వేసిన కమిషన్.. అందులో అవినీతి జరిగినట్లు రిపోర్టు ఇచ్చిందని తెలిపారు. అందుకే ఆ కేసును సీబీఐకి ఇచ్చామని, దొంగ ఎవరనేది అక్కడ తేలుతుందన్నారు. ప్రజాపాలన మీద దృష్టి సారించి, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. పదేళ్ల క్రితమే కాంగ్రెస్ వస్తే బాగుండని ప్రజలు అనుకుంటున్నారని మంత్రి వెంకట్‌రెడ్డి తెలిపారు.

హెచ్‌ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలిగా కవిత

- రాష్ట్ర అధ్యక్షుడిగా రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలోని హింద్ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్) అనుబంధ సంస్థ సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను, యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎండీ రియాజ్ అహ్మద్‌ను యూనియన్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న మహాసభల్లో యూనియన్ కేంద్ర నాయకులు తీర్మానం చేశారు. యూనియన్ పేరును ఇకపై అఖిల భారత మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్‌గా మార్చాలని సభలో నిర్ణయించారు. ఈ సభల ముగింపు కార్యక్రమానికి హెచ్‌ఎంఎస్ మాజీ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి హాజరయ్యారు.

(మిగతా 12వ పేజీలో)

(11వ పేజీ తరువాయి)

750	343/ఇ2	పట్టా	తరి	0.07	పద్మమ్మ భర్త శివకిష్టప్ప	344	352	342	352	-	-	-	-
751	346/ఈ1	పట్టా	తరి	0.05	శీలం నర్సిరెడ్డి తండ్రి బుగ్గప్ప	344	352	342	352	-	-	బోర్ పైప్ లైన్	-
752	346/అ	పట్టా	తరి	0.05	శీలం నర్సిరెడ్డి తండ్రి శేషప్ప	344	352	342	352	-	-	-	-
753	346/అ	పట్టా	తరి	0.16	శీలం శ్రీనివాసరెడ్డి తండ్రి జనిరెడ్డి	348	351	351	351	-	-	-	-
754	346ఈ2	పట్టా	తరి	0.05	శీలం మహేందర్ తండ్రి బుగ్గప్ప	349	354	351	351	-	-	-	-
755	346/ఎ/2	పట్టా	తరి	0.06	అంజనేయులు తండ్రి లక్ష్మారెడ్డి	349	351	351	351	-	-	-	-
756	346/ఇ	పట్టా	తరి	0.08	శీలం ప్రభాకర్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి	349	351	351	351	-	-	-	-
757	346/ఇ1	పట్టా	తరి	0.07	శీలం ప్రభాకర్‌రెడ్డి తండ్రి మల్లారెడ్డి	349	351	351	351	-	-	-	-
758	346/అ1	పట్టా	తరి	0.05	శీలం వెంకటమ్మ భర్త శ్రీనివాసరెడ్డి	349	351	351	351	-	-	-	-
759	346/ఈ3	పట్టా	తరి	0.05	శీలం కవిత భర్త శీలంమహిపాల్	349	351	351	351	-	-	-	-
760	347	పట్టా	తరి	1.32	శీలం జనిరెడ్డి తండ్రి నాగప్ప	349	351	351	351	-	-	-	-
761	348/అ	పట్టా	తరి	0.18	శీలం నర్సిరెడ్డి తండ్రి బుగ్గప్ప	349	351	351	351	-	-	-	-
762	348/ఇ	పట్టా	మెట్ట	0.18	శీలం మహేందర్ తండ్రి బుగ్గప్ప	351	348	346	351	-	-	-	-
763	348/ఉ	పట్టా	మెట్ట	0.19	శీలం కవిత భర్త శీలంమహిపాల్	351	348	346	351	-	-	-	-
764	350	పట్టా	మెట్ట	0.18	శీలం నర్సిరెడ్డి తండ్రి శేషప్ప	351	348	346	351	-	-	-	-
765	350/అ	పట్టా	మెట్ట	0.19	అంజనేయ తండ్రి లక్ష్మారెడ్డి	351	348	346	351	-	-	-	-
766	350/అ	పట్టా	మెట్ట	0.18	శీలం వెంకటమ్మ భర్త శ్రీనివాసరెడ్డి	351	351	346	351	-	-	బోర్	-
767	352/అ	పట్టా	మెట్ట	1.02	శీలం నర్సిరెడ్డి తండ్రి బుగ్గప్ప	351	351	346	351	-	-	-	-
768	352/ఉ	పట్టా	మెట్ట	1.01	శీలం నర్సిరెడ్డి తండ్రి శేషప్ప	351	351	346	351	పంపి డి టేకు	1 50	బోర్ పైప్ లైన్	-
769	352/ఎ	పట్టా	మెట్ట	3.00	శీలం జనిరెడ్డి తండ్రి నాగప్ప	313	353	343	370	-	-	-	-
770	352/4	పట్టా	మెట్ట	1.02	శీలం మహేందర్ తండ్రి బుగ్గప్ప	313	353	343	370	-	-	-	-
771	352/అ	పట్టా	మెట్ట	1.08	రాములమ్మ భర్త శేషప్ప	313	353	343	370	-	-	-	-
772	352/ఈ	పట్టా	మెట్ట	1.02	శీలం వెంకటమ్మ భర్త శ్రీనివాసరెడ్డి	313	353	343	370	-	-	-	-
773	352/ఋ	పట్టా	మెట్ట	1.23	శీలం శశికళ భర్త ప్రభాకర్‌రెడ్డి	313	353	343	370	పంపి డి	2	బోర్ పైప్ లైన్	-
774	352/ఊ	పట్టా	మెట్ట	1.23	శీలం శశికళ భర్త ప్రభాకర్‌రెడ్డి	313	353	343	370	-	-	-	-
775	352/5	పట్టా	మెట్ట	1.02	శీలం కవిత భర్త శీలం మహిపాల్	313	353	343	370	-	-	-	-
776	353/అా/1/1	పట్టా	మెట్ట	0.20	కటికె అంబోజి తండ్రి అనుమోజి	343	353	343	370	-	-	బోర్ పైప్ లైన్	-
777	353/ఉ/1	పట్టా	మెట్ట	1.11	కొల్లంపల్లి హుసేనప్ప తండ్రి నరసప్ప	343	353	343	370	-	-	బోర్	-
778	353/ఋ1	పట్టా	మెట్ట	0.20	కొల్లంపల్లి హుసేనప్ప తండ్రి నరసప్ప	352	354	354	369	-	-	-	-
779	353/ఉ/ఎ/1/1/2	పట్టా	మెట్ట	0.20	బసమొళ్ల భీమప్ప తండ్రి బసమొళ్ల హుసేనప్ప	352	354	354	369	పంపి డి	1	బోర్ పైప్ లైన్	-
780	353/ఉ/ఎ/1/1/1	పట్టా	మెట్ట	0.20	బసమొళ్ల వెంకటప్ప తండ్రి బసమొళ్ల హుసేనప్ప	352	354	354	369	-	-	-	-
781	353/ఊ5	పట్టా	మెట్ట	0.02	బొల్లా నర్సమ్మ భర్త మొగులప్ప	352	354	354	369	-	-	-	-
782	353/ఋ	పట్టా	మెట్ట	1.07	కటికె నర్సింగ్ తండ్రి రాంచందర్‌రెడ్డి	352	354	354	369	-	-	బోర్	-
783	353/ఐ	పట్టా	మెట్ట	0.02	హరిజన్ బాలప్ప భర్త భీమప్ప	352	354	354	369	-	-	బోర్	-
784	353/ఇ1	పట్టా	మెట్ట	0.20	కావలి రాంచంద్రప్ప తండ్రి చేవప్ప	352	354	354	369	-	-	బోర్ పైప్ లైన్	-
785	353/ఇ	పట్టా	మెట్ట	1.07	రాధాబాయి భర్త రాంచందర్	352	354	354	369	-	-	బోర్ పైప్ లైన్	-
786	353/ఋ4	పట్టా	మెట్ట	0.02	చిన్నరాములు తండ్రి బుగ్గప్ప	352	354	354	369	-	-	-	-
787	353/ఋ	పట్టా	మెట్ట	0.20	కొల్లంపల్లి కిష్టప్ప తండ్రి బాలప్ప	352	354	354	369	-	-	-	-
788	353/ఉ	పట్టా	మెట్ట	1.12	కొల్లంపల్లి కిష్టప్ప తండ్రి బాలప్ప	352	354	354	369	-	-	-	-
789	353/ఇ2	పట్టా	మెట్ట	0.20	కావలి లక్ష్మి భర్త కావలి రాంచందర్	352	354	354	369	-	-	బోర్ పైప్ లైన్	-
790	353/ఈ/1	పట్టా	మెట్ట	0.28	పూజారి అరుణ భర్త బాలకిషన్	352	354	354	369	-	-	-	-
791	353/ఈ/2	పట్టా	మెట్ట	0.28	పి.బాలాజి తండ్రి పి.బుగ్గోజి	352	354	354	369	-	-	బోర్	-
792	353/ఊ	పట్టా	మెట్ట	3.20	కె.శ్రీదేవి భర్త కె.బాబు	352	354	354	369	-	-	బోర్ పైప్ లైన్	-
793	353/ఊ/2	పట్టా	మెట్ట	0.28	కె.శ్రీదేవి భర్త కె.బాబు	352	354	354	369	-	-	-	-
794	353/ఊ/1/2	పట్టా	మెట్ట	1.00	కె.శ్రీదేవి భర్త కె.బాబు	352	354	354	369	-	-	-	-
795	353/ఊ3	పట్టా	మెట్ట	0.02	బి.అనంతరాములు తండ్రి బొర్రారాములు	352	354	354	369	-	-	-	-
796	353/ఇ/ఎ/2	పట్టా	మెట్ట	1.00	అశోక్ బుగ్గప్ప బసమొళ్ల తండ్రి బుగ్గప్ప	352	354	354	369	-	-	బోర్	-
797	353/ఊ/2	పట్టా	మెట్ట	0.02	చింపిరి ఎల్లమ్మ భర్త రాశప్ప	352	354	354	369	-	-	-	-
798	353/ఊ/1	పట్టా	మెట్ట	0.02	మాణిక్యమ్మ భర్త జడిగి చంద్రప్ప	352	354	354	369	-	-	-	-
799	353/ఇ/ఎ/1/2	పట్టా	మెట్ట	0.20	అశోక్ బసమొళ్ల తండ్రి తిమ్మప్ప	352	354	354	369	-	-	-	-
800	353/1	పట్టా	మెట్ట	0.28	మహ్మద్ అమీర్ తండ్రి మహ్మద్ హుసేన్	352	354	354	369	-	-	-	-
801	353/2	పట్టా	మెట్ట	0.22	మహ్మద్ సలాం తండ్రి మహ్మద్ హుసేన్	352	354	354	369	-	-	బోర్ పైప్ లైన్	-
802	383	పట్టా	మెట్ట	3.35	**పట్టాదారుడు** వెంకట రాఘవమ్మ **కాస్తుదారుడు** పది బనిరెడ్డి ఇతరులు	352	354	354	389	-	-	-	-
803	384/3	పట్టా	మెట్ట	0.09	హరిజన్ బాలమ్మ భర్త భీమప్ప	352	354	354	369	-	-	-	-
804	384/అ1	పట్టా	మెట్ట	0.05	రాజు తండ్రి నర్సప్ప కిష్టాపురం	367	378	362	374	-	-	-	-
805	384/అ2	పట్టా	తరి	0.06	పెద్ద హుసేనప్ప తండ్రి నర్సప్ప కిష్టాపురం	365	362	353	367	-	-	-	-
806	384/అ4	పట్టా	తరి	0.09	సాయప్ప తండ్రి నర్సప్ప కిష్టాపురం	365	362	353	367	-	-	-	-
807	384/అ3	పట్టా	తరి	0.06	ఏ.నర్సమ్మ భర్త చిన్నహుసేనప్ప	365	362	353	367	-	-	బోర్	-
808	384/2/1	పట్టా	తరి	0.03	బొర్రా నర్సమ్మ భర్త బొర్రా మొగులప్ప	365	362	353	367	-	-	-	-
809	384/2/2	పట్టా	తరి	0.03	బొర్రా బసవరాజు తండ్రి బొర్రా పెద్దరాములు	365	362	353	367	-	-	-	-
810	384/2/3	పట్టా	తరి	0.03	బొర్రా అంజమ్మ భర్త బొర్రా ఎల్లప్ప	365	362	353	367	-	-	-	-
811	384/1/1	పట్టా	తరి	0.04	గణేష్ తండ్రి ఎస్ రాశప్ప	365	362	353	367	-	-	-	-
812	384/1	పట్టా	తరి	0.04	మాణిక్యమ్మ భర్త జడిగి చంద్రప్ప	365	362	353	367	-	-	-	-
813	385/1/1	పట్టా	తరి	0.03	చెరిచెరి బాలప్ప తండ్రి మారెప్ప	365	362	353	367	-	-	-	-
814	385/3	పట్టా	తరి	0.06	హరిజన్ బాలమ్మ భర్త భీమప్ప	365	362	353	367	-	-	-	-
815	385/2/4	పట్టా	తరి	0.02	బొర్రా పెద్దరాములు తండ్రి బుగ్గప్ప	366	364	353	367	-	-	-	-
816	385/అ1	పట్టా	తరి	0.05	రాజు తండ్రి నర్సప్ప కిష్టాపురం	366	364	353	367	-	-	-	-
817	385/అ2	పట్టా	తరి	0.05	పెద్ద హుసేనప్ప తండ్రి నర్సప్ప కిష్టాపురం	366	364	353	367	-	-	-	-
818	385/అ4	పట్టా	తరి	0.04	సాయప్ప తండ్రి నర్సప్ప కిష్టాపురం	366	364	353	367	-	-	-	-
819	385/ఎ/3	పట్టా	తరి	0.04	ఏ.నర్సమ్మ భర్త చిన్న హుసేనప్ప	366	364	353	367	-	-	-	-
820	385/2/2	పట్టా	తరి	0.02	బొర్రా ఎల్లప్ప తండ్రి రాములు	366	364	353	367	-	-	-	-
821	385/2/3	పట్టా	తరి	0.02	బొర్రా నర్సమ్మ భర్త బొర్రా మొగులప్ప	366	364	353	367	-	-	-	-
822	385/1	పట్టా	తరి	0.02	మాణిక్యమ్మ భర్త జడిగి చంద్రప్ప	366	364	353	367	-	-	-	-
823	386	పట్టా	తరి	0.32	ఎల్లోజి తండ్రి మొగులోజి	366	364	353	367	-	-	-	-
824	387/1	పట్టా	తరి	0.15	హరిజన్ బాలమ్మ భర్త భీమయ్య	366	364	353	367	-	-	-	-
825	387/అ1	పట్టా	తరి	0.02	రాజు తండ్రి నర్సప్ప కిష్టాపురం	353	365	353	367	-	-	-	-
826	387/అ2	పట్టా	తరి	0.02	పెద్ద హుసేనప్ప తండ్రి నర్సప్ప కిష్టాపురం	368	363	365	368	-	-	-	-
827	387/అ4	పట్టా	తరి	0.02	సాయప్ప తండ్రి నర్సప్ప కిష్టాపురం	368	363	365	368	-	-	-	-
828	387/అ3	పట్టా	తరి	0.02	ఏ.నర్సమ్మ భర్త చిన్న హుసేనప్ప	368	363	365	368	-	-	-	-
829	387/1/1/1	పట్టా	తరి	0.20	నర్సప్ప మొగులప్ప తమ్మలిగేరి తండ్రి మొగులప్ప	368	363	365	368	-	-	-	-
830	387/1/1/2	పట్టా	తరి	0.20	నర్సప్ప మొగులప్ప మేతరి తండ్రి మొగులప్ప	368	363	365	368	-	-	-	-
831	387/1/2/2	పట్టా	తరి	0.05	బొర్రా ఎల్లప్ప తండ్రి రాములు	368	363	365	368	-	-	-	-
832	387/1/2/3	పట్టా	తరి	0.05	బొర్రా నర్సమ్మ భర్త బొర్రామొగులప్ప	368	363	365	368	-	-	-	-
833	387/1/2/1/1	పట్టా	తరి	0.02	బి.యశోదమ్మ భర్త బొర్రా బసవరాజు	368	363	365	368	-	-	-	-
834	387/1/2/1/2	పట్టా	తరి	0.04	బొర్రా నవనీత భర్త బొర్రా అనంతరాం	368	363	365	368	-	-	-	-
835	387/2/1/1	పట్టా	తరి	0.04	ఎస్.శ్రీనివాస్ తండ్రి ఎస్ రాశప్ప	368	363	365	368	-	-	-	-
836	387/2/1/2	పట్టా	తరి	0.04	వెంకటప్ప ఎస్ తండ్రి ఎస్ రాశప్ప	368	363	365	368	-	-	-	-
837	387/2	పట్టా	తరి	0.08	మాణిక్యమ్మ భర్త జడిగి చంద్రప్ప	368	363	365	368	-	-	-	-
838	388/3	పట్టా	తరి	0.08	హరిజన్ బాలమ్మ భర్త భీమప్ప	368	363	365	368	-	-	-	-
839	388/2/4	పట్టా	తరి	0.03	బొర్రా పెద్దరాములు తండ్రి బుగ్గప్ప	368	363	365	368	-	-	-	-
840	388/అ	పట్టా	తరి	0.06	రాజు తండ్రి నర్సప్ప కిష్టాపురం	368	363	367	369	-	-	-	-
841	388/అ4	పట్టా	తరి	0.07	సాయప్ప తండ్రి నర్సప్ప కిష్టాపురం	368	363	367	369	-	-	-	-
842	388/ఆ2	పట్టా	తరి	0.07	వి.రాజు తండ్రి వాగులబాయి పెద్ద హుసేనప్ప	369	363	367	369	-	-	-	-
843	388/ఆ3	పట్టా	తరి	0.07	వి.నర్సమ్మ భర్త చిన్న హుసేనప్ప	369	363	367	369	-	-	-	-
844	388/2/2	పట్టా	తరి	0.03	బొర్రా ఎల్లప్ప తండ్రి రాములు	369	363	367	369	-	-	-	-
845	388/2/3	పట్టా	తరి	0.03	బొర్రా నర్సమ్మ భర్త బొర్రా మొగులప్ప	369	363	367	369	-	-	-	-
846	388/1/2	పట్టా	తరి	0.04	చిలిపేరి సురేష్ తండ్రి ఎస్ రాశప్ప	369	363	367	369	-	-	-	-
847	388/1	పట్టా	తరి	0.04	మాణిక్యమ్మ భర్త జడిగి చంద్రప్ప	369	363	367	369	-	-	-	-
848	369/ఆ/2	పట్టా	తరి	1.25	రాజు తండ్రి నర్సప్ప కిష్టాపురం	369	363	367	369	-	-	-	-
849	369/ఆ4	పట్టా	తరి	1.24	సాయప్ప తండ్రి నర్సప్ప కిష్టాపురం	369	363	367	369	-	-	-	-
850	369/ఆ2	పట్టా	మెట్ట	1.24	వి.రాజు తండ్రి వాగులబాయి పెద్ద హుసేనప్ప	370	371	353	369	-	-	-	-
851	369/ఆ3	పట్టా	మెట్ట	1.24	వి.వెంకటమ్మ భర్త చిన్న హుసేనప్ప	370	371	353	369	-	-	-	-
852	369/ఆ/1/1	పట్టా	మెట్ట	1.00	నర్సప్ప మొగులప్ప తమ్మలిగేరి తండ్రి మొగులప్ప	370	371	353	369	-	-	-	-
853	369/ఆ/1/2	పట్టా	మెట్ట	1.00	నర్సప్ప మొగులప్ప మేతరి తండ్రి మొగులప్ప	370	371	353	369	-	-	-	-
854	375/ఆ/1	పట్టా	మెట్ట	0.19	తిమ్మనోళ్ల లక్ష్మి భర్త నర్సిరెడ్డి	370	371	353	369	ఇంటి	2	బోర్ పైప్ లైన్	-
855	375/ఆ/2	పట్టా	మెట్ట	0.20	టి.శ్రీకాంత్ తండ్రి రాంరెడ్డి	370	371	353	369	-	-	బోర్ పైప్ లైన్	-
856	375/అ	పట్టా	మెట్ట	0.20	గడ్డి వెంకటరెడ్డి తండ్రి మొగులరెడ్డి	369	380	378	374	-	-	-	-
857	375/అ1	పట్టా	మెట్ట	0.19	హన్మిరెడ్డి తండ్రి మొగులరెడ్డి	369	380	378	374	-	-	-	-
858	376/ఆ2/1	పట్టా	మెట్ట	0.10	తిమ్మనోళ్ల అనసూయ భర్త రాంరెడ్డి	369	380	378	374	-	-	-	-
859	376/అ	పట్టా	మెట్ట	0.10	తిమ్మనోళ్ల అనంతరెడ్డి తండ్రి నర్సప్ప	369	380	378	374	-	-	బోర్ పైప్ లైన్	-
860	376/ఆ2/2	పట్టా	మెట్ట	0.08	తిమ్మనోళ్ల లక్ష్మి భర్త నర్సిరెడ్డి	369	378	371	375	-	-	-	-
861	376/ఆ4	పట్టా	మెట్ట	0.05	వేమా రెడ్డి తండ్రి తమ్మప్ప	369	378	371	375	-	-	-	-
862	376/ఆ3	పట్టా	మెట్ట	0.08	వేమా రెడ్డి తండ్రి తమ్మప్ప	369	378	371	375	-	-	-	-
863	376/అ	పట్టా	మెట్ట	0.13	బందం లక్ష్మి భర్త వెంకటయ్య	369	378	371	375	మోటి	1	బోర్	-
864	376/అ1	పట్టా	మెట్ట	0.06	బందం లక్ష్మి భర్త వెంకటయ్య	369	378	371	375	-	-	-	-
865	376/ఆ1	పట్టా	మెట్ట	0.10	శ్రీనివాస్ రెడ్డి తండ్రి నర్సప్ప	369	378	371	375	-	-	-	-
866	376/4	పట్టా	మెట్ట	0.04	నర్సిరెడ్డి తండ్రి తమ్మప్ప	369	378	371	375	-	-	-	-
867	376/ఆ2/1	పట్టా	మెట్ట	0.03	బందం భీంరెడ్డి తండ్రి తమ్మప్ప	369	378	371	375	-	-	బోర్ పైప్ లైన్	-
868	376/ఆ/6	పట్టా	మెట్ట	0.04	బందం భీంరెడ్డి తండ్రి తమ్మప్ప	369	378	371	375	-	-	-	-
869	377/ఆ1	పట్టా	మెట్ట	0.05	బందం నర్సిరెడ్డి తండ్రి నర్సప్ప	369	378	371	375	-	-	-	-
870	377/ఆ4	పట్టా	మెట్ట	0.04	వేమారెడ్డి తండ్రి తమ్మప్ప	369	378	371	375	-	-	-	-
871	377/ఆ3	పట్టా	తరి	0.03	వేమారెడ్డి తండ్రి తమ్మప్ప	376	382	378	381	-	-	-	-
872	377/అ	పట్టా	తరి	0.12	బందం లక్ష్మి భర్త వెంకటయ్య	376	382	378	381	-	-	-	-
873	377/ఆ6	పట్టా	తరి	0.04	నర్సిరెడ్డి తండ్రి తమ్మప్ప	376	382	378	381	-	-	-	-
874	377/ఆ2/1	పట్టా	తరి	0.03	బందం భీంరెడ్డి తండ్రి తమ్మప్ప	376	382	378	381	-	-	-	-
875	377/ఆ5/1	పట్టా	తరి	0.04	బందం భీంరెడ్డి తండ్రి తమ్మప్ప	376	382	378	381	-	-	-	-
876	377/అ	పట్టా	తరి	0.35	జి.వెంకటరెడ్డి తండ్రి దేవేంద్రప్ప	376	382	378	381	-	-	బోర్	-
877	378/ఈ2	పట్టా	తరి	0.03	తిమ్మనోళ్ల అనసూయ భర్త రాంరెడ్డి	376	382	378	381	-	-	-	-
878	378/ఈ2	పట్టా	తరి	0.03	తిమ్మనోళ్ల అనంతరెడ్డి తండ్రి నర్సప్ప	376	382	378	381	-	-	బోర్	-
879	378/ఈ3	పట్టా	తరి	0.03	తిమ్మనోళ్ల లక్ష్మి భర్త నర్సిరెడ్డి	376	379	377	375	-	-	-	-
880	378/ఆ4	పట్టా	తరి	0.04	వేమారెడ్డి తండ్రి తిమ్మప్ప	376	379	377	375	-	-	-	-
881	378/ఆ3	పట్టా	తరి	0.03	వేమారెడ్డి తండ్రి తిమ్మప్ప	376	379	377	375	-	-	-	-
882	378/ఇ1	పట్టా	తరి	0.10	లక్ష్మిరెడ్డి భర్త కిష్టారెడ్డి	376	379	377	375	-	-	బోర్	-
883	378/ఆఈ	పట్టా	తరి	0.01	లక్ష్మిరెడ్డి భర్త కిష్టారెడ్డి	376	379	377	375	-	-	-	-
884	378/అ	పట్టా	తరి	0.12	బందం లక్ష్మి భర్త వెంకటయ్య	376	379	377	375	-	-	-	-
885	378/అ1	పట్టా	తరి	0.07	బందం లక్ష్మి భర్త వెంకటయ్య	376	379	377	375	-	-	-	-
886	378/ఈ1	పట్టా	తరి	0.03	శ్రీనివాస్‌రెడ్డి తండ్రి నర్సప్ప	376	379	377	375	-	-	-	-
887	378/ఇ/అ	పట్టా	తరి	0.01	రాంరెడ్డి తండ్రి కిష్టారెడ్డి	376	379	377	375	-	-	-	-
888	378/ఆ6	పట్టా	తరి	0.04	నర్సిరెడ్డి తండ్రి తమ్మప్ప	376	379	377	375	-	-	-	-
889	378/ఆ2/1	పట్టా	తరి	0.03	బందం భీంరెడ్డి తండ్రి తమ్మప్ప	376	379	377	375	-	-	-	-
890	378/ఆ5/1	పట్టా	తరి	0.04	బందం భీంరెడ్డి తండ్రి తమ్మప్ప	376	379	377	375	-	-	-	-
891	378/ఇఉ/1	పట్టా	తరి	0.02	తిమ్మనోళ్ల భీంరెడ్డి తండ్రి యమరెడ్డి	376	379	377	375	-	-	బోర్	-
892	378/ఇఉ/2	పట్టా	తరి	0.02	టిగోపాల్ రెడ్డి తండ్రి యమరెడ్డి	376	379	377	375	-	-	-	-
893	378/ఇఉ/3	పట్టా	తరి	0.02	శ్రీనివాస్ రెడ్డి తండ్రి యమరెడ్డి	376	379	377	375	-	-	-	-
894	378/ఈ/3	పట్టా	తరి	0.08	టి.శరణప్ప తండ్రి నర్సిరెడ్డి	376	379	377	375	-	-	బోర్	-
895	378/ఇ/1	పట్టా	తరి	0.07	గడ్డి అనంతరెడ్డి తండ్రి భీమప్ప	376	379	377	375	-	-	-	-
896	378/ఇ3	పట్టా	తరి	0.06	తిమ్మనోళ్ల లక్ష్మి భర్త నర్సిరెడ్డి	376	379	377	375	-	-	-	-
897	378/ఇ2	పట్టా	తరి	0.07	టి.శివ శంకర్ తండ్రి రాంరెడ్డి	378	381	377	380	-	-	-	-
898	378/ఇ	పట్టా	తరి	0.07	గడ్డి వెంకటరెడ్డి తండ్రి మొగులరెడ్డి	378	381	377	380	-	-	బోర్	-
899	379/అ1	పట్టా	తరి	0.07	హన్మిరెడ్డి తండ్రి మొగులరెడ్డి	378	381	377	380	-	-	-	-
900	379/అ	పట్టా	తరి	0.06	వెంకట్రాం చంద్రారెడ్డి తండ్రి అనంతరెడ్డి	378	381	377	380	-	-	బోర్	-
901	379/అ	పట్టా	తరి	0.13	జి.వెంకట్ రెడ్డి తండ్రి దేవేంద్రప్ప	378	381	377	380	-	-	-	-
902	380/ఇ2	పట్టా	తరి	0.04	తిమ్మనోళ్ల అనసూయ భర్త రాంరెడ్డి	378	381	377	380	-	-	-	-
903	380/ఇ	పట్టా	తరి	0.05	తిమ్మనోళ్ల అనంతరెడ్డి తండ్రి నర్సప్ప	378	381	377	380	-	-	-	-
904	380/ఇ3	పట్టా	తరి	0.05	తిమ్మనోళ్ల లక్ష్మి భర్త నర్సిరెడ్డి	375	381	379	387	-	-	-	-
905	380/ఆఉ	పట్టా	తరి	0.06	లక్ష్మి రెడ్డి భర్త కిష్టారెడ్డి	375	381	379	387	-	-	బోర్ పైప్ లైన్	-
906	380/ఇ1	పట్టా	తరి	0.05	శ్రీనివాసరెడ్డి తండ్రి నర్సప్ప	375	381	379	387	-	-	-	-
907	380/ఆ/అ	పట్టా	తరి	0.06	భీంరెడ్డి తండ్రి కిష్టారెడ్డి	375	381	379	387	-	-	-	-
908	380/ఆ/అ	పట్టా	తరి	0.06	రాంరెడ్డి తండ్రి కిష్టారెడ్డి	375	381	379	387	-	-	-	-
909	380/అ	పట్టా	తరి	0.05	వెంకటరెడ్డి తండ్రి భీంరెడ్డి	375	381	379	387	-	-	-	-
910	380/అ1/1	పట్టా	తరి	0.03	తిమ్మనోళ్ల భీంరెడ్డి తండ్రి యమరెడ్డి	375	381	379	387	-	-	-	-
911	380/అ1/2	పట్టా	తరి	0.03	టిగోపాల్ రెడ్డి తండ్రి యమరెడ్డి	375	381	379	387	-	-	-	-
912	380/అ1/3	పట్టా	తరి	0.03	శ్రీనివాస రెడ్డి తండ్రి యమరెడ్డి	375	381	379	387	-	-	-	-
913	381/అ1	పట్టా	తరి	0.11	గడ్డి అనంతరెడ్డి తండ్రి భీమప్ప	375	381	379	387	-	-	-	-
914	381/ఇ1	పట్టా	తరి	0.06	గడ్డి అనంతరెడ్డి తండ్రి భీమప్ప	375	381	379	387	-	-	-	-
915	381/ఉ1	పట్టా	తరి	0.04	తిమ్మనోళ్ల లక్ష్మి భర్త నర్సిరెడ్డి	379	383	382	386	-	-	-	-
916	381/ఇ4	పట్టా	తరి	0.03	బందం నర్సప్ప తండ్రి లక్ష్మప్ప	379	383	382	386	-	-	-	-
917	381/ఇ3	పట్టా	తరి	0.01	వేమారెడ్డి తండ్రి తమ్మప్ప	379	383	382	386	-	-	-	-
918	381/ఇ2	పట్టా	తరి	0.02	వేమారెడ్డి తండ్రి తమ్మప్ప	379	383	382	386	-	-	-	-
919	381/ఉ	పట్టా	తరి	0.05	టి.శ్రీకాంత్ తండ్రి రాంరెడ్డి	379	383	382	386	-	-	-	-
920	381/ఇ	పట్టా	తరి	0.05	బందం లక్ష్మప్ప తండ్రి నర్సప్ప	379	383	382	380	-	-	బోర్	-
921	381/ఈ	పట్టా	తరి	0.05	గడ్డి వెంకటరెడ్డి తండ్రి మొగులరెడ్డి	379	383	382	386	-	-	-	-
922	381/ఈ1	పట్టా	తరి	0.04	హన్మిరెడ్డి తండ్రి మొగులరెడ్డి	379	383	382	386	-	-	-	-
923	381/అ	పట్టా	తరి	0.17	వెంకట్‌రాంచంద్రారెడ్డి తండ్రి అనంతరెడ్డి	379	383	382	386	-	-	-	-
924	381/ఇ4	పట్టా	తరి	0.02	నర్సిరెడ్డి తండ్రి తమ్మప్ప	379	383	382	386	-	-	-	-
925	381/ఇ2/1	పట్టా	తరి	0.04	బందం భీంరెడ్డి తండ్రి తమ్మప్ప	379	383	382	386	-	-	-	-
926	381/అ	పట్టా	తరి	0.17	జి.వెంకట రెడ్డి తండ్రి దేవేంద్రప్ప	379	383	382	386	-	-	-	-
927	382/అ	పట్టా	తరి	0.03	గడ్డి అనంతరెడ్డి తండ్రి భీమప్ప	379	381	382	380	-	-	-	-
928	382/అ1/3	పట్టా	తరి	0.03	బందం నర్సప్ప తండ్రి లక్ష్మప్ప	379	383	382	386	-	-	-	-
929	382/ఇ2	పట్టా	తరి	0.03	వేమారెడ్డి తండ్రి తమ్మప్ప	377	383	381	381	-	-	-	-
930	382/అ1/2	పట్టా	తరి	0.02	వేమారెడ్డి తండ్రి తమ్మప్ప	377	383	381	381	-	-	-	-
931	382/ఆ/2	పట్టా	తరి	0.07	బందం లక్ష్మి తండ్రి వెంకటయ్య	377	383	381	381	-	-	-	-
932	382/అ	పట్టా	తరి	0.04	వెంకట్‌రాంచంద్రారెడ్డి తండ్రి అనంతరెడ్డి	377	383	381	381	-	-	-	-
933	382/ఆ4	పట్టా	తరి	0.02	నర్సిరెడ్డి తండ్రి తమ్మప్ప	377	383	381	381	-	-	-	-
934	382/ఆ3	పట్టా	తరి	0.03	బందం నర్సిరెడ్డి తండ్రి బందం భీంరెడ్డి	377	383	381	381	-	-	-	-
935	386/ఇ2	పట్టా	తరి	0.03	తిమ్మనోళ్ల అనసూయ భర్త రాంరెడ్డి	377	383	381	381	-	-	-	-
936	386/ఇ	పట్టా	తరి	0.08	తిమ్మనోళ్ల అనంతరెడ్డి తండ్రి నర్సప్ప	377	383	381	381	-	-	-	-
937	386/ఇ3	పట్టా	మెట్ట	0.04	తిమ్మనోళ్ల లక్ష్మి భర్త నర్సిరెడ్డి	381	387	381	384	-	-	-	-
938	386/ఇ1	పట్టా	మెట్ట	0.04	తిమ్మనోళ్ల భీమప్ప తండ్రి శ్రీనివాసరెడ్డి	381	387	381	384	-	-	-	-
939	386/ఆఉ	పట్టా	మెట్ట	0.04	లక్ష్మి రెడ్డి భర్త కిష్టారెడ్డి	381	387	381	384	-	-	-	-
940	386/ఆఉ	పట్టా	మెట్ట	0.04	భీంరెడ్డి కిష్టారెడ్డి	381	387	381	384	-	-	-	-
941	386/ఆఉ1	పట్టా	మెట్ట	0.04	రాంరెడ్డి తండ్రి కిష్టారెడ్డి	381	387	381	384	-	-	-	-
942	386/ఇ1/1	పట్టా	మెట్ట	0.03	తిమ్మనోళ్ల భీంరెడ్డి తండ్రి యమరెడ్డి	381	387	381	384	-	-	-	-
943	386/ఇ1/2	పట్టా	మెట్ట	0.03	టిగోపాల్ రెడ్డి తండ్రి యమరెడ్డి	381	387	381	384	-	-	-	-
944	386/ఇ1/3	పట్టా	మెట్ట	0.01	శ్రీనివాసరెడ్డి తండ్రి యమరెడ్డి	381	387	381	384	-	-	-	-
945	386/ఇ	పట్టా	మెట్ట	0.05	బసవరాజ్ తండ్రి నర్సిరెడ్డి	381	387	381	384	-	-	-	-
	మొత్తం	ఎ.395.01 గుంటలు											

భూసేకరణ, పునరావాసం మరియు పునరావాస చట్టం 2013 (కేంద్ర చట్టము నెం.30/2013) లో న్యాయమైన సక్రమ పరిహారం మరియు పారదర్శక హక్కు యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనల ప్రకారం పైన పేర్కొనబడిన వారందరికి ఈ ప్రకటన రూపొందించబడింది.

భూమి యొక్క ప్లాన్ జిల్లా కలెక్టర్, నారాయణపేట మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, నారాయణపేట & భూ సేకరణ వారి కార్యాలయములో ఏదైనా పని దినములలో పరిశీలించుకొనవచ్చును. తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్ - రం - సరియైన ప్రభుత్వము సదరు చట్టం యొక్క సెక్షన్ 12 లో తెలిపిన మరియు నిర్దేశిత విధంగా వారి పనిని సరిగా చేపట్టుట కొరకు అవసరమైన అన్ని ఇతర చట్టాలను చేయుటకు భూమిలోనికి ప్రవేశించుటకు మరియు సరిగా వేయుటకు ఏదేని భూమి యొక్క ఎత్తుపల్లాలు తీసుకొనుటకు సబ్ సాయిల్ త్రవ్వుటకు లేదా బోర్ వేయుటకు రెవెన్యూ డివిజనల్ అధికారికి మరియు అతని సిబ్బందికి అధికారం ఇవ్వారు.

చట్టం సెక్షన్ 11 (4) క్రింద కలెక్టర్ యొక్క ముందస్తు ఆమోదాలు లేకుండా ఈ ప్రకటన ప్రచురించిన తేది నుండి భూమి యొక్క ఏదేని లావాదేవీలు అనగా అమ్మకాలు/ కొనుగోలు మొదలైనవి లేదా అటువంటి భూముల పై ఏదేని ఋణభారములు సృష్టించుటకు కారణమగుట లేదా ఏదేని లావాదేవీ ఏ వ్యక్తి చేయరాదు.

పరిహారం యొక్క సంప్రదింపుల ద్వారా సెటిల్మెంట్ కొరకు ఆసక్తి / ప్రభావితమయ్యే వ్యక్తులందరి నుండి క్లెయిముల మరియు సేకరణకు అభ్యంతరాలు ఏమైనా ఉంటె భూమిలో ఆసక్తి గల వ్యక్తులు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేది నుండి 60 (అరువది) రోజుల లోపల భూమిలో ఆసక్తి గల వ్యక్తులచే జిల్లా కలెక్టర్ / అధీకృత సమక్షంలో సమర్పించవచ్చు.

సం/-	సం/-	సం/-
భూసేకరణ అధికారి & రాజస్వ మండలాధికారి నారాయణపేట	అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నారాయణపేట	జిల్లా కలెక్టర్ నారాయణపేట

DIPR RO NO.545/LA-PP/ADVT/PUBLICATION/2025-26

తెలంగాణలో కొత్త విద్యా విధానం

- కేంద్ర విధానానికి అనుగుణంగా రూపొందించేందుకు కమిటీ
- కేశవరావు నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో ఏర్పాటు



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)-2020కి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఈ విధానంపై తటస్థంగా ఉంటూ వచ్చిన ప్రభుత్వం, తాజాగా రాష్ట్రానికి ఒక కొత్త విద్యా విధానాన్ని రూపొందించాలని ఆదేశించింది. ఈ కొత్త విధానం రూపొందించడానికి ఏడుగురు సభ్యులతో ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ప్రభుత్వ సలహాదారు కేశవరావు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ అధ్యక్షుడు ఆకునూరి మురళి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి ఉన్నారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. కమిటీ చైర్మన్‌కు మరో సభ్యుడిని నియమించుకునే అవకాశం ఉంది. ఈ కమిటీ అక్టోబరు 30లోపు తమ నివేదికను సమర్పించాలని ప్రభుత్వం కోరింది. కొత్త విద్యావిధానం 'తెలంగాణ రైజింగ్-2027' లక్ష్యంగా ఉండాలని సూచించింది. ఈ విధానంలో డిజిటల్ బోధన, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, పరిశోధనలు, అంతర్జాతీయ అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొంది. అలాగే, విద్యాసంస్థలు, పారిశ్రామిక రంగం మధ్య సంబంధాలు బలోపేతం చేసేందుకు తగిన సూచనలు ఇవ్వాలని కోరింది. పాఠశాలలు, కళాశాలలు, వృత్తి విద్య, సాంకేతిక విద్యలో అవసరమైన సంస్కరణలను కూడా ఈ కమిటీ ప్రభుత్వానికి సూచించనుంది. విద్యావ్యవస్థను కాషాయీకరణ చేయాలన్న లక్ష్యంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్‌ఈపీ-2020 తీసుకొచ్చిందని విమర్శలు వస్తున్నాయి. కేంద్రం ఏకపక్షంగా దీనిని రూపొందించిందని, రాష్ట్రాలతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదని అనేక రాష్ట్రాలు మండిపడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 9 రాష్ట్రాలు మాత్రమే ఎన్‌ఈపీని పూర్తిగా అమలుచేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించాయి. కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించాయి. తెలంగాణ మాత్రం ఇప్పటివరకు తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించకుండా తటస్థంగా ఉంది. అయితే, కర్ణాటక, తమిళనాడుల మాదిరిగానే తెలంగాణ కూడా సొంత రాష్ట్ర విద్యా విధానాన్ని ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. ఎన్‌ఈపీలోని వివాదాస్పద అంశాల జోలికి వెళ్లకుండా, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కొన్ని ఉపయోగకర అంశాలు తీసుకుని ప్రత్యేక విద్యా విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కొత్త విధానం 2026-27 వచ్చే విద్యా సంవత్సరం అమలులోకి రానుంది.

నక్సలిజం ఓ ఫిలాసఫీ

ఆ భావజాలం నచ్చకపోతే వాదించి గెలవాలి.. దాడి చేసి అంతం చేస్తామంటే కుదరదు

- ఉపరాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలిస్తే తెలుగువారి ప్రతిష్ఠ పెరుగుతుంది
- అభినందన కార్యక్రమంలో సీఎం రేవంత్
- సుప్రీం తీర్పులను విమర్శించే ముందు వాటిని చదవాలి.. అమిత్‌షాను ఉద్దేశించి సుదర్శన్‌రెడ్డి



జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మహేశ్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నక్సలిజం అనేది ఒక భావజాల(ఫిలాసఫీ)మని, అది నచ్చనప్పుడు వాదించి గెలవాలే తప్ప దాడి చేసి, అంతం చేస్తానంటే కుదరదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి తరఫున బరిలో ఉన్న ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నక్సలైట్ అంటూ ఓ జాతీయ నాయకుడు మాట్లాడుతున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీపీఐ అగ్రనేత నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నీలం సంజీవరెడ్డి , వీవీ గిరి, పీవీ నరసింహరావు, జైపాల్ రెడ్డి, వెంకయ్యనాయుడు, ఎన్టీ రామారావు లాంటి తెలుగు నేతలు గతంలో జాతీయ స్థాయి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలుగు నాయకులు జాతీయ రాజకీయాల్లో అంత కీలకంగా లేరన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా తెలుగు వ్యక్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి అవకాశం వచ్చిందని, తెలుగువారి గౌరవం పెరిగేలా అంతా ఒక తాటిపైకి వచ్చి ఆయనకు అండగా నిలవాలని కోరారు. ఎంపీలు ఆత్మప్రభోధానుసారం ఓటు వేసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని రెండు తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయ పార్టీల అధ్యక్షులు చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, వైఎస్ జగన్, కేసీఆర్, అసదుద్దీన్‌లను, ఇరు రాష్ట్రాలకు చెందిన చెందిన 42 మంది లోక్‌సభ, 18 మంది రాజ్యసభ సభ్యులకు వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశారు. "జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వివిధ హో దాల్లో రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేశారు. ఆయన ఏ రాజకీయ పార్టీకీ సంబంధించిన వ్యక్తి కాదు. ఆయనకు అందరూ మద్దతు ఇవ్వాలి" అని కోరారు. ఆత్మప్రభోధానుసారం తనకు ఓటేయాలంటూ దేశంలోని ఎంపీలకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రాసిన లేఖను సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర నేతలు ఆవిష్కరించారు.

ఎన్నికను వదిలేసి పోతాననుకున్నారు

ఇదే కార్యక్రమంతోపాటు.. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్-ద-ప్రెస్'లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. "నేను సుప్రీంకోర్టు జడ్జిగా ఉన్నప్పుడు ఇచ్చిన తీర్పులపై విమర్శలు చేస్తే ఎందుకు వచ్చిన బాధ అనుకుని ఈ ఎన్నికను వదిలేసి పోతాననుకున్నారు. కానీ నేను ఆ సవాలును స్వీకరించాలని నిర్ణయించుకున్నాను" అని అమిత్‌షాను ఉద్దేశించి అన్నారు. సుప్రీంకోర్టు తీర్పులో తాను ఎక్కడైనా నక్సలిజాన్ని సమర్థించినట్లుగా ఉంటే.. శిరసు వంచుకుంటానన్నారు. సుప్రీంకోర్టు తీర్పును విమర్శించేప్పుడు ఆ తీర్పును చదివి మాట్లాడాలన్నారు. తనకంటే ముందు.. తర్వాత 11 మంది న్యాయమూర్తులు సల్వాజుడుంపై కేసును విచారించారని తెలిపారు. మరోవైపు, ఉపరాష్ట్రపతి ఎన్నికలో తన ప్రత్యర్థి ఎక్కడ ఉన్నాడో తెలియట్లేదని, ఎక్కడా కనపడట్లేదని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. తాను కాంగ్రెస్ అభ్యర్థిని కాదని, విపక్షాల అభ్యర్థినని.. ఓటు వేసే ముందు ఎంపీలు.. ఆలోచిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబును వీలైతే కలిసి మద్దతు కోరతానని చెప్పారు. పార్లమెంట్‌తోపాటు.. మీడియాపైనా అధికార పార్టీ హుకుం చలాయిస్తోందని, లోక్‌సభలో ప్రశ్నిస్తే.. "బైఠో.. బోహత్ హోగయా"అని హుంకరిస్తున్నారని, మీడియాను తాము చెప్పిందే రాసుకోవాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఎన్నికల సంఘం 'స్వేచ్ఛగా.. సజావుగా' వ్యవహరించేదని, నేడు అధికార పక్షానికి అనుకూలంగా మారిందని మండిపడ్డారు. బ్రిటిష్‌కాలంలో అన్నివర్గాలకు ఓటుహక్కు ఉండేది కాదని, ఇప్పుడు ఓట్ల తొలగింపుతో లబ్ధిపొందాలనిచూస్తున్నారని మండిపడ్డారు. "అలాంటప్పుడు బ్రిటీష్ సామ్రాజ్యంలో ఉంటే ఏమిటి? స్వతంత్ర దేశంలో ఉంటే ఏంటి?" అని ప్రశ్నించారు.

తెలంగాణలోకి మళ్లీ సీబీఐ

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం నిషేధించిన కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ రాష్ట్రంలోకి మళ్లీ అడుగుపెట్టనుంది. సీబీఐకి సాధారణ అనుమతిని రద్దు చేస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నంబరు 51 జారీ చేసింది. దీంతో సీబీఐ నేరుగా రాష్ట్రంలో కేసులు నమోదు చేసే అవకాశం లేకుండా పోయింది. తాజాగా, కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ కోసం ఈ కేసును సీబీఐకి అప్పగించాలని అసెంబ్లీలో ప్రకటించింది. ఇది సీబీఐకి రాష్ట్రంలోకి తిరిగి ప్రవేశించడానికి మార్గం సుగమం చేసింది. ఈ కేసు కోసం పాత జీవోను పూర్తిగా రద్దు చేస్తారా? లేక కేవలం ఈ ఒక్క కేసు కోసమే ప్రత్యేకంగా అనుమతి ఇస్తారా? అనే చర్చ మొదలైంది.

వర్షాలు, వరద నష్టంపై

2 రోజుల్లో సమగ్ర నివేదిక

- 4న నివేదికతో ఢిల్లీకి భట్టి విక్రమార్క నేతృత్వంలో బృందం
- చెరువుల మరమ్మతులు, సహాయక చర్యలు వేగవంతం
- సచివాలయంలో అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



హైదరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టంపై రెండ్రోజుల్లో నివేదిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మృతుల కుటుంబాలకు వెంటనే రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టంపై సచివాలయంలో సోమవారం సాయంత్రం సీఎం సమీక్ష నిర్వహించారు. వరద నష్టంపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరదల వల్ల తీవ్రంగా దెబ్బతిన్న జిల్లాలకు అత్యవసర పనుల కోసం రూ.10 కోట్లు, సాధారణ నష్టం వాటిల్లిన జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయనున్నట్లు సీఎం ఆదేశించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని సీఎం దృష్టికి వ్యవసాయ శాఖ అధికారులు తీసుకొచ్చారు. భారీ వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 257 చెరువులకు గండ్లు పడ్డాయని అధికారులు వివరించారు. అయితే వర్షాలు, వరదలతో జరిగిన నష్టంపై అన్ని శాఖలవారీగా నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. గత ఏడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లినప్పటికీ కేంద్రం నుంచి సరైన సాయం అందకపోవడంపై సీఎం ఆరా తీశారు. తాజా నష్టంపై నివేదిక, నిరుడు నష్టంపై ఇచ్చిన హామీని కేంద్రం నెరవేర్చకపోవడంపైనా నివేదికను రెండ్రోజులుగా ఇవ్వాలని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం 4న ఢిల్లీకి వెళ్లి ఈ రెండు నివేదికలను కేంద్ర మంత్రులకు అందజేస్తుందని తెలిపారు. ఇక భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటలకు వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. నీట మునిగిన విద్యుత్తు సబ్‌స్టేషన్ల స్థానంలో అధునాతన పరికరాలతో కొత్త సబ్‌స్టేషన్లను నిర్మించాలని ఆదేశించారు. కామారెడ్డి, ఆదిలాబాద్, సిరిసిల్ల, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో సీఎం మాట్లాడి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగానికి కావాల్సిన అధికారులు, సిబ్బందిని వెంటనే సర్దుబాటు చేయాలని సీఎస్‌ను ఆదేశించారు. ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు ఉన్నా నిబంధనల ప్రకారం వాటిని ఖర్చు చేయడంలో అలసత్వం చూపుతున్నారంటూ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో సంఘాలు ఉండేవని, ఈ సంఘాలకు సంబంధించి నిబంధనలు పరిశీలించి.. మంత్రి ఉత్తమ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మునిసిపాలిటీలు, జీహెచ్ఎంసీ, పంచాయతీరాజ్ పరిధిలో వీధి దీపాల నిర్వహణపై సమీక్షించి పరిష్కారాలతో రావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. చెంగిచర్ల, జియాగూడ, అంబర్‌పేటలోని స్లాటర్ హౌస్‌లల్లో హలాల్, జట్కా సక్రమంగా జరిగేలా చూడాలని, అధునాతన యంత్రాలు వినియోగించాలని సూచించారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, పశుసంవర్థక శాఖలు సమగ్ర నివేదికలను రెండు రోజుల్లో అందించాలని సూచించారు.

బీఆర్ఎస్ నిరసనల మధ్య 4 బిల్లులకు మండలి ఆమోదం

హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు కేసును ప్రభుత్వం సీబీఐ విచారణకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ శాసనమండలిలో ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు పెద్దఎత్తున నినాదాలు, నిరసనలు చేపట్టారు. ఈ నిరసనల మధ్యే నాలుగు బిల్లులకు మండలి ఆమోదం తెలిపింది. అనంతరం మండలిని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం ఉదయం మండలి సమావేశాలు ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు పి.సి.ఘోష్ కమిషన్ నివేదికపై చర్చించాలని డిమాండ్ చేస్తూ పోడియం వద్దకు దూసుకొచ్చారు. చైర్మన్ సుఖేందర్‌రెడ్డి వారిని తమ స్థానాల్లో కూర్చోవాలని సూచించారు. పోడియం వైపు రావద్దని, వారి స్థానాల్లో నిలచునే నిరసన తెలుపుకోవాలని సూచించినప్పటికీ వినిపించుకోకుండా బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ గందరగోళ పరిస్థితుల్లోనే బీసీ బిల్లుపై చైర్మన్ చర్చ ప్రారంభించగా బీఆర్ఎస్ సభ్యులు నినాదాల హోరు పెంచారు. ఈ నేపథ్యంలోనే పంచాయతీరాజ్, మునిసిపాలిటీ చట్టల సవరణ, అల్లోపతిక్ ప్రైవేటు వైద్య సంరక్షణ సంస్థల చట్టం బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది. ఒకవైపు బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనలు చేస్తుండగా మరోవైపు అధికార కాంగ్రెస్ సభ్యులు బీసీ రిజర్వేషన్ల బిల్లును అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రతివాదనకు దిగారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సభ్యులు కాళేశ్వరం నివేదిక ప్రతులను చింపి పోడియం వైపు విసిరేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ దశలో చైర్మన్ సుఖేందర్‌రెడ్డి బీఆర్ఎస్ సభ్యులను తీవ్రంగా మందలించారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును

ఆమోదించండి

(మొదటిపేజీ తరువాయి)

సవరించినట్లు తెలిపారు. ఈ మేరకు అధికార కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో అఖిలపక్ష నేతలు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. వీరిలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, సీపీఐ జాతీయ నేత కె.నారాయణ, ఆ పార్టీ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానందగౌడ్ కూడా ఉన్నారు. ఓవైపు కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొని ఉన్న నేపథ్యంలో.. అధికార పార్టీ నేతృత్వం వహించిన అఖిలపక్షంతో బీఆర్ఎస్ ప్రతినిధి గవర్నర్‌కు వద్దకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. గవర్నర్‌ను కలిసిన అనంతరం టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచుతామంటూ ఇచ్చిన హామీ మేరకు బిల్లు చేశామని, ఆ బిల్లును ఆమోదించాలని గవర్నర్‌ను కోరామని చెప్పారు. రాష్ట్రంలో 56.33 శాతం బీసీ జనాభా ఉందన్నారు. దాని ప్రకారమే వారికి రిజర్వేషన్లు కల్పించేందుకు నిబంధనలను ఎత్తివేస్తూ గతంలో ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చామని, తాజాగా సభలో బిల్లును తీసుకువచ్చామని తెలిపారు. కులగణన సర్వే ప్రకారమే బీసీలకు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల పెంపు కోసం బిల్లు తెచ్చామన్నారు. బీసీ సంఘాలు 42 శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని పట్టుబడుతున్నాయని, ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకునే అఖిలపక్షం గవర్నర్‌ను కలిసి బిల్లును ఆమోదించాలని కోరిందని అన్నారు.

ఒకటి, రెండు రోజుల్లో సీబీఐకి లేఖ

మీడియాతో చిట్ చాట్‌లో సీఎం రేవంత్

హైదరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై లోతైన విచారణ జరపాలని కోరుతూ ఒకటి, రెండు రోజుల్లో సీబీఐకి లేఖ రాస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఆ పని అధికారులు చేస్తారని, విచారణకు సీబీఐ ముందుకు రాగానే కేసును అప్పగిస్తామన్నారు. ఈ నిర్ణయంలో రాజకీయాలకు సంబంధం లేదని, ప్రాజెక్టు నిర్మాణంలో అంతర్ రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలూ భాగస్వామ్యం కావడం వల్లే సీబీఐకి అప్పగించాలని నిర్ణయించామన్నారు. భారత ప్రభుత్వానికి కేసును అప్పగిస్తున్నామని చెప్పారు. కేసు ఎఫ్ఐఆర్ అయ్యాక అందులో మనీ లాండరింగ్ జరిగిందని తేలినప్పుడు ఈడీ ఎంటరవుతుందన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం

కాళేశ్వరంపై ఘోష్ నివేదిక ప్రకారం తదుపరి విచారణ బాధ్యతలను సీబీఐకి అప్పగించేలా చర్యలకు ఉపక్రమించాలని నీటిపారుదలశాఖ ప్రభుత్వాన్ని కోరింది. శాసనసభలో తీసుకున్న నిర్ణయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నీటిపారుదలశాఖ సమాచారం ఇచ్చింది. శాసనసభలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా కేంద్ర హోంశాఖ కార్యదర్శికి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరఫున విజ్ఞప్తి వెళ్లాల్సి ఉంటుంది. దీనికన్నా ముందు ఫైలు ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరి, సీఎం సంతకం తర్వాత రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శికి వెళ్లనుంది. ఆ తర్వాత సీఎస్ కార్యాలయానికి చేరనుంది. అనంతరం కేంద్ర హోంశాఖకు చేరాల్సి ఉంటుంది. ఆ తర్వాత కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంటే సీబీఐ విచారణలో ముందుకు కదలనుంది.

2026 ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు

ఢిల్లీ ఆతిథ్యం

పారిస్: వచ్చే ఏడాది ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. 2026 ఆగస్టులో జరిగే ఈ మెగా టోర్నీకి వేదికగా ఢిల్లీని ఖరారు చేసినట్టు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ప్రకటించింది. ఆదివారం ఇక్కడ ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప్ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా బీడబ్ల్యూఎఫ్ చీఫ్ ఖున్‌యింగ్ పటామ.. భారత్‌కు ఆతిథ్యం దక్కిన విషయాన్ని వెల్లడించారు. ఈ మెగా ఈవెంట్ భారత్‌లో జరగనుండడం ఇది రెండోసారి. తొలిసారిగా 2009లో హైదరాబాద్‌లో టోర్నీ జరిగింది.



మహిళల వన్డే వరల్డ్ కప్ ప్రైజ్‌మనీ భారీగా పెంపు

కప్పు కొడితే రూ. 39.55 కోట్లు

దుబాయ్: మహిళల వన్డే ప్రపంచ కప్ విజేత ప్రైజ్‌మనీని ఐసీసీ ఊహించని మొత్తానికి పెంచింది. చాంపియన్‌గా నిలిచే జట్టు ఏకంగా రూ. 39.55 కోట్లు అందుకోనుంది. గత మెగా టోర్నీలో విజేతకు రూ. 11.65 కోట్లు దక్కగా.. అంతకు మూడు రెట్లకు పైగా మొత్తం ఈసారి చాంపియన్‌కు దక్కనుంది. ఇక, రన్నరప్‌గా నిలిచే జట్టుకు రూ. 19.77 కోట్లు (గతసారి రూ. 5.30 కోట్లు) లభించనున్నాయి. భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న వన్డే వరల్డ్ కప్ ఈనెల 30న ప్రారంభం కానుంది. ఎనిమిది జట్లు మెగా టోర్నమెంట్ బరిలో దిగుతున్నాయి. చాంపియన్‌షిప్ ప్రైజ్‌మనీ దాదాపు రూ. 122.5 కోట్లు కావడం విశేషం. కిందటి టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 31 కోట్ల కంటే ఇది 297 శాతం అధికం. ఇంకా.. 2023 పురుషుల వన్డే ప్రపంచ కప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 88.26 కోట్లకన్నా.. మహిళల మెగా టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ ఎంతో ఎక్కువ. అలాగే పురుషుల టోర్నీ విజేత జట్టుకు దక్కింది రూ. 35.31 కోట్లే.

ప్రైజ్‌మనీ ఇలా..

- విజేతకు- రూ.39.55 కోట్లు ● రన్నరప్‌నకు - రూ. 19.77 కోట్లు
- సెమీఫైనలిస్టులకు - రూ.9.89 కోట్లు చొప్పున
- ఐదు, ఆరు స్థానాల జట్లకు - రూ.6.16 కోట్లు చొప్పున
- ఏడు, ఎనిమిది స్థానాల జట్లకు - రూ. 2.46 కోట్లు చొప్పున
- గ్రూప్ దశలో ఒక్కో విజయానికి - రూ. 30.29 లక్షలు
- పాల్గొన్న ప్రతి జట్టుకు- అదనంగా రూ. 2.20 కోట్లు

గ్రూప్ టాపర్.. భారత్

- 15-0తో కజకిస్థాన్‌పై ఘన విజయం
- సూపర్-4కు చైనా, మలేసియా, కొరియా
- ఆసియా కప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ హాకీలో గ్రూప్ దశను భారత్ ఘనంగా ముగించింది. ఈపాటికే సూపర్-4 బెర్త్‌ను ఖరారు చేసుకొన్న భారత్.. పూల్-ఎలో సోమవారం ఏకపక్షంగా సాగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 15-0తో కజకిస్థాన్‌ను చిత్తు చేసింది. అభిషేక్ 4 గోల్స్‌తో అదరగొట్టగా, సుఖ్‌జీత్, జుగ్‌రాజ్ చెరో 3 గోల్స్ నమోదు చేశారు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ 9 పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ఇదే గ్రూప్‌లో చైనా, జపాన్ మధ్య మ్యాచ్ 2-2తో డ్రా అయింది. ఇరుజట్లూ చెరో 4 పాయింట్లతో సమంగా నిలిచినా.. మెరుగైన గోల్స్ తేడాతో చైనా రెండో స్థానంతో సూపర్-4కు చేరింది. పూల్-బి నుంచి మలేసియా, కొరియా సూపర్-4లో ప్రవేశించాయి. సోమవారం జరిగిన తమ ఆఖరి మ్యాచ్‌లో మలేసియా 15-0తో చైనీస్ తైపీపై, కొరియా 5-1తో బంగ్లాదేశ్‌పై గెలిచాయి. 9 పాయింట్లతో మలేసియా గ్రూప్-బి టాపర్‌గా నిలవగా.. రెండు మ్యాచ్‌లు గెలిచిన కొరియా 6 పాయింట్లతో రెండో స్థానం దక్కించుకొంది. బుధవారం నుంచి రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే సూపర్-4 తొలి మ్యాచ్‌లో కొరియాతో భారత్ తలపడనుంది.

దుబాయ్ లీగ్‌లో అశ్విన్?



న్యూఢిల్లీ: తాజాగా ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించిన టీమిండియా మాజీ స్పిన్నర్ అశ్విన్ అంతర్జాతీయ లీగ్‌లు ఆడేందుకు సిద్ధమవుతున్నాడు. యూఏఈ నిర్వహించే ఇంటర్నేషనల్ లీగ్ టీ20 (ఐఎల్‌టీ20) వేలంలో తనపేరును నమోదు చేసుకొనేందుకు నిర్వాహకులతో చర్చలు జరుపుతున్నట్టు అశ్విన్ తెలిపాడు. ఆటగాళ్ల రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 10 డెడ్‌లైన్. ఇంతకుముందు ఈ లీగ్‌లో డ్రాఫ్టింగ్ విధానం ద్వారా ఆటగాళ్లను ఎంపిక చేసుకోగా.. ఈ ఏడాది వేలం ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఈనెల 30న దుబాయ్‌లో వేలం జరగనుంది. లీగ్‌ను డిసెంబరు 2 నుంచి జనవరి 4 వరకు షెడ్యూల్ చేశారు.

ప్రజ్ఞానంద @ 4

చెస్ వరల్డ్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద కొత్త మైలురాయిని చేరుకున్నాడు. కెరీర్‌లో అత్యధికంగా 2785 ఎలో రేటింగ్‌కు చేరాడు. దాంతో ఫిడే క్లాసికల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అతడు అత్యుత్తమంగా నాలుగో స్థానానికి చేరుకున్నాడు. తద్వారా అత్యుత్తమ ర్యాంక్ సాధించిన భారత ఆటగాడిగా మరో ఘనతనూ ప్రజ్ఞానంద అందుకున్నాడు. సింక్వెఫీల్డ్ కప్‌లో రన్నరప్‌గా నిలవడంతో ప్రజ్ఞానందకు ఆరు రేటింగ్ పాయింట్లు లభించాయి. కార్ల్‌సన్ టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా, అమెరికన్ గ్రాండ్‌మాస్టర్లు నకమురా, కరువాన రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. తెలంగాణ జీఎం అర్జున్ ఐదు, వరల్డ్ చాంపియన్ గుకేష్ ఆరో ర్యాంక్ దక్కించుకున్నారు.

ఇరాన్ చేతిలో భారత్ ఓటమి

కాఫా నేషన్స్ కప్ ఫుట్‌బాల్

హిసార్ (తజకిస్థాన్): కాఫా నేషన్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను విజయంతో ప్రారంభించిన భారత జట్టు.. తమ రెండో మ్యాచ్‌లో మాత్రం తడబడింది. గ్రూప్-బిలో భాగంగా సోమవారం జరిగిన పోరులో 133వ ర్యాంకర్ భారత్ 0-3తో 20వ ర్యాంకర్ ఇరాన్ చేతిలో పరాజయం పాలైంది. అమిర్‌హూస్సేన్, అలీ, మెహ్దీ తరెమి తలా గోల్ చేశారు. తమకంటే ఎన్నో రెట్లు మెరుగైన పటిష్ఠ ఇరాన్‌కు భారత్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కజకిస్థాన్‌ను భారత్ ఓడించిన సంగతి తెలిసిందే. గ్రూప్‌లో తమ చివరి మ్యాచ్‌ను భారత్ ఈనెల 4న అఫ్ఘానిస్థాన్‌తో ఆడనుంది.

మరోసారి క్షమాపణ కోరుతున్నా

చెంపదెబ్బ వీడియోపై హర్భజన్

న్యూఢిల్లీ: చెంపదెబ్బ వివాదాన్ని మళ్లీ తెరపైకి తేవడం ఎందుకంటూ మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశ్నించాడు. ఐపీఎల్ తొలి సీజన్‌లో శ్రీశాంత్ చెంపపై భజ్జీ కొట్టిన వీడియోను ఇటీవల లీగ్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ విడుదల చేసిన విషయం తెలిసిందే. 'అందరూ మర్చిపోయిన ఆ విషయాన్ని గుర్తుకుతెస్తున్నారు. దీని వెనుక వారికేదైనా స్వార్థపూరిత ఉద్దేశం ఉండొచ్చు. అప్పటి నా ప్రవర్తనపై ఎన్నోసార్లు క్షమాపణ చెప్పా. ఇప్పటికీ బాధగానే ఉంది. వినాయకుడి సాక్షిగా మరోసారి క్షమించమని కోరుతున్నా' అని భజ్జీ తెలిపాడు.

రిబకినాకు షాక్

క్వార్టర్స్‌కు సబలెంక, స్వియటెక్, అల్కారజ్
యూఎస్ ఓపెన్


వొండ్రుసోవా


రిబకినా

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో మరో సీడెడ్ క్రీడాకారిణి ఇంటిబాట పట్టింది. వింబుల్డన్ మాజీ చాంపియన్, 9వ సీడ్ ఎలెనా రిబకినాకు నాలుగో రౌండ్లో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి మార్కెటా వొండ్రుసోవా షాకిచ్చింది. వొండ్రుసోవా 4-6, 7-5తో రిబకినా (కజకిస్థాన్)ను కంగుతినిపించి యూఎస్ ఓపెన్‌లో రెండోసారి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక, టాప్ సీడ్ సబలెంక (బెలారస్) 6-1, 6-4తో క్రిస్టియానా బుక్సా (స్పెయిన్)ను, రెండో సీడ్ స్వియటెక్ 6-3, 6-1తో ఎకటరీనా (రష్యా)ను ఓడించి క్వార్టర్స్ చేరారు. బార్బరా క్రెజికోవా (చెక్) 1-6, 7-6(13), 6-3తో టేలర్ టౌన్‌సెండ్‌పై అద్భుత విజయం సాధించింది.

నొవాక్ 64వసారి: పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్, సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, టేలర్ ఫ్రిట్జ్ ముందంజ వేశారు. ఏడో సీడ్ జొకోవిచ్ 6-3, 6-3, 6-2తో జాన్ లెన్నార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)పై వరుస గేముల్లో నెగ్గి రికార్డుస్థాయిలో 64వసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. అల్కారజ్ 7-6(3), 6-3, 6-4తో ఫ్రెంచ్ ప్లేయర్ ఆర్థర్ రెండర్‌కెచ్‌పై సునాయాసంగా నెగ్గాడు. ఈ క్రమంలో ఓపెన్ ఎరాలో 13సార్లు గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్ చేరిన పిన్నవయస్కుడిగా 22 ఏళ్ల అల్కారజ్ రికార్డులకెక్కాడు. అమెరికా ప్లేయర్ టేలర్ ఫ్రిట్జ్ 6-4, 6-3, 6-3తో 21వ సీడ్ థామస్ మచాక్ (చెక్)పై, అలెక్స్ డి మినార్ 6-3, 6-2, 6-2తో లియాండ్ర రైడీపై గెలిచారు. 15వ సీడ్ రుబ్లేవ్ 5-7, 3-6, 4-6తో ఫెలిక్స్ అగర్ అల్‌అస్సిమీ చేతిలో ఓడాడు. డబుల్స్ రెండో రౌండ్‌లో ఇండో-ఆసీస్ జోడీ యుకీ భాంబ్రి-మైకేల్ వీనస్ 6-1, 7-5తో ఎస్కోబార్-మిగ్వెల్ వరేలాను ఓడించింది.

మాయ ముందంజ



జూనియర్స్ సింగిల్స్‌లో భారత ప్లేయర్ మాయా రాజేశ్వరన్ రేవతి రెండో రౌండ్‌కు చేరుకొంది. బాలికల విభాగం మొదటి రౌండ్‌లో మాయ 7-6(5), 6-3తో జాంగ్ క్వియాన్ (చైనా)పై గెలిచింది. కోయంబత్తూరుకు చెందిన మాయ స్పెయిన్‌లోని రఫెల్ నడాల్ అకాడమీలో శిక్షణ తీసుకొంటోంది. బాలుర విభాగం తొలి రౌండ్‌లో హితేష్ 2-6, 4-6తో జెర్రీడ్ గెయిన్స్ (అమెరికా) చేతిలో, క్రిష్ త్యాగి 3-6, 1-6తో లుడ్విగ్ హెడే (స్పెయిన్) చేతిలో ఓడారు.

పైరేట్స్‌పై యోధాస్ గెలుపు

ప్రొ కబడ్డీ లీగ్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన తొలి మ్యాచ్‌లో యూపీ యోధాస్ 34-31 స్కోరుతో పట్నా పైరేట్స్‌ను ఓడించింది. మ్యాచ్ ప్రథమార్ధంలో ఆరు పాయింట్ల ఆధిక్యంతో ఉన్న పైరేట్స్.. ఆ తర్వాత రైడింగ్‌లో వెనుకంజలో నిలిచింది. ద్వితీయార్ధంలో అద్భుతంగా పుంజుకున్న యూపీ యోధాస్‌లో రైడర్ భవానీ రాజ్‌పుత్ వరుసగా పాయింట్లు రాబట్టి అదరగొట్టాడు. యూపీ జట్టులో గగన్ గౌడ ఏడు పాయింట్లతో టాప్ స్కోరర్‌గా నిలవగా, మరో రైడర్ భవానీ రాజ్‌పుత్ 5, డిఫెండర్లు సుమిత్ 5, అన్ను సింగ్ 5 పాయింట్లు రాబట్టారు. పైరేట్స్‌లో అయాన్ 9, మణిందర్‌సింగ్ 7 పాయింట్లు సాధించారు. రెండో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 41-19 స్కోరుతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుగా ఓడించింది.

టెస్టులకు ఓవర్టన్ విరామం

లండన్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ ముందు ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. సుదీర్ఘ ఫార్మాట్ నుంచి నిరవధిక విరామం తీసుకుంటున్నట్టు ప్రకటించాడు. ఇకపై పరిమిత ఓవర్ల ఆటపైనే దృష్టి సారిస్తానని స్పష్టం చేశాడు. మూడేళ్ల బ్రేక్ తర్వాత అతను ఇటీవలి అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో చోటు దక్కించుకుని ఆఖరి టెస్టు ఆడాడు. 'ఇకపై మూడు ఫార్మాట్లలో కొనసాగలేను. శారీరకంగా, మానసికంగా అసాధ్యంగా అనిపిస్తోంది. అందుకే టెస్టుల నుంచి విరామం తీసుకుంటున్నా. ఇక నుంచి నా దృష్టంతా వైట్ బాల్ క్రికెట్‌పైనే' అని ఓవర్టన్ పేర్కొన్నాడు. 2022లో టెస్టు అరంగేట్రం చేసిన ఓవర్టన్ రెండు టెస్టుల్లో నాలుగు వికెట్లు పడగొట్టాడు.

బిజినెస్

రూపాయికి సుంకాల పోటు

సరికొత్త ఆల్‌టైం కనిష్ఠానికి పతనం • రూ.88.10కి చేరిక

త్వరలో రూ.90కి చేరే అవకాశం

ముంబై: ట్రంప్ సుంకాల ధాటికి మన కరెన్సీ విలువ వేగంగా కరుగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. మరో పైసా నష్టపోయి రూ.88.10 వద్ద ముగిసింది. రూ.88.33 వద్ద ఆల్‌టైమ్ ఇంట్రాడే కనిష్ఠాన్ని సైతం నమోదు చేసింది. స్టాక్ మార్కెట్లు లాభాల్లో పయనించినప్పటికీ.. ట్రంప్ భారత్‌పై విధించిన 50 శాతం సుంకాల ప్రభావంతో పాటు అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న అనిశ్చితి, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమైంది. మన కరెన్సీకి మద్దతుగా ఫారెక్స్ మార్కెట్ కార్యకలాపాల్లో ఆర్‌బీఐ జోక్యం చేసుకునేందుకు అవకాశాలున్నప్పటికీ, అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో రూపాయిపై ఒత్తిడి కొనసాగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మున్ముందు నెలల్లో డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.90కి చేరే అవకాశాల్లేకపోలేవని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థికవేత్త అదితి గుప్తా అన్నారు.

సూచీలకు జీడీపీ, జీఎస్‌టీ జోష్

సెన్సెక్స్ 555 పాయింట్లు జంప్

ముంబై: గత వారం వరుసగా మూడు రోజులు నష్టాలు చవిచూసిన భారత స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మళ్లీ లాభాల బాటపట్టాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 554.84 పాయింట్లు ఎగిసి 80,364.49 వద్దకు చేరగా.. నిఫ్టీ 198.20 పాయింట్ల వృద్ధితో 24,625.05 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.2 లక్షల కోట్లు పెరిగి రూ.448.85 లక్షల కోట్లకు (5.09 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. ఐటీ, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగ షేర్లలో వాల్యూ బైయింగ్ మార్కెట్ ర్యాలీకి దోహదపడింది. జూన్‌తో ముగిసిన క్వార్టర్‌లో జీడీపీ వృద్ధి రేటు 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 7.8 శాతానికి పుంజుకోవడంతో పాటు ఈవారంలో జరగనున్న జీఎస్‌టీ మండలి సమావేశంలో ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల తగ్గింపునకు ఆమోదం లభించవచ్చని.. దీంతో ఆర్థిక వ్యవస్థలో వినియోగం మరింత పెరగనుందన్న అంచనాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

పసిడి సరికొత్త రికార్డు

10 గ్రాముల ధర రూ.1,05,670

బంగారం వరుసగా ఆరో రోజు ఎగబాకి సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరింది. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,05,670కి చేరింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.800 పెరుగుదలతో కొత్త ఆల్‌టైమ్ రికార్డు స్థాయి రూ.1,04,800కు ఎగబాకింది. కిలో వెండి సైతం రూ.1,000 పెరిగి కొత్త గరిష్ఠ స్థాయి రూ.1.26 లక్షలకు చేరింది.

జీఎస్‌టీ వసూళ్లు రూ. 1.86 లక్షల కోట్లు

ఆగస్టులో 6.5 శాతం పెరుగుదల

ఏపీలో 21%, తెలంగాణలో 12% వృద్ధి



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆగస్టులో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.5 శాతం వృద్ధితో రూ.1.86 లక్షల కోట్లు దాటాయి. దేశీయంగా వ్యాపార లావాదేవీలు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. పండగ సీజన్ కూడా ప్రారంభమవడంతో మున్ముందు నెలల్లో జీఎస్‌టీ వసూళ్లు మరింత పెరిగే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ జూలైలో నమోదైన రూ.1.96 లక్షల కోట్ల ఆదాయంతో పోలిస్తే మాత్రం గత నెలలో వసూళ్లు కాస్త తగ్గాయి. మరిన్ని విషయాలు..

- ఆగస్టులో దేశీయ ఆర్థిక లావాదేవీల నుంచి వసూలైన స్థూల పన్ను ఆదాయం వార్షిక ప్రాతిపదికన 9.6 శాతం పెరిగి రూ.1.37 లక్షల కోట్లుగా నమోదైంది. దిగుమతుల నుంచి పన్ను వసూళ్లు మాత్రం 1.2 శాతం తగ్గి రూ.49,354 కోట్లకు పరిమితం అయ్యాయి.
- ఆగస్టులో జీఎస్‌టీ రిఫండ్లు వార్షిక ప్రాతిపదికన 20 శాతం తగ్గి రూ.19,359 కోట్లుగా నమోదయ్యాయి. అందులో ఎగుమతులకు సంబంధించిన రిఫండ్లు రూ.8,346 కోట్లకు తగ్గడం సుంకాల ప్రభావానికి స్పష్టమైన సంకేతమని ఈవై ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ అన్నారు.
- రిఫండ్ల అనంతరం జీఎస్‌టీ నికర ఆదాయం రూ.1.67 లక్షల కోట్లుగా ఉంది. 2024 ఆగస్టులో నమోదైన నికర ఆదాయంతో పోలిస్తే 10.7 శాతం అధికం ఇది.
- పండగ సీజన్‌లో డిమాండ్ వృద్ధి నవంబరు వరకు కొనసాగనుందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి అన్నారు. అయితే, ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో మాత్రం వసూళ్లు కాస్త తగ్గుముఖం పట్టవచ్చన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో వసూళ్లు

- ఆగస్టు నెలలో ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 21 శాతం పెరిగి రూ.3,989 కోట్లకు చేరగా.. తెలంగాణలో వసూళ్లు 12 శాతం వృద్ధితో రూ.5,103 కోట్లకు పెరిగాయి.

ఆగస్టులో 'ఆటో'కు నిరాశ

న్యూఢిల్లీ: ఆగస్టు నెలలో ప్యాసింజర్ వాహన కంపెనీల టోకు విక్రయాలు తగ్గాయి. దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకీతో పాటు మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ అమ్మకాల్లో క్షీణత నమోదైంది. ఈ నెలలో వాహనాలపై జీఎస్‌టీ రేట్లు గణనీయంగా తగ్గవచ్చన్న ఆశలతో కస్టమర్లు తమ కొనుగోళ్లను వాయిదా వేసుకోవడం ఇందుకు ప్రధాన కారణమైంది. మారుతి సుజుకీ దేశీయ టోకు విక్రయాలు వార్షిక ప్రాతిపదికన 8 శాతం తగ్గగా.. హ్యుండయ్ మోటార్స్ నుంచి డీలర్లకు సరఫరాలు 11 శాతం తగ్గాయి. మహీంద్రా సేల్స్ 9 శాతం, టాటా మోటార్స్ అమ్మకాలు 7 శాతం క్షీణించాయి. టయోటా విక్రయాలు మాత్రం 2 శాతం పెరిగాయి. ద్విచక్ర వాహనాల విభాగంలో బజాజ్ ఆటో దేశీయ టోకు విక్రయాలు 12 శాతం తగ్గగా.. టీవీఎస్ మోటార్ సేల్స్ 28 శాతం పెరిగాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు 57 శాతం పుంజుకున్నాయి.

భారత రిటైల్ బ్యాంకింగ్‌కు డాయిష్ బ్యాంక్ గుడ్‌బై

ఆస్తుల విక్రయానికి బిడ్ల ఆహ్వానం

న్యూఢిల్లీ: భారత్‌లో రిటైల్ బ్యాంకింగ్ ఆస్తులను విక్రయించాలని జర్మనీకి చెందిన డాయిష్ బ్యాంక్ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ ఆస్తుల కొనుగోలుకు ఆసక్తి కలిగిన దేశీయ, అంతర్జాతీయ రుణదాతల నుంచి బిడ్లను కూడా ఆహ్వానించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. డాయిష్ బ్యాంక్ మన దేశంలో 17 శాఖల ద్వారా రిటైల్ బ్యాంకింగ్ సేవలందిస్తోంది. రిటైల్ బ్యాంకింగ్ విభాగ లాభాలను పెంచేందుకు ఈ ఏడాది అంతర్జాతీయంగా దాదాపు 2,000 ఉద్యోగాలకు కోత పెట్టడంతో పాటు బ్రాంచీల సంఖ్యను సైతం గణనీయంగా తగ్గించుకోనున్నట్లు డాయిష్ బ్యాంక్ సీఈఓ క్రిస్టియన్ సీవింగ్ ఈ మార్చిలో ప్రకటించారు. ఆ ప్రణాళికలో భాగంగానే భారత్ రిటైల్ బ్యాంకింగ్ నుంచి పూర్తిగా నిష్క్రమించాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

భారత్‌లో ఓపెన్ ఏఐ డేటా సెంటర్

న్యూఢిల్లీ: ఓపెన్ ఏఐ తన స్టార్‌గేట్ బ్రాండెడ్ కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక సదుపాయాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా భారత్‌లో ఒక గిగావాట్ సామర్థ్యంతో భారీ డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ నెలలో భారత పర్యటనకు వచ్చే ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ ఈ కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేసేది ప్రకటిస్తారని భావిస్తున్నారు. ఓపెన్ ఏఐకి ప్రస్తుతం అమెరికా తర్వాత భారత్ అతిపెద్ద మార్కెట్.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2 తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	570
వరంగల్	532	గోదావరి	565
చిత్తూరు	578	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	95	విజయవాడ	122
వరంగల్	95	గుంటూరు	115
కరీంనగర్	95	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	95	చిత్తూరు	100
కర్నూలు	95	నెల్లూరు	105
విశాఖపట్నం	126	అనంతపురం	105
గోదావరి	122		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,05,880 ▲	97,050 ▲	1,36,000 ▲
విజయవాడ	1,07,500 ▲	1,01,000 ▲	1,26,150 ▲
విశాఖపట్నం	1,07,430 ▲	97,050 ▲	1,36,000 ▲
రాజమండ్రి	1,05,870 ▲	97,050 ▲	1,26,300 ▲
ప్రొద్దుటూరు	1,06,250 ▲	97,750 ▲	1,26,000 ▲
ముంబై	1,04,493 ▲	95,716 ▲	1,22,800 ▲

విస్తరణ బాటలో బొండాడ ఇంజనీరింగ్

- రెండేళ్లలో డేటా సెంటర్ల వ్యాపారంలోకి..
- 2030 నాటికి 100 కోట్ల డాలర్ల టర్నోవర్ లక్ష్యం
- సంస్థ సీఎండీ బొండాడ రాఘవేంద్ర రావు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బొండాడ ఇంజనీరింగ్ డేటా సెంటర్ల వ్యాపారంలోకి అడుగుపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. వచ్చే రెండేళ్ల కాలంలో ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టాలని చూస్తున్నట్లు సంస్థ సీఎండీ బొండాడ రాఘవేంద్ర రావు వెల్లడించారు. హైదరాబాద్ సహా అనుకూలమైన వనరులు ఉన్న నగరాల్లో ఈ సెంటర్లను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా సంస్థ ఈ మధ్యనే రక్షణ రంగ ఉత్పత్తుల విభాగంలోకి అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. మిస్సైల్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి సేవలను ఈ విభాగం ద్వారా అందించనున్నట్లు రావు చెప్పారు. ఇందుకోసం రక్షణ రంగంలోని ప్రభుత్వ రంగ సంస్థలతో చర్చలు సాగిస్తున్నట్లు రావు తెలిపారు. రెన్యువబుల్ ఎనర్జీ, టెలికాం రంగాల్లో కంపెనీ కీలకంగా ఉందన్నారు.

ఈ ఏడాది మరో రూ.2,700 కోట్ల ఆర్డర్లు: ప్రస్తుతం బొండాడ ఇంజనీరింగ్ ఆర్డర్ బుక్ రూ.5,400 కోట్లుగా ఉందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కొత్తగా రూ.2,700 కోట్ల ఆర్డర్లు దక్కించుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు రాఘవేంద్ర రావు వెల్లడించారు. కాగా గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయం రూ.1,571 కోట్లుగా ఉండగా నికర లాభం రూ.120 కోట్లుందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆదాయంలో 80 శాతం, లాభంలో 60-70 శాతం వృద్ధిని నమోదు చేయవచ్చని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. 2030 నాటికి సంస్థ మొత్తం ఆదాయాన్ని 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.8,800 కోట్లు)కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రావు తెలిపారు. సోలార్ ఐపీపీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రూ.9000 కోట్ల విలువైన ప్రాజెక్టును దక్కించుకున్నట్లు ఆయన చెప్పారు. అలాగే తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ నుంచి 400 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) కాంట్రాక్టును అందుకున్నట్లు రావు తెలిపారు.

మార్కెట్లోకి సామ్‌సంగ్ గెలాక్సీ ఏ17 5జీ స్మార్ట్‌ఫోన్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సామ్‌సంగ్ ఇండియా మార్కెట్లోకి గెలాక్సీ ఏ17 5జీ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకువచ్చింది. సోమవారం నాడిక్కడ కంపెనీ ఎంఎక్స్ బిజినెస్, వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య బబ్బర్ ఈ ఫోన్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగల సీజన్‌ను పురస్కరించుకుని గెలాక్సీ ఏ సిరీస్ విభాగంలో ఏ17ను అత్యుత్తమ ఏఐ ఫీచర్లు, సెక్యూరిటీ ఫీచర్లు, అందుబాటు ధరల్లో తీసుకువచ్చినట్లు చెప్పారు. 50 ఎంపీ ప్రధాన కెమెరా, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ విక్టస్, 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ అమోలెడ్ డిస్‌ప్లే, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఈ స్మార్ట్‌ఫోన్ ప్రత్యేకతలని ఆయన తెలిపారు. 6జీబీ ప్లస్ 128 జీబీ మెమరీ, 8జీబీ ప్లస్ 128 జీబీ మెమరీ, 8జీబీ ప్లస్ 256 జీబీ మెమరీతో అందుబాటులో ఉండనున్న గెలాక్సీ ఏ17 5జీ స్మార్ట్‌ఫోన్ ధరలు వరుసగా రూ.18,999, రూ.20,499, రూ.23,499గా ఉన్నాయి. 2019లో గెలాక్సీ ఏ సిరీస్ ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకురాగా ఈ ఏడాది జూన్ నాటికి మొత్తం 9.6 కోట్ల ఫోన్లను విక్రయించినట్లు బబ్బర్ తెలిపారు. డిసెంబరు నాటికి వీటి విక్రయాలు 10 కోట్లకు చేరుకుంటాయని అంచనా వేస్తున్నట్లు బబ్బర్ వెల్లడించారు.

కలిసిరానున్న విస్తరణ

పెరగనున్న ఆదాయం : కిమ్స్ హాస్పిటల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహారాష్ట్రలోని థానే, బెంగళూరుల్లో ఏర్పాటు చేసిన కొత్త హాస్పిటల్స్‌తో కిమ్స్ హాస్పిటల్ ఆదాయం మరింత పెరగనుంది. ప్రస్తుతం ఒక్కో పడక (బెడ్)పై రూ.45,000గా ఉన్న సగటు ఆదాయం (ఏఆర్‌పీఓబీ) త్వరలోనే రూ.55,000కు చేరే అవకాశం ఉందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎఫ్ఓ సచిన్ అశోక్ సాల్వీ ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. థానేలో ఈ ఏడాది మే నెలలో ప్రారంభించిన కిమ్స్ హాస్పిటల్ ద్వారా ఒక్కో బెడ్‌పై సగటున రూ.55,000 నుంచి రూ.60,000 వరకు ఆదాయం లభిస్తోంది. గత నెల బెంగళూరులో ప్రారంభమైన హాస్పిటల్ నుంచి ఒక్కో పడకపై సగటున రూ.75,000 వరకు ఆదాయం లభిస్తోందని సాల్వీ తెలిపారు. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఒక్కో బెడ్‌పై కంపెనీకి వచ్చే సగటు ఆదాయం ప్రస్తుత రూ.45,000 నుంచి రూ.55,000కు చేరుతుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఈ రెండు హాస్పిటల్స్ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ స్థూల లాభం రూ.60 కోట్ల నుంచి రూ.75 కోట్ల మేర పెరిగే అవకాశం ఉందని సాల్వీ చెప్పారు.

ఆరోగ్యానికి తీపి కబురు

తెలంగాణలో ప్రపంచంలోనే అతిపెద్ద ఎఫ్‌వోఎస్ ప్లాంట్

- నిజామాబాద్ సమీపంలో 2027 కల్లా నిర్మాణం పూర్తి
- బీఐఆర్ఏసీ సహకారంతో నిర్మిస్తున్న రివిలేషన్స్ బయోటెక్
- చక్కెరకు ప్రత్యామ్నాయంగా ఎఫ్‌వోఎస్ వినియోగం
- ఏడాదికి 20 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం.. 700 మందికి ఉద్యోగావకాశాలు



హైదరాబాద్/నిజామాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భారత బయో టెక్నాలజీ, ఆహార ప్రాసెసింగ్ రంగానికి ఊతమిచ్చేలా రివిలేషన్స్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణలోని నిజామాబాద్ సమీపంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్రక్టో ఒలిగో శాకరాయిడ్స్(ఎఫ్‌వోఎస్) తయారీ యూనిట్ ఏర్పాటవుతోంది. సంవత్సరానికి 20 వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బీఐఆర్ఏసీ) ఆర్థిక సహాయం అందిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి విశేష సహకారం అందిస్తోంది. రివిలేషన్స్ బయోటెక్, బీఐఆర్ఏసీ ఇప్పటికే దీనికి సంబంధించిన ఒప్పందం కుదుర్చుకున్నాయి. నిజామాబాద్ మెగా ఫుడ్ పార్క్‌లో నిర్మాణంలో ఉన్న ఈ యూనిట్ ఆగస్టు 2027 నాటికి పూర్తి కానుంది. దీని ద్వారా 200 మందికి పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు, 500 మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్టు భారత ప్రభుత్వ 'మేక్ ఇన్‌ఇండియా'లో భాగంగా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం మాత్రమే కాకుండా, భారత్‌ను ప్రపంచ స్థాయి ఎఫ్‌వోఎస్ ఎగుమతిదారుగా నిలపడం లక్ష్యంగా పెట్టుకుంది.

నిజామాబాదే ఎందుకు?

"భారతదేశం ప్రస్తుతం మధుమేహ వ్యాధి విజృంభణతో ఇబ్బంది పడుతోంది. చక్కెరకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయమైన ఎఫ్‌వోఎస్‌ను ఉపయోగించడం వల్ల ఈ సమస్యకు కొంతమేర పరిష్కారం లభిస్తుంది. ఎఫ్‌వోఎస్ తయారీకి చక్కెర ఏకైక ప్రధాన ముడిపదార్థం. తెలంగాణలోని నిజామాబాద్ ఒక ప్రధాన చక్కెర ఉత్పత్తి కేంద్రం కావడంతో, ఇక్కడ ఎఫ్‌వోఎస్ ప్లాంట్ ఏర్పాటు కావడం ద్వారా రాష్ట్రంలోని చెరుకు సాగు దీర్ఘకాలిక స్థిరత్వానికి తోడ్పడుతుంది" అని రివిలేషన్స్ బయోటెక్ ప్రతినిధి పేర్కొన్నారు. ఎఫ్‌వోఎస్ ఒక సహజ ప్రీబయాటిక్. ఇది న్యూట్రాసూటికల్స్ ఫంక్షనల్ బేవరేజెస్ వంటి వాటిలో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఇది జీర్ణాశయ ఆరోగ్యానికి మేలు చేస్తుందని శాస్త్రీయంగా రుజువైంది. రివిలేషన్స్ బయోటెక్ ఎన్నో సంవత్సరాల పాటు పరిశోధనలు చేసి వినూత్న పర్యావరణహితమైన తయారీ పద్ధతిని అభివృద్ధి చేసింది. దీని ద్వారా ఎఫ్‌వోఎస్‌ను అత్యంత వేగంగా, పర్యావరణానికి అనుకూలంగా ఉత్పత్తి చేయడం సాధ్యమైంది. ఇప్పటికే సంస్థ స్వీట్ స్పాట్ అనే బ్రాండ్ పేరుతో చక్కెరకు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా రిటైల్ వినియోగదారులకు ఎఫ్‌వోఎస్‌ను విడుదల చేసింది. ఈ ఉత్పత్తి ఆరోగ్యంపై దృష్టి పెట్టే వినియోగదారుల్లో మంచి ఆదరణ పొందింది. "ఈ యూనిట్ భారత బయోటెక్నాలజీ ప్రయాణంలో ఒక చారిత్రక మైలురాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఎఫ్‌వోఎస్ ప్లాంట్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడం ద్వారా దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయడమే కాకుండా, భారతదేశాన్ని ప్రపంచ న్యూట్రాస్యూటికల్ రంగంలో ప్రముఖ స్థానంలో నిలుపుతుంది." అని రివిలేషన్స్ బయోటెక్ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు.



వ్యూహాత్మకమా.. తప్పిదమా?

- కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగింతపై రాజకీయ వర్గాల్లో చర్చ
- ఇది పక్కా వ్యూహమే అంటున్న కాంగ్రెస్ పార్టీ వర్గాలు
- లోక్‌సభ ఎన్నికల కోసమే తీసుకున్న నిర్ణయమని ప్రచారం
- విచారణ జాప్యమైతే బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటేనని స్పష్టం
- బీజేపీ తెగేదాకా లాగితే.. కొందరు నేతల్లో ఆందోళన

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించాలని కాంగ్రెస్ సర్కారు తీసుకున్న నిర్ణయం.. రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. ఇది భవిష్యత్తు రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని వ్యూహాత్మకంగా తీసుకున్నదా.. లేక రాజకీయంగా చేసిన తప్పిదమా అన్న దానిపై చర్చ నడుస్తోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉన్నందునే లోతైన విచారణ కోసం సీబీఐకి అప్పగించామని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నా.. భవిష్యత్తు రాజకీయాల దృష్ట్యా తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయమేనని కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయమని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీకి సీట్లు తగ్గినా.. తెలంగాణలో మాత్రం రెట్టింపు సీట్లు రావడానికి బీఆర్ఎస్ ఓటు బ్యాంకు పెద్ద ఎత్తున ఆ పార్టీకి బదిలీ కావడమే కారణమని కాంగ్రెస్ నేతలు విశ్లేషించిన సంగతి తెలిసిందే. అయితే బీఆర్ఎస్ ఓటు బ్యాంకులో.. బీజేపీ వ్యతిరేకులూ పెద్ద ఎత్తున ఉన్నారు. వచ్చే ఎన్నికల నాటికి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని నమ్మించగలిగితే బీఆర్ఎస్‌లోని బీజేపీ వ్యతిరేకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పట్ల ఆకర్షితులవుతారని ఆ పార్టీ అంచనా వేస్తోంది. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించడం ద్వారా.. కేసీఆర్‌పై విచారణఅంశాన్ని బీజేపీ కోర్టులోకి నెట్టారన్న ప్రచారం జరుగుతోంది.

వారంతా కాంగ్రెస్‌లోకే..

కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించాలంటూ ఎప్పట్నుంచో బీజేపీ నేతలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. అయితే అనూహ్యంగా రేవంత్ ప్రభుత్వం.. ఆ కేసును సీబీఐకి అప్పగించడంతో త్వరితగతిన విచారణ జరిపించాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకత్వంపై పడినట్లయింది. ఈ కేసు విచారణ ఆలస్యమైతే బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటేనన్న ప్రచారాన్ని ప్రజలు క్రమంగా నమ్ముతారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి కాంగ్రెస్ వైపునకు వచ్చి చేరతాయని అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ముస్లింలు, సోషలిస్టు భావాలు కలవారు కాంగ్రెస్ వైపునకు పూర్తిగా వచ్చి చేరతారని చెబుతున్నారు. ఈ పరిణామం వచ్చే లోక్‌సభ ఎన్నికలతో పాటుగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు అనుకూలంగా మారుతుందంటున్నారు. సీబీఐ తన విచారణను వేగవంతం చేసి.. అక్రమాలు జరిగాయని తేలిస్తే.. కాళేశ్వరంపై విచారణను ప్రారంభించినందుకు ఆ క్రెడిటూ కాంగ్రెస్ ఖాతాలోకే చేరుతుందని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించడం.. తమ ప్రభుత్వం చేతికి చిక్కిన కేసీఆర్ జుట్టును తీసుకెళ్లి బీజేపీకి అప్పగించినట్లే ఉందన్న అభిప్రాయమూ కొందరు కాంగ్రెస్ నేతల్లో వ్యక్తమవుతోంది. ఘోష్ కమిషన్ విచారణ నివేదిక ఆధారంగా సిట్ ద్వారా విచారణను ప్రభుత్వం చేపట్టాల్సిందన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగించడంతో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనన్న ప్రచారాన్ని ఇక మీదట బీఆర్ఎస్ ఉధృతం చేస్తుందంటున్నారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేసే పనిలో ఉన్న బీజేపీ.. విచారణను వేగవంతం చేసి బీఆర్ఎస్ ముఖ్య నేతల అరెస్టుల దాకా వెళితే అది ఎటు దారి తీస్తుందోనన్న సందేహాన్నీ వారు వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మంలో కుండపోత!

మహబూబాబాద్ జిల్లాలోనూ భారీ వర్షం.. కొత్తగూడెంలో 19.2 సెం.మీ. వర్షపాతం

- పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు
- భద్రాచలం వద్ద తగ్గిన వరద ఉధృతి
- నేడు, రేపు అతి భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): ఉమ్మడి ఖమ్మం జిల్లాను వాన ముంచెత్తగా.. మహబూబాబాద్ జిల్లాలోనూ పలు చోట్ల భారీ వర్షం పడింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు కురిసిన వానలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. చాలా గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల పంటపొలాలు నీట మునిగాయి. కొత్తగూడెం జిల్లాలో 7.98 సెం.మీ., ఖమ్మం జిల్లాలో 5.2 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొత్తగూడెంలో 19.2 సెం.మీ., అదే జిల్లా చుంచుపల్లిలో 17.6, ఇల్లెందులో 15 సెం.మీ. వర్షం కురిసింది. కొత్తగూడెంలో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. విద్యానగర్‌కాలనీలోని కొత్తగూడెం-ఖమ్మం ప్రధాన రహదారిపై వర్షపు వరదనీరు భారీగా చేరింది. లక్ష్మీదేవిపల్లి మండలంలో పెద్దకాల్వ పొంగిపొర్లడంతో ఇందిరానగర్, శ్రీనగర్ గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. పినపాక మండలంలోని పెద్ద వాగు, ఇల్లెందు మండలంలోని మసివాగు, జెండాల వాగు ఉధృతితో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. ఇటు ఎగువన భారీ వర్షాలు లేకపోవడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. సోమవారం ఉదయం 7.37 గంటలకు 42.9 అడుగులకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఖమ్మం జిల్లాలో కొణిజర్ల, చింతకాని, సత్తుపల్లి, పెనుబల్లి, వైరా మండలాల్లో వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఖమ్మం వద్ద మున్నేరు 14 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. మహబూబాబాద్ జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలైన గూడూరు, కొత్తగూడ, బయ్యారం, డోర్నకల్, గార్ల మండలాల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు మండలాల్లో మొక్కజొన్న పంటలు నేలవాలాయి.



ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పగిడేరు వాగు

నేడు, రేపు అతి భారీ వర్షాలు

రాష్ట్రంలో మంగళ, బుధవారాల్లో కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అలాగే చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ రెండు రోజులకు పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

పడిగాపులు.. తోపులాటలు!

- యూరియా కోసం రైతుల ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పంపిణీ కేంద్రాలు, దుకాణాల ముందు రేయింబవళ్లు బారులు తీరి పడిగాపులు కాస్తున్నారు. చాలా చోట్ల తోపులాటలు, గలాటాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా దొరక్కపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై, మాడ్గులపల్లిలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై సోమవారం రైతులు బైఠాయించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తొర్రూరు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిపైనా 4 గంటల పాటు ఆందోళన చేపట్టడంతో కిలోమీటర్ల కొద్దీ వాహనాల నిల్చిపోయాయి. ఇదే జిల్లాలోని కేసముద్రంలో టోకెన్ల కోసం తోపులాట జరగ్గా.. పలువురు రైతులు గాయపడ్డారు. అలాగే, రంగారెడ్డి జిల్లా పెద్దేముల్‌లోని రైతు సేవా సంఘానికి 220 బస్తాలు రాగా.. రైతులు ఒక్కసారిగా ఎగబడడంతో తోపులాట జరిగి ఓ రైతు తీవ్రంగా గాయపడ్డారు. భారీ సంఖ్యలో రైతులు తరలిరావడంతో కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయం వద్ద యూరియా పంపిణీలో తోపులాట జరిగింది. ఇల్లెందు మండలం కొమరారంలో రైతులు రాస్తారోకో నిర్వహించగా.. న్యూడెమోక్రసీ నాయకులు మద్దతు ప్రకటించారు. మెదక్ జిల్లా రామాయంపేట, మనోహరాబాద్, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో అన్నదాతలు రోడ్లపై బైఠాయించారు. కాగా, వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురంలో యూరియా దొరకడం లేదన్న ఆవేదనతో కౌలు రైతు బిక్కీ చెన్నకేశవులు భవనంపైకి ఎక్కి దూకేసేందుకు ఆత్మహత్యాయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకున్నారు.

ప్రభుత్వ టీచర్లకు 'టెట్' గండం

- రెండేళ్లలో అర్హత సాధించకుంటే ఇంటికే :సుప్రీం తీర్పు..
- రాష్ట్రంలో 30వేల మంది ఉపాధ్యాయులపై ప్రభావం

హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నియామకం కావాలంటేనే కాదు.. ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ సర్వీసులో కొనసాగాలన్నా.. పదోన్నతులు పొందాలన్నా.. ఇక ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్) తప్పనిసరి. దీనికి సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ప్రభుత్వోపాధ్యాయులుగా కనీసం ఐదేళ్ల సర్వీసు ఉన్నవారంతా టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణత కావాల్సిందే అని స్పష్టం చేసింది. ఇందుకోసం రెండేళ్ల గడువు విధించింది. అర్హత సాధించని వారు తమ ఉద్యోగాలను కోల్పోవాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొంది. పదవీ విరమణకు ఐదేళ్ల లోపున్న ఉపాధ్యాయులకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. అయితే, వారు కూడా పదోన్నతులు పొందాలంటే టెట్ అర్హత సాధించాల్సిందే. ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాలనుకునే వారికి టెట్ పరీక్ష తప్పనిసరి చేస్తూ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ 2010లోనే నిబంధన విధించింది. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు తొలిసారి టెట్ తప్పనిసరి చేశారు. ప్రస్తుత సుప్రీం తీర్పు ప్రభావం రాష్ట్రంలో 2012కు ముందు ఉద్యోగంలో చేరిన దాదాపు 30వేల మంది ఉపాధ్యాయులపై పడనుంది.


బీబీనగర్ ఎయిమ్స్ పనులు 84 శాతం పూర్తి

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రి రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు సిద్ధమవుతోందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రూ.1365.95 కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్ రూపుదిద్దుకుంటోందని కేంద్ర మంత్రి సోమవారం ఎక్స్ వేదికగా తెలిపారు. ఎయిమ్స్ భవనాల చిత్రాలను ఆయన ఎక్స్‌లో పంచుకున్నారు. ఇప్పటికే ఎయిమ్స్ నిర్మాణ పనులు 84 శాతం పూర్తయ్యాయయని చెప్పారు. 33 విభాగాలు ప్రారంభమైయ్యాయని.. ఆస్పత్రి విశాంత్రి గృహం, ఆయూష్‌బ్లాక్, అతిథి గృహం, కమ్యూనిటీ బిల్డింగ్, యూజీ విద్యార్థుల వసతి గృహాలు,అకడమిక్ బ్లాక్ నిర్మాణాలు పూర్తయాయ్యయని వివరించారు.

మునిసిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం నుంచి వివరాలు తెలుసుకుని తమ ఎదుట ఉంచాలని అదనపు అడ్వకేట్ జనరల్‌కు స్పష్టం చేసింది. ఈ ఏడాది మార్చి 25న నిర్మల్ మున్సిపాలిటీ పదవీకాలం ముగిసినా.. ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించకపోవడాన్ని సవాల్ చేస్తూ రాజేందర్ అనే రైతు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నరేశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మున్సిపాలిటీల్లో ఎన్నికైన సభ్యులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గడువు ముగిసిన స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణ ప్రక్రియ చేపట్టాల్సిన రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ).. ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వాదించారు. ఎస్ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది జి. విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. వార్డుల పునర్విభజన వంటి ముందస్తు ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి, రిజర్వేషన్లను తెలియజేస్తే ఎన్నికల నిర్వహణకు కమిషన్ సిద్ధంగా ఉందన్నారు. శాంతిభద్రతలు, ఎన్నికల విధులు, ఇతర సిబ్బంది.. వంటి అంశాల్లో ప్రభుత్వం సిద్ధంగా ఉంటేనే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వం వివరణ సమర్పించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణ మంగళవారానికి వాయిదా వేసింది.

ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా బతుకమ్మ వేడుకలు

- 21న వేయి స్తంభాల గుడి వద్ద సంబరాలు
- 27న ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ కార్నివాల్
- 28న 10వేల మంది మహిళలతో వేడుక
- బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, సీతక్క



హైదరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది బతుకమ్మ సంబరాలను ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా అపూర్వ రీతిలో నిర్వహించనున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ నెల 21న వరంగల్ వేయి స్తంభాల గుడి వద్ద బతుకమ్మ సంబరాలను ఆరంభించి, 30వ తేదీ వరకు రాష్ట్రం నలుమూలలా అన్ని వర్గాల మహిళలు ఉత్సాహంగా పాల్గొనేలా పర్యాటక, సాంస్కృతిక శాఖలు కార్యాచరణ రూపొందించాయని చెప్పారు. 28న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో 10 వేల మందికి పైగా మహిళలు గిన్నిస్ రికార్డు లక్ష్యంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటారని తెలిపారు. సోమవారం సచివాలయంలో జూపల్లి మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన 'రియో కార్నివాల్' తరహాలో రాష్ట్రంలో బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించనున్నామని తెలిపారు. 22 నుంచి 24 వరకు ప్రతి రోజూ 3-4 జిల్లాల్లో ముఖ్య ఆలయాలు, పర్యాటక, సాంస్కృతిక ప్రదేశాల్లో బతుకమ్మ వేడుకలు ఏర్పాటు చేస్తామన్నారు. 25 నుంచి 4 రోజుల పాటు మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బతుకమ్మ ఇతివృత్తంలో కళా శిబిరం,పీపుల్స్ ప్లాజాలో మహిళా స్వయం సంఘాల ఆధ్వర్యంలో సరస్ బజార్ నిర్వహిస్తామన్నారు. 27న హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద బతుకమ్మ కార్నివాల్ జరుగుతుందని తెలిపారు. 28న బతుకమ్మ సైకిల్ పరేడ్ రైడ్, 29న మహిళల బైకర్ రైడ్, 30న వింటేజ్ కార్ల ర్యాలీ ఏర్పాటు చేస్తామన్నారు. 29న పీపుల్స్ ప్లాజాలో బతుకమ్మ పోటీల్లో ఐటీ, ఇతర రంగాల ఉద్యోగులు పాల్గొంటారన్నారు. 30న ట్యాంక్ బండ్ వద్ద పూలతో అలంకరించిన శకటాల ప్రదర్శన, ఫ్లోరల్ హోలీ నిర్వహిస్తామని తెలిపారు. హుస్సేన్ సాగర్ జలాల్లోకి బతుకమ్మ ఆకారంలో అలంకరించిన తెప్పలను (ఫ్లోట్స్) విడుదల చేస్తామని చెప్పారు. ఆడబిడ్డల పోరుగడ్డ వరంగల్‌లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తొలి బతుకమ్మ వేడుకలు నిర్వహించడం విశేషమని మంత్రి కొండా సురేఖ అన్నారు. బతుకమ్మ పండుగ పువ్వులనే కాకుండా చెరువులను సైతం పూజించే పండుగ అని మంత్రి సీతక్క చెప్పారు.

సీపీఎస్ రద్దు హామీని నిలబెట్టుకోవాలి

పాత పింఛన్‌ను పునరుద్ధరిస్తే ఉపాధ్యాయుల హృదయాల్లో చిరస్థాయిగా రేవంత్‌రెడ్డి

- లేకుంటే సీపీఎస్‌ను రద్దు చేసే సర్కార్‌ను తెచ్చుకుంటాం: ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి
- ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా
- నల్ల దుస్తులతో వేలాది మంది నిరసన

హైదరాబాద్, రాంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి చగన్‌లాల్ రోజ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానం అమల్లోకి వచ్చిన సెప్టెంబరు 1ని ఉపాధ్యాయులు పెన్షన్ విద్రోహ దినంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన భారీ ధర్నాకు పలు జిల్లాల నుంచి వేలాదిగా ఉపాధ్యాయులు తరలివచ్చి నల్ల దుస్తులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో పేర్కొందని, దీన్ని వెంటనే అమలు చేసి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పాత పింఛన్‌ను పునరుద్ధరిస్తే ఉపాధ్యాయుల హృదయంలో సీఎం రేవంత్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని, లేనిపక్షంలో సీపీఎస్‌ను రద్దు చేసే ప్రభుత్వాన్ని తెచ్చుకుంటామని హెచ్చరించారు. పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరిస్తేనే ప్రభుత్వానికి ఉపాధ్యాయుల మద్దతు కొనసాగుతుందని, సీపీఎస్‌ను రద్దు చేసే దాకా ఉపాధ్యాయుల ఆందోళనలు కొనసాగుతాయని చెప్పారు. చగన్‌లాల్ రోజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దయిందని, ఈ ఆందోళనతో తెలంగాణలోనూ రద్దవుతుందన్న నమ్మకం కలుగుతోందన్నారు. పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆందోళనలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ ఏలూరి శ్రీనివాస రావు పాల్గొని మద్దతు తెలిపారు. సీపీఎస్ రద్దు విషయమై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమం తీవ్రతరమవుతుందని ఉద్యోగుల జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



ఇందిరా పార్క్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు

పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలి : కోదండరాం



పాత పెన్షన్ పథకం పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సీపీఎస్ ఉద్యోగుల సభ జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీఎం, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్తానన్నారు. మార్క కొమురయ్య మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే ఉద్యోగుల డిమాండ్ న్యాయమైనదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానన్నారు. యూనియన్ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబరు 1 ఉద్యోగులకు విద్రోహ దినమని, సీపీఎస్ ఉద్యోగులకు శాపంగా మారిందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు కె.రామకృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పాత పింఛన్ పథకాన్ని ఏడాదిలోగా పునరుద్ధరించాలి

ఉద్యోగుల జేఏసీ తీర్మానం

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఏడాది లోపు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని ఏకవాక్య తీర్మానం చేశామన్నారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం 'పాత పింఛన్ సాధన పోరాట సభ'ను హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీపీఎస్ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. సీపీఎస్ అమల్లోకి వచ్చిన 2004 సెప్టెంబరు 1 నుంచి ఏ ఉద్యోగి కుటుంబానికి భద్రత, భరోసా లేదన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ప్రతి నెలా షేర్ మార్కెట్‌కు వెళ్తున్న రూ.450 కోట్ల ఉద్యోగుల సొమ్మును ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం వినియోగించాలని కోరారు. ఏలూరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలిత నాలుగు రాష్ట్రాల్లో పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించారని, తెలంగాణలోనూ ఈ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ..సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. పాత పింఛన్ విధానాన్ని సాధించే వరకు విశ్రమించేది లేదన్నారు. యూటీఎఫ్ అధ్యక్షుడు చావ రవి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఐక్య పోరాటం ద్వారా ఏ సమస్యనైనా పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, ఎస్టీయూ అధ్యక్షుడు సదానంద గౌడ్, టీపీటీఎఫ్ నేత అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.